# తానా పత్రిక


Telugu Association of North America

❖ Volume - 24 ❖ Issue - 3 ❖ October-November 2014






బాపు నివాళి
ప్రత్యేక సంచిక

"Creating Equity For The Future"
Since 1982

We invest in Real Estate.
We take pride in multiplying your assets.
We stand strong on our commitment.
Let us work for you!

My Heartiest Congratulations and
Best Wishes to

TANA

in its efforts to serve the social,
cultural and educational needs
of the Telugu community
in North America and
across the world!



Chowdary 'Charlie' Yalamanchili
President

CNC INVESTMENTS LTD LLP

4420 FM 1960 West, Suite 224
Houston, TX 77068
(281) 444-1585 Phone
(281) 444-1538 Fax
www.cncinvestments.com
charliey@cncinvestments.com

తానా పత్రిక
Telugu Association of North America
Volume-24 Issue-3
October-November 2014

❋

దేశమును ప్రేమించుమన్నా
మంచి యన్నది పెంచుమన్నా
వొట్టిమాటలు కట్టిపెట్టోయ్
గట్టి మేల్ తలపెట్టవోయ్

❋

ప్రధాన సంపాదకులు/*Chief Editor*
డా. చౌదరి జంపాల
**Dr. Chowdary Jampala**

నిర్వాహక సంపాదకులు/*Executive Editor*
నారాయణస్వామి శంకగిరి
**Narayanaswamy Sankagiri**

సహాయ సంపాదకులు/*Associate Editors*
శ్రీనివాసులు బసాబత్తిన
**Sreenivasulu Basabathina** (USA)

నవీన్ వాసిరెడ్డి
**Naveen Vasireddy** (India)

*Editor's contact information:*
**Narayanaswamy Sankagiri**
1872 Squirrel Valley Drive
Bloomfield Hills MI 48304
Phone: (248) 495 7629
Email: editor@tana.org

The opinions expressed in TANA Patrika belong to the individual authors and do not necessarily re-flect those of TANA or the Editorial Board.



# భలేవాడు మన బాపుజీ!

భారతదేశంలో ఎవర్నైనా మీరు రాముడి కథ మొదటిసారిగా ఎప్పుడు విన్నారు అంటే ఎవరూ జవాబు చెప్పలేరు, అని బాపుగారు ఎప్పుడూ అంటుండేవారు. ఆ పురాణకథలు జనజీవనంలో భాగమైపోయి, మనచుట్టూ ఆవరించుకొని, ప్రకృతిలో, మన ప్రవృత్తిలో కలసిపోయాయి. అలాగే తెలుగునాట బాపు బొమ్మలు మొదట ఎప్పుడు చూశావు అంటే ఏ తెలుగువాడు మాత్రం జవాబు చెప్పగలడు? చిన్నప్పటి తెలుగు వాచకంలో కలవారి కోడలు కలికి కామాక్షి పాటకు బొమ్మలు చూశామనా? చందమామలో బొమ్మల కథలు చూశామనా? రామయణం బొమ్మల పుస్తకంలోనా? బుడుగు సీగానపెసునాంబలను చూసినప్పుడా? నవోదయా షాపు సైనుబోర్డు మీదా? పత్రికల కథల బొమ్మల్లోనా? కార్టూన్లలోనా? పుస్తకాల అట్టలపైనా? సినిమా ప్రకటనలలోనా? శుభలేఖలపైనా? డ్రాయింగురూం డెకరేషన్లలోనా? భద్రాచలంలోనా? కోటప్పకొండపైనా? రామోజీ ఫిల్మ్ సిటీలోనా? గోడమీద రాతల్లోనా? నోటుబుక్కు గీతల్లోనా? గ్రీటింగ్ కార్డుల పైనా? అ-ఆల పుస్తకంలోనా? వీడియో పాఠాల్లోనా? తెలుగుజగం అంతా బాపుమయం కాదూ! ఎక్కడ ఎప్పుడు చూసుంటాం బాపుబొమ్మని మొదటిసారిగా? ఎన్ని వేల బొమ్మలు చూశాక మనకు తెలిసింది ఇన్ని రకాల బొమ్మలు, ఇంత అందంగా, ఇంతకింత తెలివిగా, ఇంకెంతో హృద్యంగా వేసిన మహత్తర సృజనశీలి- బాపు అనే మన తెలుగాయన- నిగర్వి, స్నేహశీలి, హాస్యప్రియుడు, చమత్కారి, మితభాషి, అల్పసంతోషి. భోళామనిషి, నిరంతరకృషి చేసిన ఋషి అని?

చివరివరకూ నిలుపుకున్న చిన్నపిల్లాడి అమాయకత్వం ఆయనకందిన వరం, పెట్టని ఆభరణం. ఒకపక్క తెలుగు ప్రపంచమంతా అమ్మ బాపోయ్ అంటూంటే, ఆయన మాత్రం బొమ్మలు గీయటం మొదలుబెట్టి దబ్భయ్యేళ్ళయ్యాక కూడా, ఆర్ట్ స్కూల్‌కు వెళ్ళి బొమ్మలు గీయటం నేర్చుకునుంటే బాగుండేదని ఇదైపోతూ ఉండేవారు. ఎనభయ్యో ఏట కూడా, తనకు నచ్చినట్టుగా బొమ్మ వచ్చినప్పుడు, 'బొమ్మ బాగా కుదిరిందండీ,' అంటూ సంబరపడుతూంటే ముఖమంతా సంతోషంతో వెలిగిపోతూండేది. నేను బాపుని, ప్రముఖ చిత్రకారుణ్ణి అన్న స్పృహ ఏమాత్రం ఉండేది కాదు. ఓల్డ్ మాస్టర్స్‌ని చూసి, 'అయ్యబాబోయ్, ఎంత గొప్పగా వేస్తారండీ,' అని సాగిలపడేవారు. ఎంత కొత్తవాడైనా, నచ్చితే, 'ఈ అబ్బాయి బొమ్మలు చూడండి, లైన్ ఎంత బాగుందో, ఆ కార్టూన్ ఐడియా ఎలా ఒచ్చిందోనండీ అతనికి,' అని ఆశ్చర్యపోయి ఆనందించి ఆశీర్వదించేవారు. మనమంతా ఆయన్ని మహాకళాకారుడు అనేస్తూ ఉంటాం కాని, తన బొమ్మలతో సినిమాలతో కళాసేవ చేస్తున్నానని ఆయనకు ఎప్పుడూ తెలీదు. సరదాకో, బ్రతుకుతెరువుకో చేస్తున్నాను అనుకునేవారు.

బాపురమణ ఒక్కటే తెలుగు మాటై కొన్ని దశాబ్దాలపాటు తెలుగు గుండెల్ని రంజింపజేశారు. అది మన అదృష్టం. వారిద్దరూ ఇప్పుడు లేకపోవటం దురదృష్టమే అయినా వారు మనకి వదలి వెళ్ళిన వారసత్వం అమూల్యం, అద్భుతం, అపురూపం. ఆనందంగా దాచుకొని అందరితో పంచుకోవాలి మనం ఆ సంపదను.

బాపుతో తానాకు 30 ఏళ్ళుగా ఉన్న బంధం అమెరికా తెలుగు సమాజాన్ని సుసంపన్నం చేసింది. వ్యక్తిగతంగా మాకు దొరకిన ఆయన 'అవ్యాజ'మైన ప్రేమ, జీనియస్‌ని దగ్గరగా చూసే అసాధారణ అనుభవం మా కుటుంబం అదృష్టం.

బాపు సంపూర్ణ రామాయణంలో, మారాం చేస్తున్న రాముడికి అద్దంలో చందమామను చూపించి మరపించినట్లు కొండంత బాపుని చిన్న అద్దంలో చూపించి గుండెంతా నిండిన బాధను మరపిద్దామని మా ప్రయత్నం. దబ్భయ్యేళ్ళుగా వేసిన బొమ్మలు, తీసిన సినిమాలు, చేసిన పనులు కాసిన్ని పేజీలలో పట్టించి పదిలంగా అమెరికాలో ప్రతి తెలుగింటా ఉంచాలని మా సాహసం. స్థలమూ, సమయమూ, వనరులూ విధించిన పరిమితుల్లో వీలైనంతా విశదంగా బాపు జీవితాన్నీ, విశిష్ట వ్యక్తిత్వాన్నీ పరిచయం చేయాలని మా తాపత్రయం. సహకరించిన వారందరికీ మా కృతజ్ఞతలు.

అయినా, మా పిచ్చిగానీ, మరచిపోవటానికి ఆయనేమన్నా జ్ఞాపకమా?

మన జీవితంలో భాగం కాదూ!

జంపాల చౌదరి
ప్రధాన సంపాదకులు

Our Youth are Our Heritage
Est. 1977
www.tana.org

**This Issue is Sponsored...**



**In Memory of late Dr. Kasaraneni Sadasiva Rao and Jayapradamba** **(Guntur)**

by

**Drs. Suresh, Yamuna and Jayaprada Kasaraneni.**

*Portraits by Bapu*

*President*
**Mohan Nannapaneni**
(508) 612-6676; president@tana.org

*Executive Vice President*
**Dr. V. Chowdary Jampala**
(937) 475-7809; evp@tana.org

*Secretary*
**Satish Vemana**
(703) 731-8367; secretary@tana.org

*Treasurer*
**Madhu Tata**
(678) 755-6227; treasurer@tana.org

*Joint Secretary*
**Subbarao Kolla**
(703)728-1573

*Joint Treasurer*
**Anjaiah Chowdary Lavu**
(770) 235-2709

*Chairperson, Board of Directors*
**Dr. Naren Kodali**
(703) 371-5029

*Chairperson, Foundation*
**Jay Talluri**
(631) 523-1999

*Immediate Past President*
**Prasad Thotakura**
(817) 300-4747

*Regional Representatives*
**Anil Lingamaneni** - Canada
(647) 709-9999

**Vijay Gudiseva** - Capital
(703) 400-5047

**Prasad Kolli** - Great Plains
402-201-2276

**Ravi Potluri** - Mid-Atlantic
(267) 252-2496

**Rajani Akurati** - Midwest
(630) 674-4633

**Rao Yalamanchili** - New England
(203) 815-7627

**Jogeswararao Peddiboyina** - North
(248) 946-1520

**Mahidhar Reddy** - Northwest
(425) 802-0219

**Sekhar Kolla** - Rocky Mountains
(480) 252-0210

**Goutham Kumar Gurram** - Southeast
(404) 916-9899

**Dr. Rajesh Adusumilli** - Southwest
(732) 406-6980

**Bhakta Balla** - West
(408) 431-7849


# ఉత్తర అమెరికా తెలుగు సంఘము

## Telugu Association of North America

**(A 501(c)(3) Certified Nonprofit Organization, Established in 1977**

***Our Mission***

**"To identify and address social, cultural and educational NEEDS of North America Telugu Community in particular and Telugu people in general"**

**Web: www.tana.org    email: info@tana.org**



## అధ్యక్షుని లేఖ

తానా మిత్రులకు దసరా, దీపావళి శుభాకాంక్షలు.

అమెరికాలోని మనవారందరికీ శుభం జరగాలనే సదుద్దేశంతో తలపెట్టిన శ్రీ భద్రాచల సీతారామ కళ్యాణ మహోత్సవాలు పదమూడు నగరాల్లో రమణీయంగా జరిగాయి. చాలా వ్యయప్రయాసలతో, భద్రాచలం నుంచి వేద పండితులను, ప్రత్యేక దేవతామూర్తులను తీసుకువచ్చి అమెరికా అంతటా కళ్యాణాలు జరపటాన్ని అందరూ ప్రశంసిస్తున్నారు. ఈ మహత్కార్యానికి అన్నివిధాలా సహకరించిన స్థానిక దేవాలయ పాలకవర్గాలకు, మా తానా కార్యకర్తలకు, దాతలకూ ధన్యవాదాలు.

మరే ఇతర తెలుగు సంస్థలూ కనుచూపు మేరలో అందుకోలేనంతగా తానా చేస్తున్న సేవా కార్యక్రమాలు ఆపన్నులను ఆదుకుంటూ, నిస్సహాయులకు చేయూతనిస్తూ సర్వత్రా అభినందనలు అందుకుంటున్నాయి. టీం స్క్వేర్ వాలంటీర్లు అమెరికా, కెనడా దేశాలలో మనవారికి ఎటువంటి విపత్కర పరిస్థితులు ఎదురైనా వారి పక్కన బాసటగా నిలిచి అవసరమైన సహాయ సహకారాలను అందిస్తున్నారు. ప్రతి సంవత్సరంలాగానే ఈసారి కూడా బ్యాక్ ప్యాక్ పంపిణీ కార్యక్రమాలు పలు నగరాల్లో చురుకుగా జరుగుతున్నాయి.

పేద విద్యార్థులకు ఉపకార వేతనాలు, చిన్నారులకు చిరునవ్వునిచ్చే గ్రహణ మొర్రి చికిత్సలు, పేదలకు కంటి వ్యాధుల చికిత్సా శిబిరాలు, కేన్సర్ నిర్ధారణ శిబిరాలు, వందలాదిమంది అనాథలకు ఆహార సహాయం- ఇటువంటి పలు కార్యక్రమాలు నిరంతరంగా జరుపుతున్న తానా ఫౌండేషన్ ఒకవైపు- తెలుగు భాషా సంస్కృతులను పరివ్యాప్తి చేసే పలు కార్యక్రమాలు, మన తెలుగువారి సమైక్యత, సామాజిక చైతన్యాన్ని పెంచే ఆటలపోటీలు, అమెరికాలోని పేద పిల్లలకు బ్యాక్‌ప్యాక్స్ పంచటంతో పాటు మనవారికి అనుక్షణం అందుబాటులో ఉంటూ తానా అత్యవసర సహాయక బృందం (టీం స్క్వేర్) ద్వారా ఎనలేని సేవలు అందిస్తున్న తానా కార్యవర్గం మరోవైపు- తానా నిధుల సంరక్షణ, ఆశయాల పరిరక్షణ, దీర్ఘకాలిక ప్రణాళికా రచనల రూపకల్పనతో తానా పాలకమండలి మరోవైపు- ఇలా ముప్పేటగా కలసి పనిచేస్తూ తానాని అత్యున్నత స్థాయిలో నిలుపుతున్నాయి. మరెందరో ప్రతిభావంతులైన మిత్రులు, తమ తమ వ్యాపార వ్యవహారాలలో నిష్ణాతులైన వారు, వివిధ కమిటీల ద్వారా తమ అమూల్యమైన సమయాన్ని వెచ్చిస్తూ తానా సంస్థ కార్యక్రమాలను బహు ముఖంగా విస్తరిస్తున్నారు. ఇంతమంది సేవా తత్పరులయిన సహచర మిత్రులతో కలసి పనిచేయటం సంతోషంగా ఉంది.

20వ తానా మహా సభలకు డెట్రాయిట్ నగరం, అక్కడి తెలుగు వారందరూ సిద్ధమవుతున్నారు. సభాస్థలికి అవసరమైన రిజర్వేషన్ల దగ్గర్నించీ కమిటీల ఏర్పాట్ల వరకూ పనులు చురుకుగా జరుగుతున్నాయి. త్వరలోనే మహాసభల ఏర్పాట్లను గురించి మిగతా ముఖ్యమైన వివరాలను మీరు వింటారు.

తెలుగువారు మర్చిపోలేని మహోన్నతుడు బాపుగారు. వారితో తానాకి ఉన్న దృఢమైన అనుబంధంతో వారి జన్మస్థలమైన నర్సాపురంలో బాపుగారి విగ్రహం ఏర్పాటుచేయాలని తానా కార్యనిర్వాహకవర్గం సంకల్పించింది. తెలుగువారందరి సొత్తయిన బాపుగారి సంస్మరణ రూపానికి మీవంతు సహాయం అందించమని కోరుతుంటూ...

మీ
మోహన్

# తానా పత్రిక


| | | |
|---|---|---|
| సంపాదకీయం | ... | 3 |
| అధ్యక్షుని లేఖ | ... | 5 |
| Contribute to Cyclone HudHud Relief | ... | 7 |
| 20th TANA Conference, Detroit Information | ... | 9 |
| తానా ఫౌండేషన్ సేవా కార్యక్రమాలు | ... | 10 |
| 'గీతా(నా)ంజలి' గీత రచన పోటీ | ... | 12 |
| TANA Backpack Donation Program | ... | 15 |
| తానా ప్రచురణలు - కథ 2013, కథ నేపథ్యం-2 ఆవిష్కరణలు | ... | 16 |
| **బాపు స్మృతిలో - బాపు నివాళి ప్రత్యేక కథనాలు** | ... | 17-74 |
| Sitarama Kalyanam Celebrations across the USA | ... | 76 |
| భారత ప్రధాని మోది అమెరికా పర్యటనాలో తానా | ... | 82 |
| అమెరికా కబుర్లు | ... | 83 |
| TANA Matrimonials | ... | 84 |






## TANA EMERGENCY ASSISTANCE MANAGEMENT TEAM - TEAM Square

## TEAM Square 6th ANNIVERSARY

**September 2014 marks the completion of SIX YEARS of activities of TANA TEAM Square**

- Helped in more than 500 Emergency Incidents for Telugu People
- Disbursed a Quarter Million Dollars in Emergency Aid
- Several Thousands of Donors and Hundreds of Volunteers ensure that the emergency needs of Telugu people in North America are met.
- On this anniversary, TANA thanks each and every one of the donors and the volunteers and promises to continue its efforts to help the fellow Telugus caught in emergency situations.

### 6 సంవత్సరాలుగా తానా టీమ్ స్క్వేర్ సేవలు

ఉత్తర అమెరికాలో తెలుగువారికి అత్యవసర పరిస్థితులలో సహాయమందించటానికి తానా స్వచ్ఛంద దళం టీమ్ స్క్వేర్ ఏర్పడి సెప్టెంబరుకు ఆరేళ్ళు. ఈ ఆరేళ్ళలో వందలాది తానా కార్యకర్తలు, వేలాది దాతలు 500 మించి అత్యవసర సంక్లిష్ట సంఘటనలలో చిక్కుకున్న సాటి తెలుగువారికి సాయపడ్డారు. రెండున్నర లక్షల డాలర్లనుమించిన ఆర్థిక సహాయమందించారు.

తానాకు వెన్నుదన్నుగా నిలచిన దాతలకు, కార్యకర్తలకు చేయెత్తి కృతజ్ఞతాభివందనాలు అర్పిస్తూ, తోటి తెలుగువారికి సహాయ మందించటానికి ఎప్పుడూ సిద్ధంగా ఉంటామని తానా ఈ వార్షికోత్సవ సందర్భంగా మరోసారి ప్రమాణం చేస్తున్నది.

**BECOME A TEAM SQUARE VOLUNTEER**

**తానా టీమ్ స్క్వేర్ కార్యకర్తగా చేరండి.**

http://www.tana.org/help-line-team-square/about-team-square

**SUPPORT TEAM SQUARE**

**విరాళాలిచ్చి సాయపడండి.**

https://www.tana.org/foundation/donate

# CONTRIBUTE TO CYCLONE HUDHUD RELIEF

## TANA Announces an Initial Contribution of $100,000

**TANA** is reaching out to all Telugu people living in North America to generously contribute to the relief efforts for the victims of Cyclone Hudhud. TANA has already announced that it will be sending an initial contribution of 100,000 dollars to these relief efforts and will continue to raise funds for further relief activities.

The current picture is grim and TANA intends to help with the rescue and rehabilitation, immediate relief for the displaced and affected people and also assist with long term rebuilding measures. As Andhra Pradesh state is starting to build the infrastructure for a capital and other administrative needs, this catastrophe dealt a severe blow to all these developmental activities. More funds are needed to rehabilitate all the victims, and TANA is putting forward its best efforts to raise the necessary funds and coordinate the relief efforts.



TANA has a proven history of service and has always been in the forefront and provided immediate and long term assistance in similar situations in the past. TANA built more than 800 permanent homes for past flood and cyclone victims in Kurnool, Krishna and Prakasam Districts. Altogether, TANA has contributed more than 40 million dollars for various service and developmental activities in undivided Andhra Pradesh.



Any amount of donation is welcome; even a donation of $25 can help with immediate assistance. Larger donations can help with complete rehabilitation and building of infrastructure. TANA and TANA Foundation will be matching the contributions from individual donations. All the funds collected by TANA for this cause will be directly sent to the relief efforts.

All contributions to TANA are tax-deductible in USA.

Donations to the TANA Flood Relief Fund can be made by credit card at www.tana.org/donate. Checks can be sent in the name of TANA (with a memo "AP Cyclone Relief Fund") to TANA, 2655 Cobb Parkway SE, Atlanta, GA 30339.

*For more information, please contact*

**Mohan Nannapaneni, President, TANA, at 508-612-6676**

## TANA Emergency Assistance Management Team - TEAM Square

*To become a volunteer or for all other communication, contact:*

| | |
|---|---|
| TEAM Square Mentor | **Anjaiah Chowdary Lavu** lachowdary@yahoo.com, 770-235-2709 |
| TEAM Square - East | **Suresh Babu Kakarla** (919) 370-0136 |
| TEAM Square - South | **Srikanth Polavarapu** (248) 497-1029 |
| TEAM Square - West | **Ashok Babu Kolla** (614) 218-1496 |
| | **Mohan Nannapaneni at president@tana.org, 508-612-6676** |

# ADVANTAGE ONE TAX CONSULTING

**Individual Tax | Business Tax | Payroll Tax | Book Keeping**

## Your Personal and Business Tax Partner

## File your 2014 taxes with AO TAX

### The One-Stop Solution for ALL your Tax Filing Needs!

- ✓ Business Incorporation & Entity Structuring
- ✓ Book Keeping
- ✓ Payroll Processing
- ✓ Tax Return Planning, Preparation & Filing
  - *For Your Business
  - *For Your Employees & Yourself

---

Enjoy 9 Free Services......

- FREE Advance Tax Planning Services
- FREE Tax Return Evaluation Services
- FREE Tax Representation Services
- FREE City/County Tax Return Processing
- FREE ITIN Processing
- FREE FBAR & FATCA Processing
- FREE Extension Filing
- FREE Managed Hosting Services
- FREE Consultation with Tax Expert




---

- ***File Your Federal Tax Return (Form 1040 / 1040NR) at $19.95 Only***
- ***File Your Each State Tax Return at $29.95 Only***

BBB RATING A+

BBB Accredited Business with A+ Rating

ISO 9001:2000

ISO/IEC 27001:2005 Certified Company

ENROLLED AGENT

IRS Enrolled Agent

REFER A FRIEND

Refer a Friend and get $10

contact us

**Call us at : 703-584-5533 EXT 201 - 210** **Email : clientsupport@aotax.com**

**www.aotax.com**

# 20th TANA CONFERENCE

## Detroit, Michigan
## July 2-4, 2015



**Gangadhar Nadella**
Conference Coordinator
Ph: 248-613-5943
Nadella10@aol.com

On behalf of Telugu Association of North America (TANA), the Detroit Telugu Community and TANA Conference Committees, I invite you all to attend the 20th TANA Conference at COBO Hall, Detroit, Michigan, during July 2-4, 2015.

As you may know, COBO Hall is located in downtown Detroit, situated on the Detroit River, just across from Windsor, Canada. COBO Hall is under major renovation and the majority work is completed, with a new grand entrance from the riverfront side. We have made reservation for the new ballroom for our banquet facility that accommodates about 2500 people and the main conference hall with a seating capacity for 20,000 + people. We have a contract with two major nearby hotels, the Marriott at the Renaissance Center and Crown Plaza Detroit River front.

We are in the process of forming Conference Committees. Our great Detroit Telugu community has tremendous and overflowing talent in cultural, social, literary and political activities. We are involving all the talented individuals to lead and help in various committees. With the support from Mr. Mohan Nannapaneni, TANA President, and the other TANA leaders, I am confident that we will have a memorable conference in Detroit in 2015.

We are planning a kick-off and fund-raising event for the conference on Oct 25, 2014 at St. Toma Hall, Farmington Hills, MI. We are inviting musicians, singers and mimicry artists for the grand occasion. Please plan to attend the event.

I look forward to seeing you all in Detroit soon.

Thanks...

# తానా ఫౌండేషన్ సేవా కార్యక్రమాలు

## కేన్సర్ స్క్రీనింగ్ క్యాంప్స్







కాన్సర్ మహమ్మారి ఎందరో ప్రాణాలను బలిగొంటోంది. ఆ కేన్సర్ మహమ్మారిని ఎదుర్కోవటానికి మొదలుపెట్టిన మా ఈ చిరు ప్రయత్నమే కేన్సర్ స్క్రీనింగ్ క్యాంపులు. ఈ కార్యక్రమానికి పూర్తి సహాయ సహకారాలు అందిస్తూ ఎంతోమంది ప్రాణాలు కాపాడుతున్న బసవతారకం ఇండో అమెరికన్ హాస్పిటల్, డా॥ కల్పన గారికి, పార్థసారథిగారికి మరియు హాస్పిటల్ సిబ్బందికి మా హృదయపూర్వక ధన్యవాదాలు. డా॥ తులసి పోలవరపుగారి సహాయ సహకారాలు లేకపోతే ఇది సాధ్యం కాకపోయి ఉండేది. ఈ కేన్సర్ క్యాంపులు ఆలోచనని తానా ఫౌండేషన్‌కి పరిచయం చేసి ఎంతో సమయం వెచ్చించి నిర్వహిస్తున్న అశోక్ కొల్లాకి మా ప్రత్యేక ధన్యవాదాలు.

ఎంతోమంది దాతలు ముందుకు వచ్చి తమ ఊళ్లలో లేదా తమకు కావాలనుకొన్న ఊళ్లలో ఈ క్యాంపులు నిర్వహించటానికి డొనేషన్లు ఇస్తున్నారు. ఈ క్యాంపులు సాధారణంగా రెండు రోజులు జరుగుతాయి. బసవతారకం ఇండో అమెరికన్ ఆసుపత్రి సిబ్బంది సుమారు 20 మంది వచ్చి రెండు రోజులలో ఎంతమంది రోగులు వస్తే అంతమందికి వివిధ పరీక్షలు నిర్వహించి, వారికి కేన్సర్ ఉన్నది లేనిది నిర్ధారిస్తారు. ఈ క్యాంపులలో Pap Smear, Mammogram, Ultrasound, X-Ray మొదలైనవి చేస్తారు. ఇప్పటివరకు తానా ఫౌండేషన్ 11 కేన్సర్ క్యాంపులు జరిపి 6000 మందికి పైగా స్క్రీనింగ్ చేసి, 116 మందికి కేన్సర్ ఉన్నది అని నిర్ధారించి, వారిని చికిత్స నిమిత్తం పంపించటం జరిగింది. ఈ కేన్సర్ క్యాంపులు జరగకపోతే వారి పరిస్థితి ఏమై ఉండేదో ఊహించటమే కష్టం. ఈ 11 క్యాంపులు ఆంధ్రప్రదేశ్ మరియు తెలంగాణ రాష్ట్రాలలోని వివిధ ప్రాంతాలలో నిర్వహించటం జరిగింది. ఈ సంవత్సరం పూర్తయేలోపు మరొక 14 క్యాంపులు జరిపించాలన్న లక్ష్యంతో తానా ఫౌండేషన్ ముందుకు వెళుతోంది. ఈ 14 క్యాంపులకు దాతలు ముందుకు వచ్చి అంగీకారం తెలిపారు. ఒక క్యాంపు నిర్వహించడానికి అయ్యే ఖర్చు కేవలం 1500 డాలర్లు మాత్రమే. ఈ అవకాశాన్ని అందరూ వినియోగించు కొని తమతమ ఊళ్లలో లేదా తమకు నచ్చినచోట తమకు ఇష్టమైనవారి పేరు మీద జరిపించి ఈ కేన్సర్ మహమ్మారిని ఎదుర్కోవటంలో మాకు చేయూత నివ్వండి.

## ప్రాజెక్ట్ వారధి

తానా ఫౌండేషన్ నిర్వహించే కార్యక్రమాలలో తలమానికమైనది ప్రాజెక్ట్ వారధి. ఈ ప్రాజెక్ట్‌ని ఇండియాలోని పడాల ఛారిటబుల్ ట్రస్ట్‌తో కలిసి సంయుక్తంగా చేపడుతున్నాము. ఎంతోమంది తల్లిదండ్రులు లేని, తల్లి లేదా తండ్రికాని లేని

పిల్లలు మేనమామల దగ్గర, అమ్మమ్మ తాతయ్యల దగ్గర లేదా చుట్టాల పంచన పెరుగు తున్న అనాధలను అక్కున చేర్చుకొని, వాళ్లను విద్యావంతులను చేయటానికి తమ వంతు కృషి చేయటమే ఈ ప్రాజెక్ట్ లక్ష్యం. ఈ అనాధలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించి, వాళ్లకు కావల్సిన బట్టలు, పుస్తకాలు, ఇతర అవసరమైన అన్ని వస్తువులు చేకూర్చటం జరుగుతుంది. ఈ ప్రాజెక్ట్‌లో భాగంగా వారికి అప్పుడప్పుడు ఆరోగ్యపరీక్షలు చేయించి అవసరమైన చికిత్సను ఇప్పించటమే కాకుండా అవసరమైన విటమిన్లు మరియు పోషక విలువలు కలిగిన ఆహారం ఇవ్వటం జరుగుతుంది. ఈ పిల్లలకు విద్య మీద అవగాహన కల్పించటం, కంప్యూటర్ కోర్సులు మరియు ఇతర సాఫ్ట్‌స్కిల్స్ నేర్పించటం జరుగుతుంది.







పైలెట్ ప్రాజెక్ట్‌గా కాకినాడ దగ్గర ఏలేశ్వరం చుట్టూ ఉన్న గ్రామాలలోంచి 250 మంది పిల్లలు వివిధ తరగతులలో ఉన్నవాళ్లు ఉన్నారు. ఈ ప్రాజెక్టు ద్వారా 250 మంది పిల్లలకు లభించిన ప్రోత్సాహం వలన వారిలో ఆత్మస్థైర్యం పెంపొందింది. ఆ పిల్లలలో వచ్చే మార్పు మాకు ఎంతో ప్రోత్సాహాన్ని ఇస్తుంది. దాని ప్రేరణతో ఈ ప్రాజెక్టుని ఆంధ్రప్రదేశ్ మరియు తెలంగాణ రాష్ట్రాలలోని అన్ని ప్రాంతాలకు విస్తరించాలని సంకల్పించాము. మనలో ప్రతి ఒక్కరికీ ఎంతో కొంత ఇలాంటి అభాగ్యుల జీవితాలను మార్చగలిగిన సామర్థ్యం ఉంది. కాబట్టి ఈ అవకాశాన్ని మనకు ఇచ్చినందుకు కృతజ్ఞతగా ఎంతో కొంతమందికి తోడ్పడుదాం. ఈ ప్రాజెక్ట్ ఆర్కిటెక్ట్ మరియు ఇంప్లిమెంటర్ పెద్ద సూర్యప్రసాద్‌గారికి, ఈ ప్రాజెక్ట్‌ని తానా ఫౌండేషన్‌కు పరిచయం చేసిన దిలీప్ కూచిపూడిగారికి మా ప్రత్యేక ధన్యవాదాలు. తానా ఫౌండేషన్ ప్రాజెక్ట్‌కి డబ్బులు అందజేసిన ట్రస్టీలు, వాలంటీర్లు, డోనర్లకు మా ధన్యవాదాలు.

## క్లెఫ్ట్ లిప్ సర్జరీలు

నవ్వాలంటే నవ్వలేని, తినాలంటే తినలేని అభాగ్యులను ఆదుకోవాలని మొదలుపెట్టిన యజ్ఞమే క్లెఫ్ట్ లిప్ సర్జరీలు. విశాఖపట్నంలో ఉన్న స్మైల్‌కేర్ ఫౌండేషన్‌తో కలిసి ప్రతి సంవత్సరం గ్రహణం మొర్రి ఉన్న పిల్లలకు ఉచితంగా సర్జరీలు చేయించటం జరుగుతుంది.





ఈ సర్జరీలకు ఎంతో మంది ముందుకు వచ్చి విరాళాలు ఇవ్వటం జరిగింది. ఒక ఆపరేషన్‌కు అయ్యే ఖర్చు కేవలం 250 డాలర్లు మాత్రమే. కాని ఈ పిల్లలకు నాలుగు దశలలో సర్జరీలు చేయవలసి ఉంటుంది. వారికి సర్జరీలతో పాటు స్పీచ్ థెరపి ఇవ్వటం జరుగుతుంది. ఈ చిరు ప్రయత్నం ద్వారా ఎంతోమంది పిల్లల ముఖంలో పోయిన చిరునవ్వును తెప్పించటం జరుగు తోంది. ఈ కార్యక్రమాన్ని ఎంతో అంకితభావంతో చేస్తున్న స్మైల్‌కేర్ ఫౌండేషన్ అధినేత డా॥ శివ నాగేంద్రరెడ్డిగారికి మా హృదయపూర్వక ధన్యవాదాలు.

మా ఈ కార్యక్రమాలను ప్రోత్సహిస్తూ మీరందరూ మీకు తోచినంత ప్రతి నెలా 5 లేదా 10 డాలర్లు, 25 లేదా 50 డాలర్లు కాని ఎంతయినా ఇవ్వగలరని ప్రార్థన. మీరు ఇచ్చే ప్రతి డాలరు మీరు ఇచ్చిన దానికి ఖర్చు పెట్టటం జరుగుతుంది. తానా ఫౌండేషన్ జీరో ఓవర్‌హెడ్ ఆర్గనైజేషన్ కావున ప్రతి సెంటు సద్వినియోగం జరుగుతుంది.



**జయశేఖర్ తాళ్లూరి**
ఛైర్మన్, తానా ఫౌండేషన్

**"We Care, We Share, We Serve The Needy"**

**Please visit www.tana.org/foundation**

## 'గీతా(నా)ంజలి' గీత రచన పోటీ

ఒకప్పుడు తెలుగుజాతి గురించిన ప్రబోధ గీత రచనలో పోటీలు నిర్వహిస్తే 'చెయ్యెత్తి జై కొట్టు తెలుగోడా...', 'పాడరా ఓ తెలుగువాడా?' లాంటి జనరంజకమైన పాటలు వెలువడ్డాయి. అదే స్ఫూర్తితో డాలసులో గత సంవత్సరం మే నెలలో జరిగిన 19వ తానా మహాసభల సందర్భంగా తానా, ఆంధ్రజ్యోతి కలిసి, 'తెలుగుభాష' అనే అంశంపై గీతరచన పోటీలు నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ నుండి అమెరికా వరకు వందలాదిమంది కవులు, గేయ రచయితలు ఈ పోటీలలో పాల్గొన్నారు. కన్నెగంటి చంద్రగారు, అఫ్సర్‌గారు, వడ్డేపల్లి కృష్ణగారు ఈ పోటీలకు న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు.

చక్కని చిక్కని కవిత్వం, క్రొత్తదనం, శిల్పం, గాన సౌలభ్యం కొలమానాలుగా జరిగిన పోటీలో అందరు న్యాయనిర్ణేతలను మెప్పించి భైరవభట్ల కామేశ్వరరావు రచించిన 'తెలుగంటే ఎందుకో తీయని పులకింత' పాట ప్రథమ బహుమతి రూ. 10116ని గెలుచుకుంది. దండెబోయిన పార్వతీదేవి గారి 'అందమైన నా తెలుగు' పాట రెండవ బహుమతి రూ. 5116, జెజ్జాల కృష్ణమోహనరావుగారి 'తెలుగులో పాడుతా తీయగా' పాట మూడవ బహుమతి రూ. 3116 గెల్చుకున్నాయి. ఇవిగాక అత్యుత్తమ రచనలుగా మొదటి పన్నెండు స్థానాల్లో ఉండవల్లి సూర్యచంద్రరావు, వీరెల్లి రవి, కేయస్సెమ్ ఫణీంద్ర, గరిమెళ్ళ నారాయణ, తుమ్మూరి రామ్మోహన్‌రావు, వురిమళ్ళ సునంద, టీవీ రామదాస్, ప్రజాగాయకుడు వంగపండు, రెడ్డి రామకృష్ణగారి పాటలు ఎంపికయ్యాయి.

ఈ మంచి పాటలు పదికాలాల పాటు తెలుగువారిని అలరిస్తాయని తానా మాజీ అధ్యక్షులు తోటకూర ప్రసాద్, 19వ తానా మహాసభల సాహిత్యవేదిక సమన్వయకర్త మద్దుకూరి విజయ చంద్రహాస్ ఆశిస్తూ పోటీలో పాల్గొన్న వారందరికీ కృతజ్ఞతలు తెలియజేశారు.

భైరవభట్ల కామేశ్వరరావుగారు చెన్నై వాస్తవ్యులు. వృత్తిరీత్యా సాఫ్ట్‌వేర్ సంస్థలో పనిచేస్తున్నా, ప్రవృత్తి రీత్యా తెలుగు భాషా, సాహిత్యాల మీద ఎంతో ఆసక్తి. ఈమాట, సుజనరంజని మొదలైన అంతర్జాల పత్రికలలో తెలుగు పద్యసాహిత్యం గూర్చి వ్యాసాలు వ్రాస్తుంటారు. పద్యమంటే మక్కువతో తెలుగుపద్యం అనే బ్లాగు నిర్వహించారు.

# తెలుగంటే ఎందుకో తీయని పులకింత

**భైరవభట్ల కామేశ్వరరావు**

తెలుగంటే ఎందుకో తీయని పులకింత
తెలుగుమాట వింటే ఉప్పొంగిపోవు మనసంతా

నరనరాల ఉరకలెత్తు తరతరాల తెలుగుదనం
అణువణువున బుట్టు వేయి వసంతాల చిగురింత

అమరవాణి నందనవన పారిజాత పరీమళము
తేనెలూరు జానుతెనుగు సిరిమల్లెల కమ్మతావి
పారసీక జబానులో గులాబీల ఖుష్బూలు
ముచ్చటగా, ముప్పేటగ, మురిపించే రంగరింత

ప్రవాసాన ఒంటరిగా నివాసముండేటప్పుడు
హఠాత్తుగా ఒక్కసారి అమ్మ గుర్తుకొచ్చినపుడు
త్యాగరాజుకీర్తనో, అన్నమయ్య పదమో,
కరుణశ్రీ పద్యమో, ఘంటసాల గళమో,
గాలిలోన తేలివచ్చి కమ్మగ చెవి సోకగానె
గుబులంతా తీరి కలుగు కొండంత నిశ్చింత

నన్ను నన్నుగా నిలిపే నాన్నభాష తెలుగు
నిన్ను నన్ను కలిపే మన అమ్మభాష తెలుగు
ప్రపంచాన్ని చుట్టిన సంపన్న భాష తెలుగు
శ్రమజీవుల కండరాల శక్తి భాష తెలుగు
పలుకే బంగారమైన పాతభాష తెలుగు
కులుకే సింగారమైన కొత్త భాష తెలుగు
నిరంతరం ప్రవహించే జీవభాష తెలుగు,
సజీవభాష తెలుగు
తెలుగంటే అందుకే తీయని పులకింత
తెలుగుమాట వింటే ఉప్పొంగిపోవు మనసంతా

# అందమైన నా తెలుగు

## డా. దండెబోయిన పార్వతీదేవి

అందమైన నా తెలుగు
అల్లుకొనెడి నా తెలుగు
జున్నుపాల తీపి కన్న సన్నజాజి తీవ కన్న
అమ్మ ఒడిని హాయి కన్న కమ్మనైన నా తెలుగు

గోరుముద్ద పాపాయికి గోగుపూలు తెచ్చిఇచ్చి
గోవులిళ్ల చేరే వేళ గోధూళికి కెంపుకూర్చి
జావళిగ శ్రమను మలచు జానపదుని అలుపు
దీర్చి అచ్చుల కుచ్చులను దోపి- అవని సాగె
నా తెలుగు
॥నా తెలుగు॥

దండి విజయనగర ప్రభల పూలదండ మెడను
దాల్చి ఓరుగల్లు శిల్పమ్ముల ధీర లాస్యగతులు
పేర్చి నాగార్జున బోధలెరిగి నాట్యమాడె నా తెలుగు
తుంగ కృష్ణ అలల కతలు- తుళ్లిపాడె నా తెలుగు
॥నా తెలుగు॥

పసగొన్న కైతలెల్ల పసిడి కోకగ చుట్టి
అల నన్నయ అన్నమయ్య చిన్నయ్యల నొడిని కట్టి
జాతి శీలసౌభాగ్యము జగతి నింప సాగెనదిగో
పూర్ణకుంభరాశి- కోటి పుణ్యమ్ముల నా తెలుగు
॥నా తెలుగు॥



డా॥ దండెబోయిన పార్వతీదేవి కర్నూలు వాస్తవ్యులు. తెలుగు లెక్చరర్‌గా పనిచేస్తున్నారు.

# తెలుగు పాడుతా తీయగా

## జెజ్జాల కృష్ణమోహనరావు

తెలుగులో పాడుతా తీయగా
తెలుగు మాటాడుతా హాయిగా
ప్రతి క్షణము ప్రతి దినము
ప్రతి వరుసము హరుసముగా...

వేకువనే సూరీడు- వెచ్చగ నను లేపగా
మ్రాకులలో కోకిలలు మధురముగా
గూయగా
దూకెద నే నదిలోన త్రుళ్లి స్నాన మాడగా
మోకరిల్లి దేవునికి ముదము మీఱ వేడగా

తెలుగులో పాడుతా తీయగా
తెలుగు మాటాడుతా హాయిగా
ప్రతి క్షణము ప్రతి దినము
ప్రతి వరుసము హరుసముగా...

బడులలోన నుదయాన బాలలతో
నవ్వుచు
గుడులలోన ప్రార్థించ గుండెలోతు
త్రవ్వుచు
సడులు నిండు వీధిలో సరకులు గొన
నెంచుచు
అడుగడుగున నడకలో నందఱి
బలికించుచు

తెలుగులో పాడుతా తీయగా
తెలుగు మాటాడుతా హాయిగా
ప్రతి క్షణము ప్రతి దినము
ప్రతి వరుసము హరుసముగా

సంజెల నారింజలో చల్లని చిఱుగాలిలో
మంజుల సుస్వరముతో మసక మసక
వెలుగులో
రంజిల నాకసములో రాజిలు తొలి తారతో
కుంజముగల పూలతో గూటిలోని గువ్వతో

తెలుగులో పాడుతా తీయగా
తెలుగు మాటాడుతా హాయిగా
ప్రతి క్షణము ప్రతి దినము
ప్రతి వరుసము హరుసముగా...

నీరవమగు రాత్రిలో నిద్రబోవు ధాత్రిలో
హారి చంద్రకాంతిలో నందమైన భ్రాంతిలో
చేరువగల ప్రియతమను చేతులతో
దాకుచు
మారుని విరిసెజ్జపై మైకముతో
బ్రాకుచు

తెలుగులో పాడుతా తీయగా
తెలుగు మాటాడుతా హాయిగా
ప్రతి క్షణము ప్రతి దినము
ప్రతి వరుసము హరుసముగా...

అమ్మ నేర్పె పాలిచ్చి యచ్చ తెలుగు
మాటలు
చిమ్మెడు నవి తేనియలు చెలువాలకు
మాటలు
సొమ్ములు బంగారమ్ము- సురుల నీటి
బాటలు
తెమ్మనవే చాలు నీ- తెలుగు తేట
మూటలు

తెలుగులో పాడుతా తీయగా
తెలుగు మాటాడుతా హాయిగా
ప్రతి క్షణము ప్రతి దినము
ప్రతి వరుసము హరుసముగా...



జెజ్జాల కృష్ణ మోహన రావు (ఫ్రెడరిక్, మేరీలాండ్) - 1980నుండి అమెరికాలో శాస్త్రజ్ఞునిగా దీర్ఘకాల ప్రవాస జీవితం, ప్రస్తుతం NCIలో గౌరవనీయ శాస్త్రజ్ఞుడు. ఛందస్సు మీద విస్తారంగా వ్యాసాలు; పాటలు, పద్యాలు, రాశారు. అనువాదాలు. సుభాషితాల సంకలనం చేశారు. ఛందశ్శాస్త్రంలో కృషి, పరిశోధనకు గాను విరోధినామ (2009) సంవత్సరపు బ్రౌన్ పురస్కారం.

# JOIN TANA TODAY

## by visiting www.tana.org/membership/how-to-become-a-member

### Please Support

- TANA Foundation
- TEAM Square
- TANA Publications
- Cultural & Service Activities

*You can donate by credit card at*

**www.tana.org/donate and check the appropriate box, or send a check in the name of TANA to Treasurer's address below**

తానాలో సభ్యులుగా చేరాలంటే

**www.tana.org/membership/how-to-become-a-member-**

తానా ఫౌండేషన్, టీమ్ స్క్వేర్, తానా ప్రచురణలు, ఇతర తానా సహాయ, సాంస్కృతిక కార్యక్రమాలలో సహాయపడాలంటే www.tana.org/donateకు వెళ్లి క్రెడిట్ కార్డు ద్వారా విరాళాలివ్వవచ్చు. చెక్కుల రూపంలో తానా పేర విరాళాలు పంపవలసిన చిరునామా

**Madhu Tata, Treasurer, TANA**
**2655 Cobb Parkway SE, Atlanta, GA 30339**




*With Best Compliments From*

**Prasada R. Nalluri,** MDPA
Internal Medicine and Primary Care
920 Medical Plaza Dr
Suite #390
The Woodlands, TX 77380
281-298-7555



# Backpack Donation

## Dallas-Fort Worth, TX





TANA Dallas team with the support of Telugu Association of North Texas (TANTEX) organized successful backpack programs in various schools in the Southwest region.

Over 600 backpacks have been donated to needy children in HEB Independent School District in Euless on August 16th, City of Fort Worth on August 23rd, and Hope Medrano Elementary School in Dallas on August 30th. The donation program in Fort Worth is organized at Brighter Outlook Community Center and the program is attended by Fort Worth City Mayor Betsy Price, Texas State Representative Nicole Collier, City of Fort Worth Council Woman Gyna Bivens and representatives from Dallas Cowboys team. They all appreciated TANA's service initiative of "giving back to the community". Dallas City Council Member Adam Medrano attended the donation program in Dallas.

Thanks to Ramu Narne, Chairperson for TANA Backpack Program, local prominent leaders Dr. Navaneethakrishna Gorrepati, Dr. Prasad Thotakura, Ram Yalamanchili, Manjulatha Kanneganti, Murali Vennam, Srikanth Polavarapu, Samba Dodda, Paramesh Devineni, Anil Veerapaneni, LK Gorrepati and all TANTEX members who supported these donation programs by providing their time, donations and energy to make them a grand success. The programs were coordinated by Southwest Regional Representative, Dr. Rajesh Adusumilli. Thanks to our President Mohan Nannapaneni garu and other TANA leaders who are providing their continued support to this wonderful program through the years.

# డెట్రాయిట్‌లో స్కూలు పిల్లలకు బ్యాగుల పంపిణీ

తానా సంస్థ తమ వార్షిక ప్రణాళికలో భాగంగా సెప్టెంబర్ 16 తేదీన డెట్రాయిట్ నగరంలోని మార్క్‌ట్వైన్ ఎలిమెంటరీ స్కూల్ పిల్లలందరికీ ఉచితంగా స్కూల్ బాగులను పంపిణీ చేసింది. 350 మంది పైగా హాజరైన ఈ కార్యక్రమంలో తానా రీజనల్ రిప్రజెంటేటివ్ జోగేశ్వర పెద్దిబోయిన, తానా ఫౌండేషన్ సెక్రెటరీ శ్రీనివాస గోగినేని, ఫౌండేషన్ ట్రస్టీ నిరంజన్ శృంగవరపు, డెట్రాయిట్ తెలుగు అసోసియేషన్ ప్రెసిడెంట్ వేణు సూరపరాజు, గత ప్రెసిడెంట్ రఘు రావిపాటి, ట్రెజరర్ రమేశ్ పెద్దేటి, డోనర్ చిన్మయ్ దేశ్‌పాండే, హర్ష పోలవరపు తదితరులు హాజరైనారు. ప్రిన్సిపల్ లిండా, వైస్ ప్రిన్సిపల్ ముంతాజ్, ఇతర ఉపాధ్యాయ సిబ్బంది ఈ సందర్భంగా సంతోషం వ్యక్తం చేస్తూ తానా సంస్థను అభినందించారు. కార్యక్రమం చివరిలో పిల్లలంతా స్కూలు బ్యాగులు ధరించి తిరుగాడుతూ చక్కటి ఉత్తేజకర వాతావరణం సృష్టించారు. సుమారుగా 5 వేల మందికి ఈ విధంగా పంపిణీ జరిగిందని, ఇటువంటి అనేక కార్యక్రమాలు ఇక ముందు కూడ ఎన్నో జరుగుతాయని తానా నాయకత్వం ప్రకటించింది. కార్యక్రమం మొత్తాన్ని జోగేశ్వరరావు పెద్దిబోయిన చక్కని ప్రణాళికతో నిర్వహించారు.

# డెట్రాయిట్‌లో లేడీస్ నైట్ ద్వారా తానా ఫౌండేషన్‌కు విరాళం

మొదటిసారిగా డెట్రాయిట్‌లో మయూరసఖి వారిచే సెప్టెంబర్ నెల 13న స్థానిక ఫార్మింగ్‌టన్ హిల్స్‌లోని సేంట్ తోమ హాల్‌లో లేడీస్ నైట్ అత్యంత విజయవంతంగా జరిగింది. ఈ కార్యక్రమానికి గాయని సునీత, స్టేజ్ యాంకర్, ఆర్టిస్ట్ ఉదయభాను విచ్చేసి కిక్కిరిసిన ఆడిటోరియమ్‌లో ఆటపాటలు, డాన్సులతో మహిళలందరిని ఉర్రూతలూగించారు. ఈ కార్యక్రమంద్వారా సమకూరిన మొత్తాన్ని సుమారు 20 మంది బాలికల క్లెఫ్ట్ లిప్ ఆపరేషన్స్‌కై తానా ఫౌండేషన్‌కు విరాళాన్ని ప్రకటించటాన్ని ప్రతి ఒక్కరూ అభినందించారు. ఈ కార్యక్రమ విజయానికి మహిరెడ్డి, పద్మజ నందిగామ, శిరీష ఉప్పలపాటి, కలా రాణి, శిరీష రావిపాటి,



శారదరెడ్డి, రాణి అల్లూరి, భారతి అయిత, అనితా బొమ్మానవేణి, శిరీష ప్రతాప, పద్మ సనం, శారద కాసుల, మనోరమ గొంది తదితరులు విశేష కృషి జరుపగా డాక్టర్ అరుణ బావినేని, దుర్గ గొనుగుంట్ల తదితరులు ఆర్థిక సహాయాన్ని అందించారు. శిరీష ద్వయం చేసిన నెమలి కాన్సెప్ట్ డెకొరేషన్ వాతావరణం ఉత్తేజపరచి అందరి ఆదరాభిమానాన్ని ఆందుకుంది.



# కథ నేపథ్యం-2 ఆవిష్కరణ

34 మంది ప్రముఖ కథకుల కథలతో, వాటి నేపథ్యాలతో తానా సంస్థ ప్రచురించిన కథ నేపథ్యం-2 ఆవిష్కరణ సభ ఆగస్టు 21న హైదరాబాదు రవీంద్రభారతిలో ఘనంగా జరిగింది. 25 మంది ప్రముఖ కథకుల కథలు, నేపథ్యాలతో కథ నేపథ్యం-1 గత సంవత్సరం విజయవాడ పుస్తక మహోత్సవంలో విడుదలయ్యాక రెండో భాగం ఇప్పుడు విడుదలైంది. సభకు కథా సాహితి సంపాదకులు వాసిరెడ్డి నవీన్ స్వాగతం పలుకగా, ఓల్గా అధ్యక్షత వహించారు.

గత ఐదేళ్లుగా పుస్తకం డాట్‌నెట్ వెబ్‌సైట్‌ను నిర్వహిస్తున్న పూర్ణిమ ఈ పుస్తకాన్ని ఆవిష్కరించి, తొలి ప్రతిని ఆంధ్రజ్యోతి అసిస్టెంట్ ఎడిటర్ వేమన వసంతలక్ష్మికి, మలిప్రతిని రచయిత గొరుసు జగదీశ్వరరెడ్డికి అందజేశారు. ఈ సభలో ముఖ్య అతిథిగా విచ్చేసిన తానా కార్యనిర్వాహక ఉపాధ్యక్షులు జంపాల చౌదరి మాట్లాడుతూ, ఇప్పటివరకూ వెలువడిన తానా ప్రచురణల నేపథ్యాన్ని వివరించారు. ఈ రెండు భాగాలలోని కథలను, వాటి నేపథ్యాల గురించి ముఖ్యాంశాలను క్లుప్తంగా సభకు పరిచయం చేశారు. తానా



ఆవిష్కరణ సభలో సీతారాం, ఆర్.ఎమ్. ఉమామహేశ్వరరావు, జంపాల చౌదరి, ఓల్గా, ఆవిష్కర్త పుస్తకం డాట్‌నెట్ పూర్ణిమ, వేమన సతీష్

కార్యదర్శి వేమన సతీష్ ఇటువంటి ప్రచురణలకు తానా తన వంతు సహాయ సహకారాలు అందిస్తుందని ప్రకటించారు. ఈ పుస్తకానికి సహ సంపాదకులు ఆర్.ఎం. ఉమామహేశ్వరరావు కథా నేపథ్యాన్ని వివరించగా, ప్రముఖ కవి సీతారాం ఈ పుస్తకాన్ని సోదాహరణంగా విశ్లేషించారు. అనంతరం కొంతమంది కథకులు కృతజ్ఞతలు తెలుపుతూ తమ కథల నేపథ్యాన్ని వినిపించారు.

# కథ 2013 ఆవిష్కరణ

కథాసాహితి తరపున వాసిరెడ్డి నవీన్, పాపినేని శివశంకర్ సంపాదకత్వంలో, తానా ప్రచురణల కమిటీ సహకారంతో 24 సంవత్సరాలుగా నిరాటంకంగా వెలువడుతున్న కథా సంకలనాల పరంపరలో రూపొందిన *కథ-2013* సంకలనం ఆవిష్కరణ సభ నెల్లూరులో ఏప్రిల్ 13న ప్రభవ సాహితీసంస్థ ఆధ్వర్యంలో జరిగింది. ప్రముఖ రచయిత్రి శ్రీమతి చంద్రలత అధ్యక్షతన జరిగిన సమావేశంలో ప్రముఖ కథారచయిత శ్రీరమణ *కథ 2013* సంకలనాన్ని ఆవిష్కరించారు. మంచి కథలతో మంచి సాహిత్యం, మంచి సాహిత్యంతో మంచి సమాజం ఏర్పడతాయని, కథ మంచి ఆలోచనలు రేకెత్తించాలని రచయిత శ్రీరమణ తమ ప్రసంగంలో చెప్పారు. యువ రచయితలు వారి భావాలను స్వేచ్ఛగా వ్యక్తంచేసి ప్రజల హృదయాల్లో నిలిచిపోయే కథలు రాయాలని ఆయన సూచించారు.



*కథ 2013 ఆవిష్కరిస్తున్న రచయిత శ్రీరమణ. చిత్రంలో వి. ప్రతిమ, చంద్రలత, కె. శివారెడ్డి, పాపినేని శివశంకర్, వాసిరెడ్డి నవీన్ తదితరులు*

రచయిత ఎంచుకునే ఇతివృత్తం బలంగా, శైలి సరళంగా ఉండాలని సాహితీవేత్త శివారెడ్డి చెప్పారు. దేశంలో 24 ఏళ్లుగా నడుస్తున్న సాహితీ కథాసంకలనం తమ దొక్కటేనని కథాసాహితి సంపాదకులు వాసిరెడ్డి నవీన్ తెలిపారు. పాఠకులు పుస్తకాలు కొని చదవాలని, మిత్రులకు పుస్తకాలను బహూకరించాలని ఆయన సూచించారు. ఈ సంకలనాన్ని డా॥ వి. చంద్రశేఖరరావు సమీక్షించారు. వి. ప్రతిమ కథాసాహితితో తమకున్న అనుబంధాన్ని వివరించారు. గొప్ప కథ గొప్ప అన్వేషణ నుంచి పుడుతుందని, అలాంటి రచయితలను అన్వేషించి వారి రచనలను సమాజానికి తెలపడమే తమ లక్ష్యమని పాపినేని శివశంకర్ చెప్పారు. ప్రభవ నిర్వాహకురాలు, రచయిత్రి చంద్రలత మాట్లాడుతూ- పిల్లల్లో సృజనాత్మక వికాసానికి కథాపఠనం మంచి మార్గమన్నారు. అనంతరం జరిగిన రచయితలతో ముఖాముఖి కార్యక్రమంలో మధురాంతకం నరేంద్ర, ఆర్.ఎం. ఉమామహేశ్వరరావు, స.వెం. రమేష్, చంద్రశేఖరరావు, సత్యవతి, ప్రతిమ, సునీల్‌కుమార్ పాల్గొన్నారు.

ఈ సంకలనంలోని అమెరికా తెలుగు రచయితలు అనిల్ ఎస్. రాయల్, యాజి రాసి పంపిన కథా నేపథ్యాలను చంద్రలత చదివి వినిపించారు.




ఈ పుస్తకాలు కావలసిన వారు తానా ప్రచురణల కమిటీ పేరున ఈ క్రింది అడ్రస్‌కు కథ 2013కు $12 డాలర్లు, కథ నేపథ్యం-2కు $25 చెక్కు పంపి తెప్పించుకోవచ్చు.

**V. Chowdary Jampala**
**20374, Buckthorn Ct.,**
**Mundelein, IL 60060**

# బాపు స్మృతిలో...



15 డిశంబరు 1933 - 31 ఆగస్టు 2014





## 1945

The first published drawing of Sri Bapu in 1945 in 'BALA' magzine.




అడవిలో పుట్టింది
అడవిలో పెరిగింది
మా ఇంటి కొచ్చింది
మా అమ్మ మెచ్చింది.

•

రాటేసి కట్టింది
కడవలో దూరింది
[illegible] తక్కు లాడింది
గుజ్జుమన్నారి.

•

పెరుగులో మునిగింది
వెన్నంత తెచ్చింది
నా కింత పెట్టింది
రాటేమొ తినదే.

[illegible]



## బాపు స్మృతిలో...


**తానా జ్ఞాపికలో బాపు...**

తానా జ్ఞాపిక 'తెలుగుపలుకు'లో బాపు జ్ఞాపకాలు ... 19

చికాగో తానాలో బాపు గీత, రమణ రాతల స్వర్ణోత్సవం ... 20

Seventy Years of Bapu's Art
*V. Chowdary Jampala* ... 21

బాపుగారూ – చంద్ర కన్నెగంటి ... 26

బొమ్మ వెనుక కథ – తొలి ఉత్తరం ... 27

**బాపుతో మనం...**

బాపు – ముళ్లపూడి వెంకటరమణ ... 29

ఒక్కడే మహాను'బాపు'డు ... 33

ఆయనది అంతర్జాతీయ స్థాయి – త్రివిక్రమ్ శ్రీనివాస్ ... 37

The Light of India - Sita Kalyanam
*- Derek Malcolm* ... 40

చమత్కార్యం – శ్రీరమణ ... 42

బాపు స్టోరీ బోర్డ్ – సుధామ ... 44

ఇంకో తోక కొమ్మచ్చి – ముళ్లపూడి అనూరాధ ... 46

**బాపు గురించి బాపు...**

నా గాడ్‌ఫాదర్... గురించి కాస్త
నా బొమ్మల కథ మరికాస్త – బాపు ... 49

బాపుగారి చివరి ఇంటర్వ్యూ
*రమణగారు లేని జీవితం కష్టంగా ఉందండీ!* ... 54

కథ – మబ్బూ వానా మల్లెవాసనా
*సత్తిరాజు లక్ష్మీనారాయణ (బాపు)* ... 59

మా సినిమాలు – బాపు ... 63

బాపు కార్టూన్లు ... 68

బొమ్మర్షి బాపు ... 70

బాపు క(క్లె)వర్ పేజీలు ... 71

అందరి మనిషి – భానుమతి ... 73




# తానా జ్ఞాపిక 'తెలుగువెలుగు'లో బాపు జ్ఞాపకాలు






















# చికాగో తానాలో బాపు గీత, రమణ రాతల 'స్వర్ణోత్సవం'

బాపుతో తానాకు దాదాపు మూడు దశాబ్దాల అనుబంధం ఉంది. 1985లో లాస్ ఏంజెల్స్‌లో జరిగిన తానా సమావేశాలకు బాపు ముఖ్యఅతిథి. అమెరికాలో తొలిసారిగా అప్పుడే బాపు బొమ్మల ప్రదర్శనలను తానా లాస్ ఏంజెల్స్, చికాగో, ఇతర నగరాలలో నిర్వహించింది. బాపు చాలా తానా సమావేశాలకు లోగోలు డిజైన్ చేశారు, సావెనీర్లకు ముఖచిత్రాలు సమకూర్చారు.



1995లో చికాగోలో జరిగిన దశమ తానా సమావేశాల్లో, తానా సావెనీర్ కమిటీ (అధ్యక్షులు ఉప్పులూరి సుబ్బారావు, సంపాదకుడు జంపాల చౌదరి) ఆధ్వర్యంలో బాపు గీత, రమణ రాతల మొదటి ప్రచురణల 50వ వార్షికోత్సవాన్ని ఘనంగా జరిపింది. ఈ స్వర్ణోత్సవ వేడుకలలో భాగంగా, యాభై ఏళ్ళ బాపు బొమ్మల్ని సమీకరించి, యస్.పి.బాలసుబ్రహ్మణ్యం వ్యాఖ్యానంతో, సుమధుర సంగీతంతో తయారైన రెండు గంటల బాపు బొమ్మలకొలువు వీడియో, అప్పటి వరకు ప్రచురితం కాని ముళ్ళపూడి వెంకటరమణ రచనలతో, బాపు బొమ్మలతో వెలువడిన బొమ్మా-బొరుసూ పుస్తకం ఆవిష్కరించబడ్డాయి. బాపు-రమణల చలన చిత్రోత్సవం, బాపు బొమ్మల ప్రదర్శనలు ఏర్పాటు చేయటమేకాక, తొలిసారిగా బాపు బొమ్మల రంగుల పోస్టర్లు, రమణగారి పుస్తకాలు అభిమానులకు అందుబాటులో ఉంచారు, సావనీర్‌లో చాలా భాగం బాపు-రమణలకే ప్రత్యేకించబడింది. రమణగారు అస్వస్థులైన కారణంగా సమావేశాలకు హాజరు కాలేకపోయినా, ఇరువురి తరపున బాపు అంబాసడర్ సిద్ధార్థ శంకర్ రే వద్ద నుండి జ్ఞాపికల్ని, సత్కారాన్నీ స్వీకరించారు. రెండు రోజులు వరుసగా జరిగిన బాపుతో ముఖాముఖీ సమావేశాలను అభిమానులు ఇప్పటికీ గుర్తు చేసుకుంటూ ఉంటారు.



ఈ అనుబంధం నేపథ్యంలో, బాపు జన్మదినం (డిశంబరు 15, 2014) రోజున ఆయన జన్మించిన నర్సాపురంలో బాపు శిలావిగ్రహాన్ని తానా ఆవిష్కరించబోతోంది. బాపు-రమణల పేర స్కాలర్‌షిప్‌లు, ప్రభుత్వ సహాయంతో తెలుగునాట వారి పేర ఒక ఫైన్-ఆర్ట్స్ కళాశాలను ఏర్పాటు చేయటానికి కూడా తానా తనవంతు కృషి చేస్తుంది. ❀



1995లో చికాగోలో జరిగిన తానా దశమ సమావేశాల్లో బాపు గీత-రమణ రాత స్వర్ణోత్సవాల సందర్భంగా బాపును జ్ఞాపికతో సత్కరిస్తున్న భారత రాయబారి శ్రీ సిద్ధార్థ్ శంకర్ రే, చిత్రంలో కేంద్ర మంత్రి శ్రీ రంగయ్య నాయుడు రాష్ట్ర మంత్రి శ్రీ యనమల రామకృష్ణుడు



# Seventy Years of Bapu's Art

*V. Chowdary Jampala*







You have to excuse my audacity in attempting to write about Bapu's pictures. I am not an artist. Neither am I an art critic. Other than admiring some paintings that strike my fancy from time to time, I know very little about art. While I had the good fortune of enjoying for many years the benevolent affection of this genius, this issue already has many articles about Bapu including one by Mullapudi Venkata Ramana himself, a man so close to Bapu that Bapu-Ramana has become a single word in Telugu language.

Then you may well ask why I am doing this. A second generation young man that I know well, recently admired the logo of a Telugu institution. During the course of the conversation, I told him that the logo in question was designed by Bapu. The youngster, who knew Bapu's name from the cartoons in TANA Patrika said, "You mean Bapu draws this kind of pictures as well? I thought he was only a cartoonist." I thought that this may be a good time to introduce this genius of an artist to the younger generation and explain to them why we older people go gaga over him.

I have been a Bapu fan for over five decades. Even before I knew his name, I was struck by the funny cartoons about bookworms that adorned the covers of the Telugu monthly 'Pustaka Prapancham' (Book World), the various cartoons and pictures in 'Jyoti' monthly, and the illustrations that appeared in the popular magazines during my childhood. Growing up in sixties and seventies in Andhra Pradesh, I was smitten by Bapu's pictures and humor, both in print and on screen. My admiration for him as an artist, humorist, and film maker has continued to



*Bapu Art Show, Chicago 1985*

grow over the years. In the past few years, I had a unique opportunity to look at thousands of pictures drawn by Bapu, covering the 70 year span of his paintings, illustrations, and cartoons These pictures, which included originals, illustrations saved from old magazines, xerox or photographic copies, and - more recently - digitized prints, were from private collections of various individuals, all of whom are 'unabashed fans' of Bapu. This has given me a chance to observe the range of his work, and share my lay perspective on these changes in his style over the years.

First, a few words about the artist himself. Bapu is the nickname given by his family members to the young Sathiraju I.akshmi Narayana, son of Suryakanthamma and Venugopala Rao. Growing up in Madras, he became friends with Mullapudi Venkata Ramana, an enduring friendship for which the Telugus are thankful for. The duo was very active in the local Balananda Sangham, a children's club sponsored by a children's radio program. The program's producer and announcer, *Baalannayya* Nyaapati Raghava Rao nurtured and supported the creativity he recognized in these gifted children. Young Bapu, who was already interested in painting, and Ramana who already started to write, even started a hand written magazine, *Udayabhaanu*, during their school years.

Nyaapati Raghava Rao also published a children's monthly, *Baala*. It was almost 70 years ago, in August 1945, that Bapu published his first picture - girl churning butter - in *Baala* (page 19). Ramana also published his first work, a poem, at the same time in Baala.

Bapu, even though his heart was into drawing pictures and studying art, ended up studying law per the wishes of his father, a lawyer. Bapu, however, did not practice law at all. He studied art informally for a time under S.N. Chamakur and Pilaka Lakshmi Narasimha Murty. Soon, he was sought after an art director for leading advertising agencies in India, drawing a salary of 1,500 Rs. a month (in mid-1950s). Over the next few years, he began to illustrate regularly for various magazines and, became a regular at the Andhra Patrika weekly, where Ramana was a staff writer. The early pictures of Bapu are very detailed with lots of lines, shades, and elaborate backgrounds and referred to the scenes from the stories, as the editors preferred them. Bapu's eye for detail and his ability for realistic portrayal can be seen even in this early work.

Bapu's pen and ink sketches of famous Telugu people of the time were immensely popular as were his 'cartunes', portraits of famous personalities coupled with a humorous doggerels about them. One of the works from that period is, The First Letter, a color picture in this issue (page 27) that originally adorned the cover of a special issue of Andhra Patrika weekly. The young woman in that picture is not an unattainable ideal beauty, but a Telugu girl next door, per-







haps a newly wed reading a letter- probably from her husband-in rapt attention. In fact, it is a portrait of Bapu's wife Bhaagyawati, during the early days of marriage (there is a later version of this picture with Bapu's daughter Bhanumathi being the model). The Bapu paintings and pictures from this period (1950s) are mostly of this genre. He adorned his illustrations with a fluent dynamic style of lettering, completely different from the well rounded formal font that was the norm.

During late 50s and early 60s, Bapu's pictures began to simplify. The iconic *Bapu Bomma* (Bapu's painting) began to evolve. One can recognize the trademark eyes, the plaits, the thin waist, and the delicately draped sensuous female figures, alternately innocent or haughty. Some of Bapu's best known pictures including the *Janaardanaashtakam* series are from this period. To be called a *Bapu Bomma* became the ultimate compliment for a beautiful Telugu young girl.

In 70s, Bapu's pictures changed even more. The pictures were getting further simplified and stylized. Now, he is not merely illustrating a scene from the book or the story. His illustrations became a shorthand graphic representation of the essence of the work. The backgrounds to the main illustration began to either disappear or be confined to a small number of important elements.

In 80s, Bapu's pictures changed again. A lot of oriental style curves began to appear in his pictures. The oval and angular faces give way to more rounded faces. The bodies, especially limbs, are a little chubbier. The pictures sometimes look a lot more complex even though the number of lines in the pictures continue to dwindle His script has changed again. The letters are simplified to the extent of losing certain elements (for example, the circles associated with letters - like va - are now gone). By 1995, most of Bapu's pictures are very simple with a minimum number of lines. The background detail that was present in the early works has completely disappeared.

However, some things have remained constant. Bapu's commitment to stick to his Telugu roots in his pictures has remained the same. The pictures are still as stunning, and the illustrations still as clever, a continuing testimony to the old comment by the famous writer Rachakonda Viswanatha Sastry that it is a disadvantage for a writer to have his work illustrated by Bapu since the illustration reveals the entire plot, sometimes even more effectively than the writer him/herself can. The truth is that many writers longed for their works to be illustrated by Bapu and the publishers clamored after him for illustrating the front covers of their books. There was a time when the Telugu bookstores looked like Bapu art galleries.

One of the great things about Bapu is his versatility. It is rare for an artist to be a cartoonist and vice-versa. When an artist tries to draw a cartoon or a cartoonist draws a portrait, one can usually see that their lines still belong to their usual genre. However, Bapu is at once a cartoonist, a caricaturist, an illustrator, a graphics artist, and a painter. And his works in each of these spheres have different styles and different lines, with simplicity and cleverness being the only common features. He experimented in many different styles. He once remarked that whenever he admired a new painter, he tried to imbibe that style.

He drew thousands of illustrations for the Telugu magazines of the last 50 years. There were also thousands of special paintings commissioned as the cover art for maga-



zine special issues. There are book covers, logos, greeting cards, publicity pictures, portraits, and above all cartoons. His cartoons included cartoon stories (Bangaaram-Singaaram etc), political cartoons for newspapers, the cartoon strips featuring the iconic 'Budugu' and 'Gireesam', the cartunes (caricatures coupled with short doggerels), and cartoons that brought out the humor in our daily life. He was also a sought after graphics artist. Many people believed that having their company's logo designed by Bapu brought good luck. The logos that Bapu designed for various companies have become part of the daily Telugu life. The logo Bapu designed for the 1985 Los Angeles TANA Conference (Donald Duck and a Telugu girl greeting each other) is one of my favorites.

That's not all. He also drew several panels to be used in the background for his films. Then, there are his series on the classics for Telugu literature, *Aamukta Maalyada, Janaardanaashtakam,* and *Annamacharya keertanas* to name a few. When Videsandhra Publications published SriSri's *Mahaprasthanam* in facsimile, Bapu has been asked to illustrate it. When Andhrajyoti weekly decided to reprint *Mahaprasthanam,* Bapu again illustrated the verses. His murals of Ramayana adorn the temple complex of Bhadrachalam, his Siva murals the temple complex of Kotappa Konda and the Mahabharata murals in Ramoji Film City complex. He was honored as the *Aasthana Chitrakaar* (Painter Laureate) of the Tirumala Tirupati Devasthaanam.

A discussion about Bapu would be incomplete if we do not talk about his Ramayana. Bapu, who made several films with Ramayana themes, is a devotee of Rama (all his illustrative work begins with a faintly penciled 'Sri Rama' in Telugu written near the top border). He illustrated (in color) and published a book on Ramayana for children, an immensely popular book aimed at people outside of India. He went on to illustrate the other epics, Mahabharata and Bhagavatha as well for children. His depictions of the various deities from the Hindu pantheon and mythology are now ubiquitous in the Telugu land as are those of the iconic characters from Telugu literature.

To understand Bapu's genius as an illustrator, one should look at his work for Satyam Sankaramanchi's *Amaraavati Kathalu* (Navodaya Publishers, 1978). The stories themselves are delicately crafted sensuous works, some of the best in the modern era. Bapu's illustrations for this series often match the stories in their creative excellence. Actually, one doesn't need to go even that far. Look at the illustrations in this issue. Look at that little girl on the cover page of this issue which originally appeared in a TANA Conference souvenir. At first glance, you see a cute little Indian, if not Telugu, girl saying 'Namaste' with folded hands. Look again. You will notice the stars and stripes on the little girl's skirt. This is not just another Indian girl, but one from the Land of the Stars and Stripes, welcoming you or saluting Bapu. Somebody once remarked that Bapu draws 'clever' pictures instead of cover pictures.

His uniqueness as an illustrator can be gleaned from the following incident. Dasarathi, the poet, translated Ghalib's Urdu ghazals into Telugu in early 1960s. Bapu illustrated all these ghazals (incidentally, he drew these pictures in the Persian style). Dasarathi went to Bombay in 1962, to a meet of Urdu poets, bringing along a copy of his book. Whenever the Urdu poets looked at the pictures accompanied by text in Telugu, a language they can't read, they would immediately begin reciting the appropriate ghajal in Urdu. Dasarathi said that when it happened the first time, he thought that his Urdu poet friend lucked out. But, it happened with almost all the illustrations and with other poets as well, making him acknowledge that the artist captured and conveyed eloquently the essence of each of the ghazals.

I have heard people comment that the color drawings by Bapu, particularly the book covers, don't seem depth and look rather flat. A quick look at the color pictures in this section should dispel the notion. A few things need to be mentioned here. One is that Bapu has at times drawn his pictures inspired by the traditional Andhra art, which has been two dimensional. One also needs to realize that the color printing technology available for the Telugu book publishers, until recently, was rather primitive. The artist basically, had to make a line drawing and then specify colors for different regions of the line drawing - sort of like coloring by numbers (referred to as cut colors in the trade). Here, the color choice is rather limited, the colors have to be uniform shades, and overlays of colors is not feasible. This made it really difficult for the artist to provide












depth, other than with a proportional framing of the visual elements. Bapu is a master at using this technique and in proportional placement of the elements, thereby compensating for the limits imposed on him by the available technology. In the last 15 years, with the advances in scanning and printing, Bapu became free to draw the color pictures the way he wanted to and the results can be seen in his more recent pictures (for example, the stunning illustrations for Vamsee's serialized novel, *Manyam Raani*).

Another interesting thing is how Bapu has influenced the art scene in Andhra Pradesh. Many of the graphic artists and cartoonists today try to emulate Bapu unabashedly. Bali's pictures remind one of Bapu from the sixties. Chandra seems to emulate Bapu of the early 70s. Karunakar seemed to emulate Bapu of the late 70s. Every young man with literary or artistic pretensions that I know tried at one time or other to emulate Bapu style of lettering. Once Bapu's script has been captured by S. Muralikrishna of Anu Graphics, Madras, as computerized Telugu font, it has become one of the most popular fonts to be used in Telugu magazines for decorative writing.

Bapu himself admits to many influences on his pictures. He says that whenever he is impressed by a great painter or a new style of painting, he has an urge to draw in that style. It is the main reason why his pictures have changed over the years. He admires the paintings of Sri Pilaka Lakshmi Narasimha Murty and expresses his indebtedness to 'Gopulu', another commercial artist who worked for Andhra Patrika and later became the art director for an advertising agency. He never hesitated to publicly acknowledge the inspiration he derived from old masters to little known cartoonists.

Bapu, who started directing films in 1967, is a celebrated film director achieving both artistic and commercial success. His lyrical ballad of a film, Sita Kalyanam (Sita's Wedding), was exhibited in several international festivals to much acclaim. There is not enough space here to discuss his films in detail.

In early 90s, Ramesh Ravella, Ramakrishna Pillalamarri, and I attempted to translate (the captions of) Bapu's cartoons into English and published them in our TANA Patrika. It was a popular feature. I used to be especially pleased when young readers used to tell me that they looked forward to TANA Patrika because of these cartoons. Youngsters reading this issue can appreciate the depth and breadth of the gifted talent of this artist Bapu, who always ventured to pursue newer horizons with his art, has already enchanted several generations of Telugus and will continue to enthrall many more new generations to come.

Bapu's passing away marks the end of an era in modern Telugu culture. While his art and his memories will live on among the Telugu hearts, his versatile genius will be missed. But, we should count our blessings that we were able to partake from his cup for almost seventy years and rejoice in the gift of many iconic works that are now a permanent part of the Telugu landscape.



*Modified from the original article written for the Souvenir of the 10th TANA Conference in 1995 that celebrated the Golden Jubilee anniversary of the first publication of a Bapu drawing. The author, Chowdary Jampala, is the Chief Editor of TANA Patrika and the Executive Vice President of TANA.*

# బాపుగారూ...

## చంద్ర కన్నెగంటి



బాపు గారూ!
అక్షరాలకు అక్షరాలే మీచేతుల్లో
కొత్తసోకులు చేసుకున్నాయి
ఎంతోమందిని మీకు ఏకలవ్యశిష్యుల్ని చేశాయి

గీత మీ భాష
ఇంద్రజాలికులు మీరు
కలం మీ మంత్రదండం
అవలీలగా సృష్టిస్తారు
అతిలోక సౌందర్యాలెన్నో!

మీ చేతిలో వొంపులు తిరిగిన గీతలో
ఎన్ని భగవద్గీతలు పలికాయో
ఎన్ని రసవద్ఘంగలు వొలికాయో!
మా బతుకుల్లోంచి పారిపోయిన
తెలుగుతనమంతా
మీ బొమ్మల్లోనే దాక్కుంది!

ఎంతమంది కథలకూ, కవితలకూ
మీరు బొమ్మ కట్టారో
ఎన్ని కథలూ కవితలూ
మీ బొమ్మలపై వాళ్ళు అల్లారో

రాజకీయ నాయకుడిలాంటి వారు మీరు
ఎంత తిట్టినా తనను కాదనుకుంటాడతను
ఎంత పొగిడినా ఎవరినో అన్నట్టు
ఉండిపోతారు మీరు

చాలా పొదుపరి మీరు -
మాటల్లోనూ, గీతల్లోనూ!
బొమ్మల్లేకుండా కార్టూనేయడం మీకే తగును!

బాపుగారూ, మీకు నమస్కారం!
మీ కుడిచేతి బొటనవేలికి పదివేల నమస్కారాలు!



దశమ తానా మహాసభలలో (1995) బాపు-రమణల స్వర్ణోత్సవాల సందర్భంగా బాపుతో ముఖాముఖీ సందర్భంలో చదివిన కవిత. రచయిత శ్రీ చంద్ర కన్నెగంటి తానా పత్రికకూ, రెండు తానా సమావేశాల సావెనీర్లకూ సంపాదకత్వం వహించారు. డల్లాస్‌లో నివాసం.



# తొలి ఉత్తరం

**బాపు** అనబడే సత్తిరాజు లక్ష్మీనారాయణకు భాగ్యవతి అనబడే గోవిందరాజుల వేంకట సౌభాగ్యవతికి తెనాలిలో వివాహం జరిగింది. పెద్దలు కుదిర్చిన పెళ్ళి, ప్రేమ వివాహం కాదు. వెంటనే ఆషాఢమాసం రావటంతో, మాటల మాట దేముడెరుగు, పెళ్ళికూతుర్ని మళ్ళీ కలిసే అవకాశమే రాలేదు. కలవటానికి కొన్ని విఫల ప్రయత్నాలు చేసి, చివరికి, ఆమెకి ఒక ఉత్తరం వ్రాయాలనుకున్నారు బాపు. ఆమె అన్నగారు, బాపురమణలకు మంచి స్నేహితుడు, గోవిందరాజుల శ్రీనివాసరావుతో కవరు మీద 'తనకి' అని రాసిపెట్టిన ఉత్తరం ఇచ్చి పంపించారు. మూడు రోజులైనా జవాబు రాలేదు. నాలుగోనాడు చెప్పాపెట్టకుండా అత్తగారి ఇంటికి వెళ్ళి చూస్తే- తలుపులు ఓరగా వేసి ఉన్నాయి. ఆ సందులోంచి బాపు, రమణలు చూసిన దృశ్యం (రమణ మాటల్లో):

"అద్భుతమైన దృశ్యం- ఒక చక్కని చుక్క- ముద్దరాలు- గదిలో ఓ మూల నేలమీద ఒద్దికగా కూర్చుని- ఒక కాయితం (ఉత్తరమే) చదువుతోంది. ముఖం తామరపూవులా వెలుగుతోంది... ఒక్క క్షణం... ఆ సౌందర్యాన్ని, ఆ భంగిమని, ఆ కాంతిని క్షణకాలం చూశాడు బాపు..."

ఈలోపు మరదళ్ళు, బావమరదులు చుట్టూ మూగటంతో అక్కణ్ణుంచి వెంటనే వెళ్ళిపోయాడు.

నాలుగు వారాల తరువాత, డిశంబరు *16, 1959* ఆంధ్రసచిత్ర వారపత్రిక పై 'తొలి ఉత్తరం' అనే పేరుతో చక్కని రంగుల ముఖచిత్రం వచ్చింది. అప్పుడు ఆంధ్రపత్రిక సంపాదకత్వం నిర్వహిస్తున్న నండూరి రామ్మోహనరావుగారు, భానుమతి అనే అమ్మాయి నాయికగా ఆ ముఖచిత్రం చుట్టూ ఓ కథ కూడా అల్లారు. ఆ ముఖపత్రచిత్రం ముగింపు:

"అది ఆమెకు లేకలేక వచ్చిన మొదటి లేఖ. అంతకుమునుపు మాటాడ్డమేగాని ఆయన ఉత్తరాలు ఎన్నడూ రాయలేదు- పెళ్ళయి ఏడాది కావచ్చినా. చదవబోయే ముందు చుట్టూ ఓసారి చూసుకొని, నెమ్మదిగా భయంగా చూపులు మొదటివాక్యం మీద నిలిపింది... ఆమె చూపులు రెండో వాక్యం మీదికి సాగి మూడో పంక్తిలోకి జారిన తరువాత ఆమె చెంపలలో వెలగబోయే కెంపుల కాంతి రంగులలో ఇమడకపోవచ్చు; వాక్యాలలో అమరకపోవచ్చు. మనం ఒప్పుకున్నా మానినా భానుమతి భర్త నమ్మకం అదే. అందుకే చిత్రకారుడు 'బాపు' ఓ క్షణం ముందరే, తొలి వాక్యం చూడగానే తొలి మందహాసం వెలిగే క్షణాన్నే బొమ్మ వేయడానికి శుభముహూర్తంగా నిర్ణయించుకున్నాడు."

అన్నట్టు నండూరివారి కథలో కథానాయకుడి పుట్టినరోజు డిశంబరు *15 (బాపు లాగే).*

పదిహేడేళ్ళ తరువాత నండూరి వారి సారథ్యంలోనే ప్రారంభమైన వనితాజ్యోతి మాసపత్రిక ఆరంభ సంచికకు *(జూన్ 1978)* బాపు గారితో మళ్ళీ ఈ అంశంతోనే ముఖచిత్రం గీయించుకున్నారు. ఈసారి ఈ బొమ్మ గురించి శ్రీరమణగారు వ్రాశారు. ఆ వ్యాసం ఇప్పుడు అలభ్యం.

గమ్మత్తేమిటంటే, ఈ రెండో బొమ్మకు మోడల్ పేరు- నిజంగానే భానుమతి. బాపుగారి అమ్మాయి.





Publication of this painting is sponsored by
**Smt. Bharathi Chukkapalli,** Burr Ridge, IL



Publication of this painting is sponsored by

**Drs Krishna Sarada and Ramesh Bathina,** Aurora, IL



# బాపుతో మనం...

*బాపు షష్టిపూర్తి సందర్భంగా 5 డిశంబరు 1993*
*ఈనాడు ఆదివారం అనుబంధంలో*
*శ్రీ ముళ్లపూడి వ్రాసిన ప్రత్యేక వ్యాసం*





**ముళ్లపూడి వెంకటరమణ**



చిత్రం: సురేష్

'...ప్పవాడు... బాపు గొప్పవాడు... బాపు గొ...'

'ఏవిటా గ్రాంఫోను రికార్డు?'

'నీకు సిక్స్టీ యియర్స్.'

'లేదు రెండే చెవులు.'

'కాదు ఏళ్లు. అరవై నిండి...'

'నాన్సెన్స్ నా వయసు పదహారు... దట్సాల్. ఎండ్ దటీజ్ ఫైనల్,' అంటాడు- రోజుకి 18 గంటలు పనిచేసే బాపు. ఎవరైనా ఎదురై దండం పెడితే తన వెనకెవరో పెద్దాళ్లున్నారని వెనక్కి చూసే బాపు... విగరుమోతు, పొగరుమోతు...

చూడగలిగే సంగీతంలో పాడగలిగేది సగమే. మనసు పాడుకునే సంగీతాన్ని నోటి పాటలోకి దించితే దాని సొగసు సగానికి సగం అయిపోతుంది. 'ఆన్ హర్డ్ మెలోడీస్ ఆర్ స్వీటర్ స్టిల్,' అన్నాడు ఆ ఆనందాన్ని ఎరుకపరచుకున్న మహాకవి.

అలాగే మనసుకు కనిపించే మనోహర సౌందర్యాన్ని మాటల్లో వర్ణించబోతే చిక్కి సగమైపోతుంది. మంచి రచన చదువుతున్నప్పుడు మన మనసులో రూపాలనూ దృశ్యాలనూ చిత్రకారుడు రేఖాచిత్రాలలోకి అనువదించితే అవి కుదించి సగమైపోతాయి.

అలా సగమైపోకుండా- వాటి అందాన్ని రెట్టింపు చేసే శిల్పం పేరే బాపు. బాపు బొమ్మలు రచనలకు రేఖానువాదాలు కావు. అపురూప సుందర వ్యాఖ్యానాలు. ఒక నవ్వు, ఒక చూపు, ఒక సిగ్గు, ఒక అలక... బొమ్మలు మాట్లాడతాయి, నటిస్తాయి, వెక్కిరిస్తాయి, పలకరిస్తాయి, రెచ్చగొడతాయి... హాయినిస్తాయి.

చేతికిచ్చిన 'లోవెలుగుల్ని' బోధపరచుకుని ఎరుక పరుచుకుని- దానికి పై సంగతి వేస్తూ చిత్రాన్ని రూపొందించే శిల్పం పేరే బాపు. అందుకే- 'తన రచనకి బాపు చేతిబొమ్మ వేయించాలన్న సరదా ఎంతుంటుందో అంత భయమూ వేస్తుంది. బాపు బొమ్మ కథని నమిలి మింగేసి కొత్త సంగతేసి రాసిన వాడికేం మిగలకుండా చేస్తుంది,' అని రావిశాస్త్రి












గారు ఒకసారి నవ్వుతూ బాధపడ్డారు.

పండితులు, రచయితలు, గాయకులూ, నటులూ, నాయకులూ, మాన్యులూ, సామాన్యులూ ఎందరివో- దాదాపు తెలుగు వెలుగులందరి చిత్రాలూ వేశాడు బాపు.

ఫోటోలో కన్న పోలికలెక్కువచ్చాయి. ఫోటోలకే పై సంగతి వేశాడు బాపు అన్నారు అంతా.

భగవద్గీత మీద కీ.శే. త్రిపురనేని రామస్వామి చౌదరిగారు విమర్శ నాత్మక గ్రంథం రాశారు. దానికి బాపు వేసిన ముఖచిత్రం- చౌదరిగారు కృష్ణుడి స్థానంలో కూర్చుని ఉపదేశముద్ర పట్టి గీతను బోధిస్తుంటే, శ్రీకృష్ణుడు అర్జునుడి స్థానంలో మోకరిల్లి కూర్చుని నమస్కరిస్తూ వింటున్నట్టు-

కథలకి చక్కని బొమ్మలు ఎన్నో వస్తాయి. బాగుందని పేజి తిప్పేస్తాం. కాని బాపు వేసిన బొమ్మాయిల కోసం పేజీ మళ్లీ మళ్లీ వెనక్కి తిప్పుతాం. అందం, తెలుగుతనం, సొగసు, లావణ్యం అన్నీ కలబోసుకుని 'బొమ్మ' అవతరించింది. అందమైన అమ్మాయంటే బాపుబొమ్మ అనే అర్థం రూఢి అయిపోయింది.

సాహిత్య ప్రపంచంలో గిరీశం, మధురవాణి, గణపతి, బారిస్టరు పార్వతీశం వంటి పాత్రలలాగే రేఖాచిత్రలోకంలో బామ్మ, రెండుజెళ్ల సీత, రాధాగోపాళం, బుడుగు, సీగాన పెసూనాంబ, కార్టూన్‌లలో లావు పెళ్లాం చిన్న మొగుడు రూపాలు తెలుగు మనసులలో చెరగని ముద్ర వేశాయి. ఇది చిత్రలేఖనంలో చాలా అరుదు.

కొంటె బొమ్మల బాపు
కొన్ని తరముల సేపు
గుండె ఊయలలూపు
ఓ కూనలమ్మ

ఇవాళ బాపు బొమ్మల అభిమానులు మూడోతరం- ఇంకెన్ని తరా లుంటాయో చెప్పడం ఎవరి తరం అన్నారు ఆరుద్రగారు. బాపుగారు ఇప్పటి కెన్ని వేల బొమ్మలేసుంటారండి? చింతచెట్టు కెన్నాకులుంటాయి? అతను ఎన్నిసార్లు ఊపిరి పీల్చి వదులుతాడు?... సరదాగా, సాధనగా, ఏం తోచకా, కావాలనీ, అవసరముండీ, లేకా, కన్ను, ముక్కు, చెవి, కాలూ, వేలూ, తేలూ, పాము... అసలు బాపూ అంటే బొమ్మలు వెయ్యడం అని అర్థం. బొమ్మలు చూడడం, వెయ్యడం, నవ్వడం, నవ్వించడం, పుస్తకాలు చదవడం, పాటలు వినడం, సినిమాలు చూడ్డం- ఇదే అతని నిత్య భోజనం. ఆ భోజనంలో బతక డానిక్కావలసిన మామూలు తిండీ, నిద్ర అనేవి నంచుకునే అప్పడాల లాటివి.

మూడు నాలుగేళ్లప్పుడే విపరీతమైన అల్లరి చేసేవాడు... వాళ్లమ్మ, నాన్న (తను) చెప్పిన మాట వినకపోతే డాబాగోడ మీదెక్కి దూకుతా, దూకుతా అని బెదిరించేవాడు. ఆవిడ భయపడి కిందకి తీసుకొచ్చి నడవాలో స్తంభానికి కట్టి పడేసేది. మరీ ఆవుదూడలా కురచతాడు కడితే అరుస్తాడని పదిహేన డుగుల తాడు కట్టేది. ఆ కాస్తలోనే అటూ ఇటూ పరుగెత్తి బోర్లాపడి గడ్డం చితగ్గొట్టుకునేవాడు... ఆ నల్లపిల్లాడి కెల్లప్పుడూ గడ్డం చివర నెత్తురుబొట్టు సింధూర తిలకంలా వెలిగేది... ఆనక దెబ్బలు బోరుకొట్టి ఆ పక్కన దొరికిన బొగ్గులతో బొమ్మలు గీసేవాడు. వరుసగా గళ్లు గీసి ఓ చివర వాళ్ల నాన్నగారు కాల్చే చుట్ట, దాని పొగ గీసి రైలు రైలు అని గెంతి, పరుగెత్తేవాడు. ఠకీమని లాగ్గానే దభీమని బోర్లాపడి... మళ్లీ సింధూర తిలకం- గడ్డం చివర.

★ ★ ★

అంతకుముందు పత్రికల్లోగాని, సినిమాల్లోగాని, శీర్షికల్లో అక్షరాలు గుండ్రంగా కోలగా నలుపలకలుగా ఉండేవి. బాపు 'ఫ్రీ స్టయిల్' లిపిని తీసుకు వచ్చాడు. వీడికి గుండ్రంగా రాయడం రాక, ఓపిక లేక ఈ వంకరటింకర ఓ ఫాషన్‌గా చెలాయిస్తున్నాడు అన్నారు కాకులు.

ఈ అక్షరాల్లో ప్రాణం ఉంది. శక్తి, చైతన్యాలు తాండవిస్తున్నాయి, ఆ మాటల్లో భావాన్ని వేనోళ్ల ప్రకటిస్తున్నాయి- అవి అక్షరాలు కావు వజ్ర వైఢూర్యాలు అన్నారు లోకులు. అది అక్షరశిల్పం... అది వర్ధిల్లింది.

తెలుగు, తమిళభాష రాతలలో 'అక్షర' విప్లవం వచ్చింది. పత్రికలలో, ప్రకటనలలో, సినిమాలలో, శుభలేఖలలో అవే అక్షరాలు ఒరవడి పెట్టి కొత్త మార్గాలు చూపించాయి. ఇవాళ వంకరటింకరలలో వయ్యారం, సొగసూ తేవడం రానివాడే గుండ్రంగా, కోలగా రాస్తాడు అని జోకు.

ఇటీవల- అనూ గ్రాఫిక్స్ మురళీకృష్ణగారు బాపు సహకారంతో 56

అక్షరాలను 256 ముక్కలుగా భాగించి తలకట్టు, గుడి, గుడిదీర్ఘం, కొమ్ము, కొమ్ము దీర్ఘం, వత్తులు బాపు టైపు రాతను కంప్యూటర్‌లో ప్రవేశపెట్టి విజయం సాధించారు. ఇప్పుడు పత్రికలలో, పుస్తకాలలో, సినిమా టైటిల్స్‌లో, శుభలేఖ లలో బాపు అక్షరాలు అందాల చిందులు వేస్తున్నాయి.

1950-60 మధ్యలో రోజుకి మూడు సినిమాలు చూసేవాళ్లం. అప్పుడు రోజుకి నాలుగాటలు లేవు. విదేశీవాళీవి అయిపోతే దేశవాళీ లాగించేసి, నైట్ షో అయ్యాక కబుర్లు చెప్పుకుంటూ నాలుగైదు మైళ్లు నడుచుకుంటూ ఇల్లు చేరేవాళ్లం. సినిమాలు తీస్తున్న గొప్పవాళ్లు ఎక్కడెక్కడ తప్పులో కాలేశారో, మనమే తీస్తే ఎలా అదరగొట్టేవాళ్లమో- ఈ లోకం మనని గుర్తుపట్టలేక కాకి బంగారంతో ఎలా మురిసిపోతుందో చెప్పుకుని లోకం మీద జాలిపడుతూ, మధ్యమధ్యలో టీలు తాగుతూ రాత్రిపూట పగటికలలు కంటూ, అవే తింటూ ఉండేవాళ్లం... బంగారం సింగారంలాంటి బొమ్మల కథలకి స్క్రీన్ ప్లే రాసుకొని సినిమా సరదా తీర్చుకునేవాళ్లం. ఆ రోజుల్లో (1957) నేను హై నూన్ సినిమా చూసిన ఉత్సాహంతో ఆంధ్రపత్రికలో సాక్షి అనే కథ రాశాను. చావు ఖాయమని తెలిసిన కిష్టయ్య రావిచెట్టు కింద తిన్నెమీద వెల్లకిలా పడుకుని ఎడమ మోకాలు మీద కుడికాలు మడమ ఆన్చి తీవిగా ఏడుస్తుంటాడు. వాడిని చంపడానికొచ్చే పకీరు ఆ కాళ్ల మధ్య త్రికోణంలో చుక్కలా కనిపించి యముడిలా మీదకి వస్తాడు. అపుడు బాపు వేసిన రేఖాచిత్రం అది- 1967లో ఆ కథని సినిమాగా మేమే తీశాం. అందులో క్లైమాక్స్‌లో ఇదే దృశ్యం వచ్చినపుడు అదే కాంపోజిషన్ పెట్టి షాట్ తీశాడు బాపు.

అదే నిర్మాతలుగా మాకూ, దర్శకుడిగా అతనికీ తొలి చిత్రం.

సాక్షినామ సంవత్సరం అని 1967కి మేమే పేరు పెట్టేసి దండోరా కొట్టేశాం- పొగరుగా. కొందరు సరే అన్నారు. కొందరు సరేలే అన్నారు. ఆనాడు సినిమా తీయడానికి కారణం- డబ్బాశ కాదు.

సినిమాలు ఇంకోలా అందంగా, నిజాయితీగా, సహజం అనిపించేలా తీయవచ్చు- అలా తీసినా జనం చూస్తారు అనే నమ్మకం. అది రుజువు చెయ్యాలన్న ఆశా- ఇవే సాక్షి సినిమా తీయడానికి కారణం. అప్పట్లో సినిమాలని ఎక్కువ భాగం స్టూడియో సెట్లలో తీసేవారు. ఒక మనిషి నించుంటే రెండు మూడు నీడలు పడుతూ- సుద్దలా రంగు మెత్తేసిన మేకప్పుతో సినీ మార్కు మాటలతో స్వప్నలోకంలా ఉండేవి- ఏడేళ్ల పిల్లాడు కూడా నాకు విగ్గెలాంటిది, మేకప్పు ఎవరు అనే రోజులు.

సహజ వాతావరణంలో కథ జరిగే స్థలాలలో, కథలో మనుషులు రోజూ వేసుకునే బట్టలు, వాడే మాటలలో కృత్రిమత్వం లేకుండా సినిమా తియ్యాలి. అనవసరంగా మేకప్పు, విగ్గు వాడకూడదు- పూర్తిగా ఔట్‌డోర్‌లో తియ్యాలి- స్టార్ వాల్యూ కన్న కథ మీద ఎక్కువ నమ్మకం ఉంచాలి. అతి తక్కువ బడ్జెట్‌లో తియ్యాలి- ఇవీ మా సరదాలు.

నవయుగ శ్రీనివాసరావుగారిని కలుసుకుని ఈ సంగతులు చెప్పాను. మేము 50 వేలు తేగలం, మీరు రెండు లక్షలిస్తే సాక్షి అనే సినిమా తీస్తాం. బాపు దర్శకుడు. అతనికి షూటింగ్ అనుభవం లేదు- ఎక్కడా నేర్చుకోలేదు. అయినా చెయ్యగలనని అతనికి ధైర్యం. అతని మీద నాకు నమ్మకం అన్నాను.

ఆయన వెంటనే ఆమోదించారు.

'మీరు ఎవరి సిఫార్సు లేకుండా, సూటిగా వచ్చి అడిగినందువల్లే నాకూ నమ్మకం కలిగింది... సినిమా తియ్యడానికి కావలసింది కామన్‌సెన్స్ అండ్ గుడ్ టేస్ట్. మీరు చెయ్యండి,' అన్నారాయన.

రెండున్నర అనుకున్నా రెండు లక్షల ఇరవై వేలలో తీశాం. నాలుగు వారాల్లో డబ్బొచ్చేసింది. సినిమాకి మంచి పేరొచ్చింది. మొట్టమొదటి ఫుల్ లెంగ్త్ ఔట్‌డోర్ చిత్రంగా గుర్తింపు వచ్చింది. దరిమిలాను పరిశ్రమలో చాలామంది స్టూడియో సెట్‌ల ఖరీదులు నచ్చకా, బైటైతే బాగుంటాయనీ లొకేషన్ షూటింగ్‌కే మొగ్గు చూపారు.

సాక్షిలో బాపు తీసిన మొదటి షూటింగ్- కృష్ణ, విజయనిర్మల పాత్రలు పెళ్లి చేసుకునే ఘట్టంలో అమ్మ కడుపు చల్లగా... అనే ఆరు నిమిషాల పాట. మధ్యాహ్నం రెండు గంటలకి మొదలుపెట్టి సాయంత్రం అయిదు గంటలకి పూర్తిచేశాడు. ఆ పాట, చిత్రణ అందర్నీ మెప్పించాయి. తెలుగు సినిమాలో గొప్ప పాటల వరుసలో చోటు చేసుకున్నాయి.

సాక్షిని ప్రభుత్వం తాష్కెంట్ ఫిలిం ఫెస్టివల్‌కి (1968) పంపింది. సోవియట్ రష్యా, మంగోలియాలో చాలాచోట్ల వేశారు. 18 నెలల తరువాత ప్రింటు తిరిగి వచ్చింది.

బొమ్మల్లోలాగే సినిమాల్లో కూడా 'బాపు ఫ్రేం' ఫేమస్ అయింది. బాపు దర్శకుడు కావడానికి నవయుగ వాసుగారు ప్రోత్సాహమిస్తే, కమర్షియల్ సినిమాలో నిలదొక్కుకుని ముందుకు సాగడానికి ఆనాడు ఆదరించి బుద్ధిమంతుడు చిత్రం తీయించినవారు శ్రీ అక్కినేని నాగేశ్వరరావుగారు. ఆనాడు పండితపామర జనరంజకం అనిపించుకున్న బుద్ధిమంతుడు ఈనాడూ ఎప్పుడు ఎక్కడ వేసినా హౌస్‌ఫుల్ కలెక్షన్స్‌లో నడుస్తోంది. ఇరవై నాలుగేళ్ల తరువాత ఇదే చిత్రం బాపు దర్శకత్వంలో ఇప్పుడు హిందీలో నిర్మించబడుతోంది. మిథున్ చక్రవర్తి, జూహీచావ్లా, అమ్రిష్‌పురి నటించారు. సంగీతం బప్పీ లహరి.

బాపుకి బొమ్మలూ సినిమాలూ, నాకు రచనలూ ఒకెత్తు అయితే మేము పిల్లల కోసం తీసిన వీడియో పాఠాలు అంతకు వెయ్యింతల ఆనందాన్ని,







శ్రీ బాపు, వారి శ్రీమతి భాగ్యవతి

తృప్తినీ ఇచ్చాయి. నాటి ముఖ్యమంత్రి శ్రీ ఎన్.టి. రామారావుగారు మాపట్ల నమ్మకంతో, గురితో ఈ ప్రాథమిక విద్యాబోధన మాకు ఒప్పజెప్పారు. ఒకటి, రెండు, మూడు తరగతులకు అ ఆల నుండి వాక్యాల వరకూ అంకెల నుండి లెక్కల వరకూ, తూకాలూ కొల్తలూ, భూమి ఆకాశం నీరు నిప్పు మొదలైన అన్ని విషయాలపై ప్రభుత్వం ఇచ్చిన సిలబస్ ప్రకారం 10 గంటలు వీడియో పాఠాలు తీశాం. పల్లెటూర్లలో పిల్లలను అవి ఎంతో ఆకట్టుకున్నాయి. బడికి వచ్చేవారి సంఖ్య పెరిగింది. మధ్యలో వదిలి పారిపోయేవారి సంఖ్య తగ్గింది. ఈ టేపు ఢిల్లీలోని కేంద్ర విద్యాసంస్థ ఎన్.సి.ఇ.ఆర్.టి. సభ్యులు చూసి దేశం మొత్తం మీద ప్రాథమిక విద్యాబోధనలో ఆంధ్రప్రదేశ్ అగ్రశ్రేణిలో నిలబడిం దన్నారు. అప్పుడు కేంద్ర విద్యామంత్రిగా ఉన్న శ్రీ పి.వి. నరసింహారావుగారు ఈ పాఠాలూ ఈ పథకం చూసి చాలా బాగుందన్నారు. ఈ పద్ధతిలో బోధనలు ప్రారంభించాలని అన్ని రాష్ట్రాలకు లేఖలు వ్రాస్తామని చెప్పారు... వీడియో పాఠాలు తీశాక జన్మ ధన్యమయిందనుకున్నాం.

బాపు దగ్గర సినిమా గురించి చాలా పెద్ద లైబ్రరీ ఉంది. మూకీ సినిమాల నుంచి ఇప్పటిదాకా సినిమాల చరిత్ర, దర్శకుల, నటుల, నిర్మాతల జీవిత చరిత్రలు, ఫొటోగ్రఫీ, సంగీతం, స్పెషల్ ఎఫెక్ట్స్ మీద పుస్తకాలు, ఇంగ్లండు, ఫ్రాన్సు, ఇటలీ, హాలీవుడ్ చిత్రాల కథలు, విమర్శలూ... పక్షికూతల నుంచి బాంబు పేలడం, భూకంపాల దాకా, బిబిసి వారు రికార్డు చేసిన సౌండ్స్ లైబ్రరీ, తను స్వయంగా ఇరవయ్యేళ్లపాటు రికార్డు చేసుకున్న ధ్వని ప్రపంచం టేపులూ, ఇపుడు వీడియోలు వచ్చాక లారెల్ ఎండ్ హార్డీ, చాప్లిన్‌ల నుండి నేటిదాకా ఎన్నో గొప్ప చిత్రాల వీడియో టేపులూ, వెస్టర్న్, హిందుస్థానీ, కర్ణాటక సంగీతాలూ, తెలుగు, తమిళ, హిందీ చిత్రాల పాటలూ కొన్ని వేల గంటల టేపులున్నాయి. వీటన్నిటికీ అకారాదిగా, పేర్లవారీగా, పల్లవుల వారీగా పుస్తకాలలో క్రాస్‌చెక్ ఇండెక్సుతో సహా స్వయంగా రాసి పెట్టుకున్నాడు. ఇంత సమగ్రమైన గ్రంథాలయం చాలా అరుదుగా కనిపిస్తుంది. బాపు సినిమా తీస్తే స్క్రిప్టు, సంగీతం, ఎడిటింగ్, రీ రికార్డింగు, మిక్సింగు దాకా స్వయంగా చూసుకుంటాడు. నన్ను కూడా ఏ పని దగ్గరా నమ్మడు. స్క్రిప్టు ఖరారు అవగానే దానికి షాట్ డివిజన్ చేసి బొమ్మలతో డైలాగులూ కలిపి స్వయంగా రాసుకుంటాడు. అతని స్క్రిప్టు చేతికిస్తే కుర్రవాళ్లు కూడా సినిమా తీయవచ్చు ననిపిస్తుంది.

విగ్గులలాంటి అనవసరపు మేకప్ ఆర్భాటాలూ, నటులు కెమెరాకేసి చూసి డైలాగులు చెప్పే సంప్రదాయం అలవాటు- వాటన్నిటికీ ఎదురీత కొట్టి తన వరకూ తనకి కావలసిన విధంగా చేయించుకుని దరిమిలాను ఆర్టిస్టులు కూడా అభిమానించి, గౌరవించే పద్ధతులు అమలుచేశాడు.

బాపు వందలకొద్దీ సినిమాలు తీయకపోయినా- రంగంలోని పెద్దా చిన్నా నటీనటులందరితో పనిచేశాడు. కృష్ణ, విజయనిర్మల, నాగయ్య, అక్కినేని, శోభన్‌బాబు, చంద్రమోహన్, ఎన్.టి.ఆర్, ఎస్వీ రంగారావు, జగ్గయ్య, జానకి, చిరంజీవి, రాజబాబు, సత్యనారాయణ, సూర్యకాంతం, భానుచందర్, రాజేంద్రప్రసాద్, కృష్ణంరాజు, శ్రీధర్, నరేష్, సురేష్, శ్రీరంజని జూనియర్, శ్రీదేవి, రాధిక, జయప్రద, విజయశాంతి, అంజలి, జయసుధ, సుహాసిని, శారద, వాణిశ్రీ, సంగీత, రావు గోపాలరావు, అల్లు రామలింగయ్య, నూతన్ ప్రసాద్, జె.వి. సోమయాజులు, రాళ్లపల్లి, కాకరాల, సాక్షి రంగారావు, ఎ.వి.ఎస్. (తుత్తి)-

ఉత్తరాదిన సంజీవ్‌కుమార్, నసీరుద్దీన్ షా, అనిల్ కపూర్, మిథున్ చక్రవర్తి, జాకీ ష్రాఫ్, రీనా రాయ్, మాధురీ దీక్షిత్, పద్మిని కొల్హాపురి, అమృతా సింగ్, జూహీ చావ్లా, అమ్రిష్‌పురి, శశి కపూర్, అంజాద్ ఖాన్, తమిళంలో రజనీకాంత్, మేజర్ సౌందర్‌రాజన్-

బాపుతో పనిచెయ్యాలని అమితాబ్ కూడా ఆరోజుల్లో సరదాపడ్డాడు. సంగీత దర్శకులలో మా సొంత సినిమాలకి పాతికేళ్లపాటు కె.వి. మహదేవన్, పుహళేందిగారలయినా, మిగతా చిత్రాలలో ఇళయరాజా, ఎం.ఎస్. విశ్వనాథన్, ఎస్.పి. బాలసుబ్రహ్మణ్యం, సత్యం, ఎ.ఆర్. రహమాన్ (దిలీప్), లక్ష్మీకాంత్ ప్యారేలాల్, బప్పిలహరి, కీరవాణి.

కెమెరాలో విజయాచిత్రాల మార్కస్ బార్ట్లే, సెల్వరాజ్, ఇషాన్ ఆర్య, కె.ఎస్. ప్రసాద్, బాలూమహేంద్ర, బాబాఆజ్మీ, లోక్‌సింగ్, శరత్, పీటర్ పెరీరా, రవికాంత్ నగాయిచ్, కన్నప్ప, ఆర్కే రాజు, థామస్ జేవియర్, మోహనకృష్ణ నందమూరి.

డాన్సు మాస్టర్స్ పసుమర్తి, వెంపటి చినసత్యం, హీరాలాల్, తంగప్ప, శివ-సుబ్రహ్మణ్యం, రాజు-శేషు, సలీం, రఘు, శీను-(తార-సుందరం), నార్త్‌లో సరోజ్‌ఖాన్, కమాల్.

ఫిలిం ఎడిటర్లు సంజీవి, రామచంద్రయ్య, ఎన్. చంద్ర (నేడు ప్రముఖ హిందీ దర్శకుడు), గౌతంరాజు, అనిల్ మల్నాడ్, సుభాష్-సూర్యం, కె.ఎన్. రాజు. స్టంట్ జూడో రత్నం, రాఘవులు, వీరూ దేవగన్ (బొంబాయి).

కళాదర్శకులు నాటి బి.ఎన్. రెడ్డి సహచరుడు ఎ.కె. శేఖర్, ఎస్. కృష్ణారావు, తోట తరణి, కుదరవల్లి, భాస్కరరాజు, బిజన్ దాస్ గుప్తా-

పాటల రచయితలు శ్రీశ్రీ, ఆత్రేయ, ఆరుద్ర, సినారె, కొసరాజు, దాశరథి, జాలాది, వేటూరి, సిరివెన్నెల, దేవులపల్లి కృష్ణశాస్త్రి, హిందీలో ఆనంద్ బక్షి, గుల్జార్, ఇందీవర్.

ఇలాగ ప్రతిశాఖలోనూ అగ్రశ్రేణిలో ఉండే నటులతో, టెక్నీషియన్లతో పనిచేసి అందరి గౌరవాభిమానాలు సంపాదించుకున్నాడు.

ఒఖ్ఖ డైలాగులు కుట్టే దర్జీ పనిలో మాత్రం ఈ వ్యాస రచయిత బారి నుండి తప్పించుకోలేకపోతున్నాడు.

ఈ సంకెళ్లకి జిందాబాద్!

బాపూ జిందాబాద్!

రేపూ జిందాబాద్!

# ఒక్కడే మహానుబాపుడు



వేల, లక్షల ఇలస్ట్రేషన్లు, కార్టూన్లు, క్యారికేచర్లు, పోర్ట్రెయిట్‌లకు ప్రాణం పోసిన 'బాపు' ఆగస్టు 31న కుంచె దించారు. ఆయనకు ఇతర చిత్రకారులు, అభిమానులు, సన్నిహితులు అర్పించిన నివాళులు.

నర్సిం

స్కూల్ రోజుల్లో దాసి సుదర్శన్ (మా గురువుగారు) పరిచయం చేసిన 'బాపు' బొమ్మల వెంట ఇప్పటికీ నడుస్తూనే ఉన్నాను. ఆ బొమ్మల బ్రహ్మ, నిన్నటిదాకా మా మీద ఓ కన్నేసి ఉంచారు. ఐదు దశాబ్దాల్లో బాపు వేసిన బొమ్మలను వందల సంఖ్యలో సేకరించి బౌండు వాల్యూమ్‌లు తయారు చేసుకున్న సుదర్శన్‌గారి దగ్గర నుంచి చూసిస్తానని ఆ ఆల్బమ్ తీసుకొచ్చి పాతికేళ్లయింది. ఇంకా ఆ బొమ్మల మీద మోజు తీరలేదు. అవి ఎప్పటికప్పుడు ఇంకా ఏదో నేర్పుతూనే ఉన్నాయి. 'ఏమి చెయ్యి ఇది! ఇన్ని వేల, లక్షల ఇల్లస్ట్రేషన్లు, కార్టూన్లు, క్యారికేచర్లు, పోర్ట్రెయిట్స్... ఇంకా అనేకానేకం. వేటికవే ఇంత గొప్పగా ఎలా వేస్తాడీయన!' అని ఆశ్చర్యపోవడం ప్రతిసారీ జరిగే తంతే. మద్రాసొచ్చాక బాపుగార్ని మరింత దగ్గరగా చూసి, ఆయనతో సన్నిహితంగా మసలి, గంటల తరబడి ఆయనతో మాట్లాడి, 'ఏమిటీ మనిషి! ఏమాత్రం పాత కొత్త అన్న తారతమ్యం, సెలబ్రిటీనన్న భేషజం లేకుండా అమాంతం మిత్రుణ్ణి చేసేసుకుంటున్నాడేమిటీ!' అని మరింత మెస్మరైజ్ కావడం చెప్పుకుని తీరాల్సిందే. నిన్నమొన్నటి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఈ కొన నుంచి ఆ కొనదాకా ఈ రేఖామాంత్రికుడి ప్రభావంలో పడని ఔత్సాహిక చిత్రకారుడు బహుశా ఉండడేమో. ఆయన బొమ్మల్లో పొదిగిన అందం, సొగసు, లావణ్యం, లాలిత్యం, క్రాఫ్ట్‌మ్యాన్‌షిప్‌లకు పడిపోయినట్టుగానే- మంచితనం, మృదుత్వం, స్నేహం, మెత్తటి నవ్వు కలగలిసిన ఆయన వ్యక్తిత్వానికీ దాసోహం కాక తప్పదు. మద్రాసొచ్చిన కొత్తలో నా బొమ్మలు, కార్టూన్లు పట్టుకెళ్లి చూపిస్తే, 'మీ లైన్ బాగుందండీ, ఆల్ ది బెస్ట్,' అంటూ ఆశీర్వదించారు. కార్టూన్లు, కార్టూనిస్టుల గురించి మాట్లాడుకుంటుంటే, 'నేను డేవిడ్‌లో కార్టూన్లు చూడలేదు సార్,' అని అంటే, నాల్రోజుల తర్వాత 'లో' కార్టూన్లు ఉన్న పుస్తకం ఆఫీసులో నా టేబిల్ మీద ఉంది. ఆశ్చర్యంతో పుస్తకం తెరిచి చూస్తే, 'నర్సింగారికి, అభినందనలతో -బాపు' అని స్నేహహస్తాలతో రాసి ఉంది.







నేను, సురేన్ద్ర కలిసి చాలాసార్లు గంటల తరబడి ఆయనతో మాట్లాడుకున్న సందర్భాలు మరిచిపోలేనివి. ఎన్నో విషయాలు చెప్పేవారు. ఆయన మొట్టమొదట పనిచేసిన అడ్వర్టైజింగ్ ఏజెన్సీ కబుర్ల దగ్గర నుంచి సాహిత్యం, బొమ్మల మీదుగా సినిమాలు, సినిమా షూటింగ్‌లు, పాలిటిక్స్, మ్యూజిక్- రకరకాల విషయాల మీద చాలా విషయాలు మాట్లాడేవారు. ఎప్పుడూ ఎవరి గురించి చెడుగా మాట్లాడేవారు కాదాయన. మొదటిసారి నేను, సురేన్ద్ర, కేశవ్- ముగ్గురం కలసి ఆయనింటి కెళితే, 'నా ఇంటికి ముగ్గురు మహానుభావులు వచ్చారు,' అంటూ ఆహ్వానించారా మహాను 'బాపు'. మేమెళ్లినప్పుడల్లా ఆయన వేసిన కొత్త బొమ్మలు ఒరిజినల్స్ తీసుకొచ్చి చూపెట్టేవారు. అలా వంశీ కథలకు, స్వాతి కొరకు వేసిన అద్భుతమైన కలర్ ఇల్లస్ట్రేషన్స్ అచ్చుకాకముందే చూడగలిగాం. 'ఇంటర్వ్యూలు, అదీ అడక్కుండా ఉండేట్టయితే, మీరెప్పుడైనా రావచ్చండి,' అంటూ మాకు పర్మిషన్ ఇచ్చేశారాయన.

అరవై, డెబ్భైలలో బొమ్మల దగ్గర్నుంచి ఇప్పటిదాకా ఆయన ఎన్నోరకాల శైలులు వాడినా ఆ లైన్‌లో 'బాపు' మార్క్ స్పష్టంగా ఉండేది. అసలు ఆయన లైనుకున్న ఫోర్స్ అంతా ఇంతా కాదు. ఇప్పుడు 'ఇల్లస్ట్రేటర్' అనే సాఫ్ట్‌వేర్‌లో ఒక లైన్ గీస్తే ఏ గొరుకులు రాకుండా చక్కటి ఫోర్స్‌ఫుల్ లైన్ వస్తుంది. అలాంటి లైన్ బాపుగారు యాభై ఏళ్ల క్రితమే మాన్యువల్‌గా సాధించారు. అసలీ మనిషి ఇప్పటి కంప్యూటర్ కంటే వేగంగా ఒక మిషన్‌లాగా లక్షల బొమ్మలు ప్రొడ్యూస్ చేశారు. ఇంత కష్టజీవి, కార్మికుడు నభూతో నభవిష్యతి.

బాపుగారు తన స్నేహాన్ని రమణ ఒక్కరికే కాదు, మాలాంటి లిల్లీపుట్లకు కూడా పంచారు. మేరుపర్వతం లాంటి ఆయన పక్కన నిలబడనిచ్చారు.





## డా. జయదేవ్

### బాపు ద యానిమేటర్!

బాపుగారు గొప్ప యానిమేటర్ కూడా. 1980-90 దశకాల మధ్య ఎన్.టి. రామారావుగారి ఆధ్వర్యంలో అప్పటి ఎ.పి. ప్రభుత్వం స్కూల్ పిల్లల కోసం ప్రయోగాత్మకమైన, ప్రయోజనాత్మకమైన వీడియో పాఠాలు తయారుచేసే పని బాపు-రమణగార్లకు అప్పగించింది. ఆ పాఠాలలో పిట్టకథలకు యానిమేషన్ చెయ్యాలన్న ఆలోచన బాపుగారికి కలిగింది. యానిమేషన్ మీద ఆసక్తి ఉన్న నాకు బాపు శిక్షణ ఇచ్చారు. వారి లైబ్రరీలోంచి కొన్ని పుస్తకాలిచ్చి చదవమన్నారు. రకరకాల స్టోరీబోర్డులు గీసి క్యారెక్టర్ల డిజైన్ చేసి టూడీ యానిమేషన్ చేసేపని రాయపేట (చెన్నై)లోని చిత్రకల్పన స్టూడియోస్‌లో మొదలైంది. నేను, మురళి, డా. గోపాల టూడీ యానిమేషన్ వర్కును ప్రసాద్ స్టూడియోస్‌లో ఆక్స్‌బరీ కెమెరాతో షూట్ చేశాం. ఇంత పెద్ద స్థాయిలో వ్యయప్రయాసలతో కూడిన పనిని బాపు సులభసాధ్యం చేశారు. ఈ ఫిల్మ్‌కు సంగీతం సమకూర్చింది ఎ.ఆర్. రహమాన్. వీడియో పాఠాలతో కూడిన ఈ యానిమేషన్ బిట్స్ ఎంతో ప్రత్యేకతను సంతరించుకున్నాయి.

2006 ప్రాంతంలో బాపుగారు భాగవత కథలను యానిమేషన్ మూవీలుగా తీయాలని సంకల్పించారు. ప్రత్యేకమైన స్టోరీబోర్డులు క్యారెక్టర్ డిజైన్లు చేసి హైదరాబాద్‌లో ఒక పెద్ద యానిమేషన్ కంపెనీతో సంప్రదించారు. ఆ కంపెనీ యానిమేటర్లతో వారంరోజుల పాటు స్వయంగా చర్చలు సాగించారు. అయితే కాలం కలిసిరాక, ఆ ప్రాజెక్ట్ ఆదిలోనే ఆగిపోయింది. అదే గనుక నెరవేరి ఉంటే, అద్భుతమైన యానిమేషన్ కళాఖండం మనకు దక్కి ఉండేది. బాపుగారు జీవించి ఉంటే, మరో ప్రయత్నం చేసి ఉండే వారేమో. కానీ, మనకా అదృష్టం లేకుండాపోయింది.

## మోహన్

### చిత్రకళే బాపు చిరునామా!

బాపుగారిని సినిమామనిషిగా చూడ్డం పెద్ద ట్రాజెడీ. ఎందుకంటే, సినిమాలను ఎవరైనా తియ్యగలరు. హిట్లు కూడా కొట్టొచ్చు. కానీ, అందరూ బొమ్మలెయ్యలేరు. అదీ, బాపు వేసినట్లుగా అసలే వెయ్యలేరు. నిజానికి బాపులో ఉన్న అసలైన, అరుదైన లక్షణం ఇదీ. ఆయన బొమ్మలూ, క్యాలిగ్రఫీ, కవర్ పేజీలూ, కథలూ సీరియళ్లకు వేసిన ఇలస్ట్రేషన్లూ, కార్టూన్లూ (స్ట్రిప్పులూ, పాకెట్ కార్టూన్లూ కూడా), కార్ట్యూన్ల పేరిట వేసిన క్యారికేచర్లూ ఎంతో అరుదైనవి. దాదాపు భారతదేశంలో మరెవరిలోనూ ఇలాంటి విశేషం కనిపించదు. ఇదో రేర్ ఫెనామినన్. తమిళనాడులో గోపులులాంటి వాళ్లెవరైనా ఇంత విస్తృతంగా బొమ్మలేశారేమో తెలీదుగానీ, నాకు తెలిసి బాపు వేసిన బొమ్మల్లాంటివి ఏ పత్రికల్లోనూ ఎక్కడా ఎప్పుడూ రాలేదు. ఇలాంటి విషయం వదిలేసి, పెర్ఫార్మింగ్ ఆర్ట్ కదాని ఒక్క సినిమాల గురించే అతిగా మాట్లాడ్డం న్యాయం కాదు. నిజానికి బాపు గొప్పగా కంట్రిబ్యూట్ చేసిన ఫీల్డ్ బొమ్మల రంగమే. ఆయన బతుకంతా బొమ్మల గురించే స్టడీ చేశారు. మన సంప్రదాయ చిత్రకళనూ, అమెరికన్, లాటిన్ అమెరికన్, ఆఫ్రికన్ సంప్రదాయాలనూ అధ్యయనం చేసి డైజెస్ట్ చేసుకుని సొంత పద్ధతి డెవలప్ చేశారు. ఇదే ఆయన చేసిన కృషి అని నా నమ్మకం!





## సురేశ్వ

### రేవు బావురుమంటోంది

బాపుగారు కుంచె దించేశారు. అరవై ఏళ్ల పాటు ఇది చూడండి-ఇదిగో ఇది చూడండి-అదేం చూశారు, ఇది చూడండి- అంటూ టన్నులకొద్దీ చిత్రాలు గీసి, గీసి ఇక చాలు... వీటిని మీరేం చేస్తారో, ఎలా ఉపయోగించుకుంటారో మీ ఇష్టం అంటూ రమణగారిని కలవడానికి వెళ్లిపోయారు.

బాపు గీయకముందు అంతా శూన్యం ఏమీకాదు. అజంతా ఎల్లోరా అపురూప చిత్రాలు, జపనీస్, చైనీస్, ఈజిప్షియన్ రేఖాచిత్ర సంప్రదాయాలున్నాయి. మన సొంత కలంకారీ ఉండనే ఉంది. వీటిలోని సారాన్ని, అమెరికన్-బ్రిటిష్ ఆధునిక రేఖాచిత్రాల ఒడుపుల్ని తన సొంతం చేసుకుని ఆయన చేసిన ప్రయోగాలూ, విన్యాసాలూ మూడు తరాల పాఠకులకు తెలిసినవే. నేర్పుకు తోడు ఆయనకున్న కొన్ని వ్యక్తిగత లక్షణాలు... క్రమశిక్షణ, నిరంతర సాధన, అవధిలేని ఉత్సుకత, అన్నిటికీ మించి చిత్రకళ పట్ల తీరని దాహం- ఇవన్నీ కలగలిసి, ఒక జీవితకాలంలో పదిమంది సాధించగలిగేది బాపు ఒక్కరే చేసేందుకు దోహదం చేశాయి.

కళాకారుడిగా తన నుంచి పాఠాలు నేర్చుకోలేనివాళ్లకు బాపు తేలిగ్గా నేర్చుకునేందుకు వీలైన పాఠం ఒకటి వదిలివెళ్లారు. అదే వినయం, నిరాడంబరత్వం, ఎంత ఎదిగినా ఒదిగి ఉండే తత్వం. ఆయన లేని నేల ఇప్పుడు బావురుమంటోంది.

## శ్రీధర్

### చిన్నబోయిన తెలుగు 'చిత్రం'

చక్కని బొమ్మలు ఎలా వెయ్యాలో తెలిసిన ఏకైక తెలుగు చిత్రకారుడు బాపుగారు. బొమ్మల్లో రసవాదం క్షుణ్ణంగా తెలిసిన ఆల్కెమిస్టు ఆయన ఒక్కరే. ఎన్నాళ్లు, ఎన్నేళ్లు, ఎంతటి కఠోర తపస్సు చేసినా ఆయనంతగా బొమ్మలు వెయ్యడం అసాధ్యం. ఇప్పుడు ఆర్టిస్టులుగానూ, కార్టూనిస్టులుగానూ చెల్లుబాటు అవుతున్నవారిలో అత్యధికులు బాపుగారికి నకళ్లు లేదా, నకళ్లకు నకళ్లు మాత్రమే. నిజానికి, ఈ విషయంలో ఏకలవ్య శిష్యరికం అనడం కుదరదు. ఎందుకంటే, ఏకలవ్యుడు తన గురువుతోనే పోటీపడగల స్థాయిలో విద్య నేర్చాడు. కానీ, బాపుగారితో పోటీ పడగలవారెవరూ లేరిక్కడ. మళ్లీ పుట్టి రావాలంతే!

ఇవాళ తెలుగు బొమ్మ చిన్నబోయింది.



## రాజేంద్రప్రసాద్

### జననమరణాలకు అతీతుడు

నా సినీ నటజీవితానికి నాంది పలికిన నిర్దేశకుడు బాపునే. ఆయన దర్శకత్వంలో సరిగ్గా 37 ఏళ్ల క్రితం 1977 సెప్టెంబర్‌లో నా మొదటి సినిమా స్నేహం విడుదలయింది. ఆపైన పధ్నాలుగేళ్లకు వచ్చిన పెళ్లిపుస్తకంతో ఆప్యాయతతో కూడిన అనుబంధంగా మారింది. ప్రత్యేకంగా కోరి రాంబంటు సినిమాను బాపుగారి దర్శకత్వంలో నిర్మించాం. ఆయన నిర్దేశకత్వంలో సొంత సినిమాను నిర్మించగలగడం మాకు దక్కిన అదృష్టం. సినిమా దర్శకుడిగా, చిత్రకారుడిగా తెలుగువారి ఉజ్జ్వల సాంస్కృతిక వారసత్వాన్ని, ఔన్నత్యాన్ని, వెండితెరపై కదిలే బొమ్మలు మొదలుకొని కదలకుండా కాగితంపై నుంచే మనస్సు- మేధను కదిలించే లిపి దాకా అక్షరాల ఎలుగెత్తి చాటిన మనిషి బాపుగారు. ఆప్తుడు, ఆదర్శప్రాయుడైన బాపుగారి మరణంతో నేను మా ఇంటి పెద్దను కోల్పోయినట్లు అనిపిస్తోంది. తన ప్రాణమిత్రుడు ముళ్లపూడి వెంకటరమణ మృతి తరువాత బాపుగారు ఎక్కువ కాలం జీవించరేమో అని చాలామంది అనుమానించారు. చివరకు ఆ అనుమానం నిజం అయింది.





## మన్నం రాయుడు, గోపీచంద్

### గొప్ప మామూలు మనిషి

బాపు మాకు చిన్నప్పటి నుంచి తెలుసు. ఇందులో మాదేంలేదు. ఆయనే ఎంతో శ్రమపడి గీత, రాతతో కోట్లాదిమంది తెలుగువారితో పాటు మమ్మల్నీ ఆకట్టుకుని, ఆత్మీయంగా అల్లుకున్నారు. ఇక అప్పటి నుంచి మా జ్ఞానేంద్రియాలు చెప్పలేని ఇష్టంతో ఆయన్ని అనుసరిస్తూనే ఉన్నాయి.

ఇక ప్రత్యక్ష పరిచయం సుమారు ఏడేళ్ల క్రితం. ఇది ప్రయత్నపూర్వకంగానే కలిగింది. మనసు ఫౌండేషన్ ద్వారా రావిశాస్త్రి సమగ్ర రచనల ప్రచురణకు పూనుకుని బాపుని బొమ్మ వేయమని కలిశాం. ఆయన బొమ్మ వేస్తే, రమణగారు దానికి శీర్షిక నిర్ణయించారు. అది మొదలు, మేం ప్రచురించే పుస్తకాలకు ఆయన గీత గీస్తే, ఈయన పేరు పెట్టడం కొనసాగింది. ఆయన నిరాడంబరుడు, నిగర్వి, సావధానంగా వినేవాళ్లు ఉండాలిగానీ సంగీత, సాహిత్య, చిత్రలేఖన, చిత్రరంగాల గురించి, ఆ తరం నుంచి ఈ తరం వరకూ వచ్చిన సామాజిక మార్పుల గురించి బోలెడన్ని విషయాలు చెప్పగలిగిన అనుభవం. ఇప్పటికీ కొత్త విషయాలు నేర్చుకుందామనే వినయం. ఆయన భక్తిపరుడేగానీ, భగవత్ స్వరూపుల మీద నమ్మకం లేదు. బాపు రాగద్వేషాలు లేని మహిమాన్వితుడేమీ కాదు. గాఢమైన ఇష్టాయిష్టాలు, తీవ్రమైన కోపతాపాలు ఉండే మామూలు మనిషి. కాకపోతే ఆయన వాటిని నిగ్రహించుకుని, వ్యక్తం చేసిన తీరు మాత్రం అద్భుతం. తనకు ఏమాత్రం ఇష్టంలేని వ్యక్తులకు దూరంగా ఉండడమేకాక, వారి ప్రసక్తి వచ్చినప్పుడు వారి సంగతి ఎందుకులెండి, వారు గొప్పవారు అనేవారు లేదా రెండు చేతులు జోడించి ఓ నవ్వు నవ్వేసేవారు. బాపు బొమ్మలు గీయడాన్ని ఊపిరితీయడంతో సమానంగా భావించేరనిపిస్తుంది. అందుకే అవి వట్టి గీతలే అయినప్పటికీ ప్రాణం పోసుకున్నట్టుండేవి. అనారోగ్య కారణంగా ఆయన కొంతకాలం బొమ్మలు వేయడం మానేశారు. ఇప్పుడు ఊపిరి తీయడం కూడా ఆపేశారు. కానీ, ఇప్పటివరకూ ఆయన పండించిన హాస్యం, వేసిన బొమ్మలు, తీసిన సినిమాలు మాత్రం ముందు తరాలకి ఊపిరులూదుతూనే ఉంటాయి.

## వాసు

### తరతరాలకు గురువు

బాపుగారు ఒక్క తరానికో, ఒక్క ప్రాంతానికో, ఆమాటకొస్తే ఒక్క భాషకో పరిమితమైన గురువు కారు. ఆయన ప్రభావపరిధిలో అనేక తరాలు వర్ధిల్లాయి. కేవలం ఆయన ఇచ్చిన స్ఫూర్తే ఊపిరిగా ఈ రంగంలోకి ప్రవేశించి, వర్ధిల్లుతున్న చిత్రకారులు ఎందరో ఉన్నారు. బాపుగారి ప్రభావంలో పడి, చిత్రకళలో ప్రవేశించినవారిలో ఎక్కువమందికి ఆయనతో ముఖపరిచయమైనా లేకపోవచ్చు. అయినప్పటికీ వారందరూ ఆయన్ను తమ గురువుగానే భావించడం విశేషం. అంతటి ప్రభావశీలత కలిగిన కళాకారుడు బతికిన కాలంలోనే పుట్టి పెరిగి, బతకగలగడం నా అదృష్టంగా భావిస్తున్నాను. ఒక వ్యక్తి ఎన్ని వేలమంది చిత్రకారులను, మరెన్ని లక్షలమంది వీక్షకులను ప్రభావితం చేయగలరో తెలుసుకోవడానికి బాపుగారే నిదర్శనం.

ఇండియా టుడే సౌజన్యంతో



సంభాషణ: రెంటాల జయదేవ

# ఆయనది అంతర్జాతీయ స్థాయి

## త్రివిక్రమ్ శ్రీనివాస్





*ఆకాశం కారుస్తున్న కన్నీటితో భాగ్యనగరం అప్పటికే తడిసి ముద్దవుతోంది. అల్పపీడన ప్రభావమే కాదు, ఉరుము లేని పిడుగులా ఆదివారం (ఆగస్టు 31) సాయంత్రం అంతకు కొద్ది సేపటి క్రితమే హఠాత్తుగా మీద పడ్డ బాపు అస్తమయ వార్తతో తెలుగుజాతి విషాదంలో మునిగిపోయింది. బాపు - రమణలకు ఆత్మీయుడూ, వారి చివరి మజిలీలో సన్నిహిత సహయాత్రికుడూ అయిన మాటల మాంత్రికుడు త్రివిక్రమ్ శ్రీనివాస్‌కు గుండెలు పిండే బాధ గొంతుకు అడ్డం పడుతోంది. మబ్బులు కమ్మేసిన ఆ సుదీర్ఘ... కాళరాత్రి... త్రివిక్రమ్ తన గుండె గది తలుపులు తెరిచారు. జాతి రత్నాన్ని పోగొట్టుకున్న తీరని బాధలోనూ ఓపిక కూడదీసుకొని, మాట రాని మౌనాన్ని అతి కష్టం మీద ఛేదించారు. కనీసం కలసి ఫోటో తీయించుకోవాలన్న ఆలోచనైనా రానందుకు చింతిస్తూనే, బాపు-రమణల మీద తన భక్తిని మనసు జ్ఞాపకాల చిత్రాలలో నుంచి వెలికి తీశారు. ముగిసిన ఓ శకానికి త్రివిక్రమ్ అర్పించిన  అక్షర నివాళి...*

ఏదైనా అనుకొంటే, వెంటనే చేసేయాలి. అంతేతప్ప ఆలస్యం అస్సలు కూడదు. ఇవాళ కాలం నేర్పిన కొత్త పాఠం ఇది. బాపుగారికి అనారోగ్యంగా ఉందని తెలిసినప్పటి నుంచి స్వయంగా వెళ్ళి కలవాలని అనుకుంటూ వచ్చా. తీరా వెళ్ళి కలవక ముందే ఆయన కన్నుమూశారు. ఈ దుర్వార్త తెలియగానే, ఒక్కసారిగా డీలా పడిపోయా. బాపులాంటి గొప్పవ్యక్తి ఇకలేరు అనగానే నాకు ఏడుపొచ్చేసింది. ఆయన మరణంతో తెలుగు చలనచిత్ర, చిత్రకళా రంగాలకు సంబంధించి ఒక శకం ముగిసింది. పుట్టిన ప్రతి ఒక్కరికీ మరణం సహజమని తెలిసినప్పటికీ బాపు-రమణల లాంటి వ్యక్తులు వంద ఏళ్ళు కాదు... నూట పాతికేళ్ళు బతకాలనీ, ఆ చేతి వేళ్ళు ఇంకా రాయాలనీ, మరిన్ని బొమ్మలు గీయాలనీ మనలాంటి అభిమానులం కోరుకుంటాం. ఎందుకంటే, వాళ్ళు మనకిచ్చిన తీపి జ్ఞాపకాలు అలాంటివి.

### *వాళ్ళున్నది మా ఇంటి పైనే!*

బాపు-రమణలతో నా తొలి పరిచయం వాళ్ళ రాధాగోపాళం చిత్రం కన్నా చాలా ముందునుంచే! అప్పటికి నేను దర్శకుడిగా అతడు చిత్ర సన్నాహాల్లో ఉన్నాను. వాళ్ళు శ్రీభాగవతం సీరియల్ తీస్తున్నారు. రాధాగోపాళం టైమ్‌లో వాళ్ళకు సన్నిహితుడినయ్యా. ఆ సినిమా చిత్రీకరణ సమయంలో హైదరాబాద్‌లో మా అపార్ట్‌మెంట్స్‌లోనే నాలుగో అంతస్తులో అద్దె ఇంట్లో బాపు-రమణలు ఉన్నారు. వాళ్ళ షూటింగయ్యాక సాయంత్రాల్లో వారానికి రెండుసార్లయినా కబుర్లాడుకొనేవాళ్ళం. వాళ్ళు ఏదైనా చెబుతుంటే, చెవి ఒగ్గి వినేవాణ్ణి. అలా ఎన్నో సంగతులు తెలుసుకున్నా, నేర్చుకున్నా. అందరూ రమణగారు బాగా మాట్లాడతారు, బాపుగారు పెద్దగా మాట్లాడరని అంటారు. కానీ, నా విషయంలో అది నిజం కాదు. విచిత్రంగా బాపుగారు, నేను ఎక్కువ మాట్లాడుకొనేవాళ్ళం. ఇప్పుడాలోచిస్తే, అలా కుదరడం చిత్రమనిపిస్తుంటుంది.

### *బాపు క్లోజప్పులపై ఆ ప్రభావం!*

నాకూ, ఆయనకూ ఉమ్మడి చర్చనీయాంశం- సినిమా. అలా కూర్చొని ఎన్నేసి గంటలు మాట్లాడుకొనేవాళ్ళమో! ఎక్కువగా అంతర్జాతీయ సినిమా గురించే మా సంభాషణ సాగేది. సినిమాల్లో, సంగీతంలో ఆయన అభిరుచి లోతైనది. ప్రాథమికంగా యూరోపియన్ సినిమా, ఇరానియన్ సినిమా బాగా ఇష్టం. వన్స్ అపాన్ ఎ టైమ్ ఇన్ ది వెస్ట్, ఫర్ ఎ ఫ్యూ డాలర్స్ మోర్ లాంటి

చిత్రాలు తీసిన సెర్జియో లియోనీ ఆయనకు బాగా ఇష్టమైన దర్శకుడు. క్లోజప్ షాట్లు, బోల్డ్ క్లోజప్‌ల విషయంలో అతని ప్రభావం తన మీద ఉందేమో అనేవారు. కానీ, నన్నడిగితే ఆ దర్శకుడు ఎక్కువగా యాక్షన్‌లో అలాంటివి చేశారు. బాపుగారు ప్రాథమికంగా రొమాన్స్ సన్నివేశాల్లో ఆ పద్ధతి వాడారు. అదీ చాలా కళాత్మకంగా ఉంటుంది.

పాతతరం అమెరికన్ నటుడు గారీ కూపర్ సినిమాలంటే ఆయనకు తెగ ఇష్టం. అలాగే, పాశ్చాత్య సంగీతజ్ఞుడు ఎన్నియో మొరికోనీ చేసిన నేపథ్య సంగీతం గురించి, ఆయన చేసిన ఆల్బమ్స్ గురించి ఎప్పుడూ చెబుతుండే వారు. 'అవి వినండి. ఆ సంగీతంలో మీకు ఎన్నో కథలు దొరుకుతాయి,' అనేవారు. ఎందరో ఫిల్మ్‌మేకర్లు, సంగీత దర్శకులు, సినిమాటోగ్రాఫర్ల పేర్లు ఆయన నోట్లో నానుతుండేవి. డైరెక్షన్‌కు సంబంధించిన రచనలు, గొప్ప సినిమాల స్క్రీన్‌ప్లేలు- ఇలా బాపుగారు నాకు చాలా పుస్తకాలిచ్చారు. చిన్న చిన్న కాగితాల మీద నోట్స్ లాంటి ఉత్తరాలు రాసేవారు. పచ్చళ్ళు పంపేవారు.

### అటు ఆయన... ఇటు మేము... ఏడ్చేశాం!

శ్రీరామరాజ్యం చిత్రం విడుదల తరువాత అంత గొప్ప చిత్రం చూసి, ఉండబట్టలేక రాత్రి 12 గంటల వేళ ఫోన్ చేశాను. నిర్మాత సాయిబాబుగారు తీసి, బాపుగారికి ఫోన్ అందించారు. సినిమాలో ఏవేం బాగా నచ్చాయో చెబుతూ, నేను, నా శ్రీమతి ఇటుపక్క ఫోన్‌లో నిజంగా ఏడ్చేశాం. అటుపక్కన బాపుగారూ ఫోన్‌లోనే ఏడ్చేశారు. 'నాదేమీ లేదు. అంతా ఆ రాముడు, ఆ వెంకట్రావ్ (ముళ్ళపూడి వెంకటరమణగారి అసలు పేరు. ఆయనను వెంకట్రావ్ అనే బాపు పిలిచేవారు)ల దయ,' అని పదే పదే తలుచుకున్నారు.



రమణతో ఆయన స్నేహం అది. ఆయనకున్న గొప్ప సంస్కారం అది.

### ఆయనది అంతర్జాతీయ స్థాయి

దర్శకుడిగా తొలి సినిమా సాక్షి లాంటి ఆఫ్-బీట్ సినిమాను ఎవరైనా తీస్తారా? ఆరోజు నుంచి చివరిదాకా బాపు-రమణలు వెండితెరపై చేసిన సాహసాలు అన్నీ ఇన్నీ కావు. ఏయన్నార్ ఉచ్ఛస్థితిలో ఉండగా ఆయన పాత్రకు హీరోయిన్ లేకుండా, భార్య పోయి, బిడ్డ ఉన్న పూజారి పాత్రను బుద్ధిమంతుడులో చేయించడం మరో సాహసం. ఆ చిత్రంలో గొప్ప ఫిలాసఫీ ఉంది. చివరలో భిన్నమైన ఆలోచనాధోరణులున్న హీరో పాత్రలు రెండూ నెగ్గినట్లు కన్విన్సింగ్‌గా చెప్పడానికి ధైర్యం కావాలి. సినిమాలన్నీ సాదాసీదాగా, ఒకే పద్ధతిలో లీనియర్‌గా ఉండే రోజుల్లో, అలా అనేక కోణాలున్న సినిమాను, పైకి కనిపించేదే కాకుండా, లోలోపల ఎన్నో భావాలు పొదిగిన సినిమాలు చేయడం కష్టం. ఆ సాహసం ఆయన చేశారు. అలాగే, పూర్తి కామెడీ సినిమాలు లేని ఆ రోజుల్లోనే బంగారు పిచిక తీశారు. ఆయన సాహసించిన నలభై ఏళ్ళ తరువాత ఇప్పుడు ఆ ట్రెండ్ చిత్రాలు జోరందుకున్నాయి.

ముత్యాలముగ్గు చూస్తే, అప్పటిదాకా వచ్చిన తెలుగు చిత్రాలకు పూర్తి భిన్నంగా, ఆఫ్-బీట్‌గా నేపథ్య సంగీతం ఉంటుంది. భార్యాభర్తలిద్దరి దాంపత్య ఘట్టాన్ని కేవలం మాండలిన్ బిట్‌తో నడిపితే, వారిద్దరూ విడిపోయే సీన్‌ను రీరికార్డింగ్ లేకుండా చేశారు. బాపు షాట్ కంపోజిషన్, మేకింగ్, విజువలైజేషన్, నేపథ్య సంగీతం- అన్నీ అంతర్జాతీయ స్థాయివే. నా దృష్టిలో ఆయన తెలుగు గడ్డకే పరిమితమైపోయిన అంతర్జాతీయ స్థాయి ఫిల్మ్ మేకర్. అంతర్జాతీయ సినిమాలు చూసిన వ్యక్తిగా ఇది ఘంటాపథంగా చెబుతున్నా. ఒక్కమాటలో రేపటి సినిమాను... నిన్ననే ఆలోచించి... ఇవాళే తీసేసిన... దిగ్దర్శకుడు బాపు గారు. కాలానికన్నా ముందస్తు ఆలోచనలున్న క్రియేటర్.

ఇప్పటికీ నాకు ఎప్పుడు మనసు బాగా లేకపోయినా, బాపుగారి బుద్ధిమంతుడు, అందాల రాముడు చూస్తా. తక్షణమే పాజిటివ్ ఎనర్జీనిచ్చే చిత్రాలవి. ఇక, మన ఊరి పాండవులులో బాలూ మహేంద్ర, బాపుల విజువల్ జీనియస్ చూడవచ్చు. అభిరుచి గల మంచి సినిమాకూ, కమర్షియల్ హిట్టయ్యే సినిమాకూ మధ్య బంధం వేసి, ఆ రెంటినీ కలగలిపిన అద్భుతమైన వ్యక్తులు బాపు-రమణ. వాళ్ళకు తెలిసిందల్లా హిట్, ఫ్లాపులతో సంబంధం లేకుండా సినిమాలు తీస్తూపోవడమే. హిట్టయితే ఆ డబ్బులు సినిమాలోనే పెట్టారు. ఫ్లాపైతే, ఆ అప్పులు తీర్చడానికి మరో సినిమా తీశారు. వాళ్ళు సంపాదించిన దానికన్నా పోగొట్టుకున్నదే ఎక్కువ. చిరస్మరణీయమైన సినిమాలు మిగిల్చారు. చేస్తున్న పనిని ఆస్వాదిస్తూ, దానినే దైవంగా చేసుకున్నప్పుడే అది సాధ్యమవుతుంది.

### ఆయనలా పని చేస్తేనా...

నన్నడిగితే బాపు చాలా గొప్ప థింకర్ కూడా! ఆయన భావవ్యక్తీకరణలో, గీసిన బొమ్మలో, తీసిన సినిమాలో అది స్పష్టంగా తెలుస్తుంటుంది. ఆయన తన శక్తిని మాటలతో వృథా చేసేవారు కాదు. చేస్తున్న పనిలోనే దాన్ని క్రమబద్ధీకరించి, వినియోగించేవారు. అలాగే, ఒక వ్యక్తిగా, కళాకారుడిగా బాపుగారు ఎంతో క్రమశిక్షణ ఉన్న వ్యక్తి. ఆయన చేసినంత కఠోర పరిశ్రమ ఎవరూ చేయలేరు. లేకపోతే, పుస్తకాల ముఖచిత్రాలు, కార్టూన్లు, కథలకు బొమ్మలు, క్యారికేచర్లు- ఇలా ఒక వ్యక్తి తన జీవితకాలంలో ఏకంగా ఒకటిన్నర లక్షల పైగా బొమ్మలు వేయడం సాధ్యమా చెప్పండి. ఇంకా యాడ్ ఏజెన్సీల్లో క్రియేటివ్ హెడ్‌గా వేసినవి, స్క్రిప్టు స్టోరీబోర్డుకు వేసుకున్న బొమ్మలలాంటివి లెక్కలోకి తీసుకోకుండానే అన్ని బొమ్మలయ్యాయంటే ఆశ్చర్యం. బొమ్మ లేయడాన్ని పనిగా అనుకోలేదు. ఎవరో రాసిన నవలకు ముఖచిత్రం వేయడం కూడా ఆ వంకతో తాను ఆ కథ చదవవచ్చనే! అది చదివి, దానిమీద తన అభిప్రాయాన్నీ, సమీక్షనూ మాటలతో కాదు, బొమ్మతో చెప్పేసేవారు. అది ఆయన గొప్పతనం.

బాపుగారు లుంగీ కట్టుకొని, లాల్చీ వేసుకొని, ప్యాడ్, కుంచెలు పెట్టుకొని, కింద కూర్చొని, ఎదురుగా డీవీడీ ప్లేయర్‌లో సినిమా పెట్టుకొనో, పక్కనే సంగీతం వింటూనో బొమ్మలు వేసుకొనేవారు. చేయి నొప్పి పుడితే, కాసేపు ఆపి, సినిమా చూసేవారు. సినిమా బోర్ కొడితే, అది పాజ్ చేసి, బొమ్మలు వేసుకొనేవారు. ఇలా రోజూ 16 గంటలకు పైగా పనిచేయడం, పడుకోవడం! మళ్ళీ పొద్దున్నే లేవగానే అదే పని! ఎవరికో ఏదో నిరూపించడానికి కాక, మనస్ఫూర్తిగా పనిని అంతగా ఆస్వాదిస్తూ, ఆనందంగా చేస్తే శ్రమే తెలియదు. ఆయనలో కనీసం పదిశాతమైనా మనం పని చేస్తే చాలు ఎంచుకున్న రంగంలో ఎంతో ఎత్తుకు ఎదుగుతాం.





### పక్కా తెలుగువాడు

జీవితమంతా మద్రాసులో గడిపిన బాపుగారు పక్కా తెలుగువాడు. ఆయన కట్టుబొట్టు, ఆహారవ్యవహారాలు, ఇష్టపడే రుచులు, మాట్లాడే మాట, రాసే రాత, గీసే గీత- అన్నీ తెలుగు వాతావరణానికి ప్రతిబింబాలే. ప్రపంచం మొత్తం తిరిగినా, పల్లెటూరు తెలుగువాడు ఎలా ఉంటాడో అలాగే, సింపుల్‌గా బతికారు. స్టీలుగ్లాసులో కాఫీ తాగడం నుంచి కింద కూర్చొని పని చేసుకోవడం దాకా- తాను ఏ వాతావరణం నుంచి వచ్చాడో ఆ వాతావరణాన్ని వదిలి పెట్టలేదు. అదే ఆయన సృజనలో ప్రతిఫలించింది. ఒక్క ముక్కలో- ఆయన నేలమీదే నిల్చొని, గాలిపటం ఎగరేశారు. దాన్ని ప్రపంచం మొత్తం చూపించారు. అదీ ఆయన ప్రత్యేకత.

### అరుదైన వ్యక్తులు, వ్యక్తిత్వాలు

వ్యక్తులుగా కూడా వాళ్ళు ఎంతో గొప్పవాళ్ళు. అలాంటి వ్యక్తులు సినీ రంగంలో అరుదు. ఎదుటివారి వల్ల వాళ్ళు మోసపోయారే తప్ప, వాళ్ళు ఎవరినీ మోసం చేయలేదు. ప్రతిభతో పాటు అరుదైన వ్యక్తిత్వం వారి సొంతం. ఆ రెండింటి సమ్మేళనం కాబట్టే, జయాపజయాలను పట్టించుకోకుండా, నమ్మిన విలువలకే జీవితాంతం కట్టుబడగలిగారు. చివరివరకు ఆ స్థాయిని కొనసాగించారు. ఇవాళ సినీ, సాహిత్య, కళారంగాలతో పాటు సామాన్య తెలుగు సమాజంలోనూ వారికి ఇంత గౌరవ ప్రతిష్ఠలు దక్కడానికి కారణం అదే! స్నేహమంటే బాపు-రమణలంటారు. 'ఒక రంగంలో సృజనాత్మకంగా అత్యున్నత శిఖరాలకు వెళ్ళిన ఇద్దరు మనుషులు 66 ఏళ్ళ పైగా ఏ గొడవా లేకుండా కలిసి బతికారు, కలిసి నడిచారు, కలసికట్టుగా తమ రంగంలో కృషి చేశార,'ని చెబితే చాలు... ఇక వాళ్ళ స్నేహం గురించి మనం ప్రత్యేకించి ఏమీ చెప్పనక్కర లేదు. ఒకసారి నేను ఉండబట్టలేక, 'మీరిద్దరి మధ్య ఎప్పుడూ అభిప్రాయ భేదాలు రాలేదా,' అని అడిగేశా. 'ఎందుకు రావు! కథాచర్చల్లోనో, మరొకచోటో ఏదో అభిప్రాయభేదం వస్తుంది. వాదించుకుంటాం. మళ్ళీ మామూలైపోతాం,' అన్నారు. వాళ్ళెప్పుడూ తమ జీవితాన్ని సంక్లిష్టం చేసుకో లేదు. సాదాసీదాగా గడిపేశారు. వాళ్ళలా సింపుల్‌గా బతకడం మనకేమో కాంప్లికేటెడ్ అయిపోతోంది!

### అలా బతకడం అంత సులభం కాదు!

బాపు-రమణల స్నేహం, సాన్నిహిత్యం ఎంతంటే, రమణగారు పోయాక బతకడం ఇష్టంలేక బాపుగారు వెళ్ళిపోయారని నాకు అనిపిస్తోంది. బాపుగారు గుర్తొచ్చినప్పుడల్లా ఆయనలా హార్డ్‌వర్క్ చేయాలని స్ఫూర్తి కలుగుతుం టుంది. ఇక, రమణగారి పేరు చెప్పగానే ఆయనంత గొప్పగా రాయాలను కుంటా. ఎవరెస్ట్ అంటే ఎవరైనా ఎక్కాలనే అనుకుంటారు కదా! నేనూ అంతే! వాళ్ళు ఎప్పుడూ మాట్లాడలేదు, ఉపన్యాసాలివ్వలేదు. నచ్చిన పని చేసుకుంటూ వెళ్ళి పోయారు. వాళ్ళలాగా భేషజం లేకుండా మామూలు వాళ్ళలా బతకడం అంత సులభం కాదు. అయినాసరే, అలా ఉండేందుకు ప్రయత్నించడం, వాళ్ళ సినిమాలు చూసి ఆనందించడమే మనమిచ్చే ఘనమైన నివాళి.

### బాపు మార్కు సెటైర్లు

ఆహార విషయంలో కూడా బాపు-రమణలది మంచి అభిరుచి. ఏదైనా మితంగా, హితంగా ఉండేది. బాపుగారు చాలా తక్కువ తినేవారు. కాకపోతే, వాటిల్లోకి పప్పు, కూర, పచ్చడి అన్నీ ఉండాలి. అంత చక్కటి రాయల్ టేస్ట్. బాపుగారిలో హాస్యప్రియత్వానికి ఎన్నో ఉదాహరణలు. నటుడు బ్రహ్మానందం గారి బలవంతంతో వాళ్ళింటికి బాపుగారు ఒకసారి భోజనానికి వెళ్ళారు. ఆయనకు స్వయంగా వడ్డించాలని బ్రహ్మానందంగారి కోరిక. బాపుగారు సరే నన్నారు. ఆయన తింటుంటే, 'ఇంకొంచెం తినండి,' అంటూ మరింత వడ్డించ బోయారు బ్రహ్మానందం. 'బాగుందని చెప్పాలంటే, ఇంకొంచెం తినాలాండీ!' అని బాపు వ్యాఖ్యానించారు. ఒకటే నవ్వు.

### అది ప్రభుత్వం ఆయన మీద వేసిన అతి పెద్ద కార్టూన్!

బతికుండగా ఎవరినీ గౌరవించాల్సినంతగా గౌరవించకపోవడమనేది ప్రాథమికంగా మన తెలుగువాళ్ళకున్న దౌర్భాగ్యం. ఇప్పటికి మూడున్నర దశాబ్దాల క్రితమే సీతా కల్యాణంలో గంగావతరణ ఘట్టం కోసం ఒకే నెగటివ్ మీద ఏకంగా 27 ఎక్స్‌పోజర్లు చేసిన తెలివైన టెక్నీషియన్ బాపు. చుక్క నీళ్ళు లేకుండా కేవలం చాక్‌పీస్ పొడితో, గంగానది ఉత్తుంగ తరంగంలా కిందకు దూకుతున్న అనుభూతి తెరపై కల్పించిన జీనియస్. తెలుగుభాషకు తన రాతతో ఒక ప్రత్యేకమైన ఫాంట్ అందించారు. ఆడపిల్ల అంటే, బాపు బొమ్మలా అందంగా ఉండాలన్న నిర్వచనానికి కారణమయ్యారు. ఇవాళ 'ప్రీ-విజ్' అని అందరూ చెబుతున్న స్టోరీ బోర్డ్ కాన్సెప్ట్‌ను ఉత్తరాదిన సత్యజిత్ రే, దక్షిణాదిన బాపు ఏనాడో చేశారు. పిల్లల కోసం బాపు-రమణలు ఉచితంగా వీడియోపాఠాలు తీసి ఇచ్చారు. పత్రికల్లో, ప్రకటన రంగంలో, పుస్తక ప్రచురణ రంగంలో, సినిమాల్లో- ఇలా అన్ని రంగాల్లో తమదైన ముద్రవేశారు. భారతీయ సినిమాకూ, ప్రపంచ సినిమాకూ, తెలుగు చిత్రకళారంగానికీ ఇంత సేవ చేసిన వారికి కనీసం 'పద్మవిభూషణ్' అన్నా ఇవ్వాలి కదా! కానీ, ఇన్నేళ్ళ తరువాత, రమణగారు కూడా గతించాక, గత ఏడాది బాపుగారికి ఉత్తి 'పద్మశ్రీ' ఇచ్చారు. నా దృష్టిలో బాపుగారిపై ప్రభుత్వం వాళ్ళు చేసిన అతి పెద్ద కార్టూన్ అది!

సాక్షి దినపత్రిక సౌజన్యంతో



# The Light of India
# SITA KALYANAM

*This article was published on 21 Jan 1978 (Saturday) in The Guardian, Arts Section (page 12)*

***While attending the Filmotsav 78 in Madras, the famous British film critic, Derek Malcolm discovered and fell in love with Bapu's Sita Kalyanam which was not included in the Indian Panorama section. After singing its praises, Derek Malcolm arranged for the film to be screened at the London Film Festival and later at the Chicago Film Festival. The handwritten note on this page is a comment Malcolm made in the Visitor's Book after a special screening of Sita Kalyanam during Filmotsav 78 (3-17 January 1978)***



***Bapu with Derek Malcolm***



The most extravagantly beautiful film I've seen in India, and one which would hold its own at any Festival in the world. I very much hope that it can be widely shown outside its country of origin. Bapu is clearly a director to note.

Derek Malcolm
Film Critic
The Guardian, London

But first a real discovery outside the Indian Panorama section. Bapu's Sita Kalyanam (Sita's wedding) was refused inclusion because it was felt that few foreigners would want to see even a superior specimen of the mythological movies that are so popular in these parts. How wrong the organisers were. It is one of the most extravagantly beautiful films I've seen. And I'm glad to say that those I sent scurrying after it from a private showing agreed that I wasn't going off my head. It will certainly he at the London Festival in November.

Bapu himself seemed genuienly surprised at all the fuss. After all, he has so far made 13 films without managing to be included in the official list of India's leading directors. And though he was rather hurt about that, he admits only to being a more careful than usual commercial film-maker. But Sita's Wedding is something special.

It was really made by a team who have worked together often before. Mullapudi Venkata Ramana (writer), K. V. Mahadevan (the superb Carnatic music), K.S. Prasad (cinematography) and Ravee Nagaich (the Ray Harryhausen of Indian special effects) have combined with Bapu to illustrate part of the Ramayana - culminating in the marriage of Rama, incarnation of Vishnu, to Sita, adopted daughter of King Janaka.

The result is like a Hollywood Bible epic done with real taste - an amalgam of lyricism, poetry and spectacle achieved with rare authenticity (everything is as accurate as possible to the legend and to the centuries-old paintings and decorations that embellish it). All is done with a gravitas and dignity that is ultimately very moving. I've seen nothing like it before and can't help thinking that its popularity in the West is assured. Which makes it all the more amazing that Sita's Wedding was a flop commercially in India, perhaps because a more obvious, rip-roaring approach generally suffices.

*Courtesy*
***Sri B. Vijayavardhan,** Hyderabad*



*Publication of this painting is sponsored by*

**Smt. Saraswathi and Dr. Venkata Subbarao Uppuluri,** Chicago, IL



# చమత్కార్యం

శ్రీరమణ

మంచి సాహిత్యం చదవడం, మంచి సంగీతాన్ని పదేపదే వినడం, హాయిగా నవ్వుకోవడం బాపు నైజం. రమణ ఒక సందర్భంలో బాపు గురించి రాస్తూ, 'తీరిగ్గా ఉంటే బొమ్మలు వేస్తాడు. పనిలో ఉంటే బొమ్మలు వేస్తాడు. చిరాకులో బొమ్మలు వేస్తాడు. పరాకులో బొమ్మలు వేస్తాడు...' అంటూ సాగించారు. తర్వాత రమణతో, 'ఏమయ్యా, చాలా ఇబ్బందిగా ఉంది. నువ్వు నా గదిలోకి ఎప్పుడు వస్తావోనని అదిరి పడుతున్నా. వేరే ఏ పనీ చేయడానికి లేకుండా ఉంది. చప్పుడైతే చాలు కుంచె కాగితం పట్టుకుంటున్నా,' అని చమత్కరించారు.

## బెజవాడ మావో

విజయవాడ నవోదయ రామమోహనరావు బాపు, రమణల ఆప్తవర్గంలోని వారు. దాదాపు అర్ధశతాబ్ది అనుబంధం వాళ్లది. సీతాకళ్యాణం ప్రివ్యూ చూశాక, 'ఇందులో రిక్షావాడికి ఏముంది,' అన్నారట నవోదయ. విడుదల తరువాత రిక్షావాడికే కాదు రిక్షాలో వారికీ ఏమీ లేదన్నారు సినిమా పండితులు. అప్పట్నించీ ఏ సినిమా చూపించినా, ఇందులో 'రిక్షా వాడికి ఏమైనా ఉందా,' అని ఆయనని అడుగుతూ ఉండేవారు బాపు. నవోదయ రామమోహనరావుని బాపు మావోగారని పిలిచేవారు. ఉత్తరాల్లో కూడా అలానే సంబోధించేవారు. ఆరోజుల్లో నవోదయ బుక్‌షాపు బాపు, రమణల బెజవాడ ఆఫీసులాగా ఉండేది.

## నవ్వించెడువారు

బాపు, రమణలు వాళ్ల మీద వాళ్లు జోకులు వేసుకుని హాయిగా నవ్వుకుని ఎదుటివారిని నవ్విస్తారని ప్రతీతి. వాళ్ల సినిమాల మీద కూడా వ్యంగ్యాస్త్రాలు సంధించి నవ్వించేవారు. బాపు తన దర్శకత్వం వహించిన చిత్రాలన్నింటినీ కార్టూన్లుగా గీసి నవ్వించారు. వాటిని పలుచోట్ల అచ్చువేసి పాప్యులర్ చేశారు కూడా. అందాల రాముడు అంతంత మాత్రంగా ఉన్నప్పుడు వేలాది రూపాయల ఖర్చుతో వ్యంగ్య ధోరణిలో పబ్లిసిటీ చేశారు. బాపు అడ్వర్‌టైజింగ్ శాఖలో బాగా అనుభవం ఉన్నవారు. ఆరోజుల్లో ఇలాంటి కార్టూన్ కథనాలు పలువురిని ఆకర్షించాయి.

వంశవృక్షం ప్రివ్యూ చూసి బయటకు వస్తుంటే, ఒకాయన మీరింతకు ముందు ట్రాజెడీలు తీసినట్టు లేదు అన్నాడు బాపుతో. 'కాని తీశాక కొన్ని ట్రాజెడీలే అయినాయి లెండి,' అన్నారు బాపు చాలా గంభీరంగా.

## కదిలించవద్దు

త్యాగయ్య సినిమా నడుస్తోంది. బాపురమణలు ప్రేక్షకులతో పాటు చూస్తున్నారు. అప్పటికే శాంతము లేక సౌఖ్యము లేదు, నిధి చాలా సుఖమా కీర్తనలు పూర్తయినాయి. తర్వాత దృశ్యంలో అన్నగారు జపేశం దగ్గరగా వచ్చి, "తమ్ముడూ త్యాగూ..." అంటూ ఏదో చెబుతున్నాడు. ఇంతలో నేలక్లాసు నుంచి ఒక గొంతు, 'ఓరి నీ...బ్బ! వాడిని కదిలించబాకరా. ఇప్పుడు మళ్లీ పాటందుకుంటాడు,' అని బిగ్గరగా అరిచింది. థియేటర్ నవ్వులతో నిండింది. బాపుకి త్యాగయ్య జాతకం అర్థమైంది.

## బాపుతో కాసేపు

"మీ సీతాకల్యాణం ఒక దృశ్యకావ్యం!"

"అఫ్‌కోర్స్, అది ఎక్స్‌పోర్ట్ క్వాలిటీ."

"మీ దృష్టిలో ఏది గొప్ప సినిమా?"

"థియేటర్‌లో నలుగురి హృదయాల్ని కదిలించే సినిమా కంటె థియేటర్‌కి నలుగుర్ని కదిలించేది గొప్ప సినిమా."

"మీరు రాముడికి వీరభక్తులని అశేష ప్రజలు నమ్ముతున్నారు."

"వారి నమ్మకాన్ని వమ్ము చేయను."

"రాముడే ఎందుకు దేవుడు?"

"మనిషి కాబట్టి."

బొమ్మల్లో, జీవితంలో బాపుది అలవిమాలిన సింప్లిసిటీ. *1995* పదవ తానా సభలు. అది చికాగో ఎయిర్‌పోర్ట్. రిసీవ్ చేసుకోడానికి డా॥ జంపాల చౌదరి, మరికొందరు మిత్రులు వెళ్లారు. బాపు భుజానికి ఎయిర్‌బ్యాగ్‌తో దిగారు. ఇవతలకు వచ్చి బ్యాగేజి కౌంటర్ దగ్గర అందరూ నిలబడి ప్రయాణం కబుర్లు వింటున్నారు. మాటలు నడుస్తున్నాయి. ఎవరో మిత్రులు, 'మనం ఇక్కడ ఎందుకు నిలబడ్డట్టు,' అన్నాడు. 'బాపుగారి బ్యాగేజి కోసం,' అన్నారు జంపాల. బాపు వెంటనే, 'ఇదిగో ఈ బ్యాగ్ ఒక్కటే, ఇంకా రావల్సిందేం లేదు. పదండి,' అన్నారు. నిజంగానే అంతా నివ్వెరపోయారట. ఇంత చిన్న సంచితో అమెరికా పర్యటనకు రాగలగడం బాపుకి తప్ప అన్యులకు సాధ్యం కాదని వారంతా కథలా చెప్పుకున్నారు. దానవీరం, దయావీరంలాగే నిరాడంబరత కూడా ఒక సాహసం.

### ఫన్ చ తంత్రం

అప్పట్లో, అంటే ఊరూ వాడా కలర్ టీవీలు వచ్చినప్పుడు రకరకాల సీరియల్స్ గురించి అందరూ ఆలోచిస్తుండేవారు. బాపు రమణలతో పరిచయం ఉన్న వారంతా రకరకాల సలహాలు ఇస్తుండేవారు. అందులో ఉండే సాధకబాధకాలు చెప్పేవారికి తెలియవు. వచ్చే సలహాలలో ఎక్కువ శాతం పంచతంత్రం కథలు యానిమేషన్‌లో చెయ్యాలనీ, బాపు కార్టూన్స్‌లో పరమాద్భుతంగా ఉంటుందనీ ఉండేవి. మరీ ముఖ్యంగా ప్రవాసాంధ్రులు దీన్ని సూచించేవారు. యానిమేషన్ ఫిలిమ్ చాలా ఖరీదైనది. ఎంత సాంకేతిక విజ్ఞానం పెరిగినా శ్రమతో పాటు ఖర్చు కూడా అధికం. ఒకరోజు పొద్దుటే ఒకాయన బాపుకి ఫోన్ చేసి, తను అమెరికా నుంచి వచ్చాననీ, కలిసి మాట్లాడాలని అన్నారు. పనేంటో ఫోన్లో చెప్పండన్నారు బాపు. కాదు కలిసి మాట్లాడాల్సిందే అన్నారాయన. బాగా వత్తిడి పనిలో ఉన్న బాపు, 'పంచతంత్రమేనా,' అన్నారు కొంచెం అసహనంగా. ఆయనకేమీ అర్థం కాలేదు. వెంటనే రమణకి ఫోను కలిపి, జరిగిందంతా చెప్పి, 'బాపుగారు చెప్పకుండానే నా మనసులో మాట పసిగట్టారు. రియల్లీ గ్రేట్,' అంటుంటే ఏం మాట్లాడాలో రమణకి అర్థం కాలేదు.

అప్పుడెప్పుడో ఒకసారి చందమామ కోసం బాపుతో బొమ్మలు వేయించారు చక్రపాణి. బాపు స్వయంగా తీసుకెళ్లి భయం భయంగా చక్రపాణికి అందించారు. ఆయన విమర్శగా చూసి వాటిని జాగ్రత్తగా టేబిల్ సొరుగులో పెట్టి, 'వద్దులే, వీటికి అలవాటుపడితే రేపు నువ్వు ఏ షూటింగ్‌లోనో ఇరుక్కుని టయానికి ఇవి గియ్యకపోతే లేనిపోని చిక్కు,' అన్నారట. మరి అంతే, అన్ని పత్రికలకూ ఎక్కినా బాపుబొమ్మ చందమామకి ఎక్కలేదు. బాపు బొమ్మ ఒక వ్యసనం అన్నది చక్రపాణి మనసులో మాట.

### బంగారు పిచిక

బంగారు పిచిక బాపు తీసిన రెండో సినిమా. అది కూడా బాపు, రమణల సొంత సినిమాయే. అందులో హీరోగా అప్పుడప్పుడే గాయకుడుగా విస్తరిస్తున్న ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం అయితే బావుంటుందనుకున్నారు. కానీ ఎస్పీ, అలా అనుకోనందున చంద్రమోహన్ తెరమీదకు వచ్చారు.

మొదట ఈ సినిమా పేరు స్వయంవరం. విడుదలకు ముందు పేరు మార్చారు. సినిమా విడుదలకి బాపు, రమణలు రాజమండ్రి వెళ్లారు. వాళ్లెవరూ గుర్తుపట్టలేరు కాబట్టి హాయిగా జనంలో కలిసిపోయి, సినిమా చూస్తున్నారు. ఇంటర్వెల్ పడింది. బాపు పైపు కాల్చుకోవడానికి బయటకు వచ్చారు. ఒక మిత్రుడు రెండో మిత్రుడితో, 'ఏరా పిచిక పిచిక అని తిన్నావుగా, రోగం కుదిరిందా,' అని కసరడం బాపు చెవిన పడింది. రెండో మిత్రుడు దోషిలా మౌనం వహించడమూ చూశారు. సినిమా టాక్ అర్థమైపోయింది. ఇద్దరూ ఇంటర్వెల్‌లోనే హోటల్ రూమ్‌కి వచ్చేశారు. 'రీళ్లన్నీ చూడక్కర్లేదండీ, ఒక్కటి చూస్తే చాలు,' అంటూ బంగారు పిచిక అనుభవాన్ని చెబుతుండేవారు. బంగారం లేకుండానే పిచిక గూటికి చేరిందనేవారు. పిచిక చచ్చి పడినట్టు కార్టూన్ వేసుకున్నారు.

దీన్నే పెళ్లికొడుకు పేరుతో పాతికేళ్ల తర్వాత తిరగతీశారు. తొలిసారి హీరో హీరోయిన్లు బాగున్నారన్నారు. సంగీతం బాగుందన్నారు. రెండోసారి కథతో పాటు ఇవి కూడా బాగులేవన్నారు. చాలా నష్టపోయారు. 'దేవుడు మనల్ని కష్టపడమని రాశాడు. మళ్లీ ఇప్పుడు చచ్చినట్టు హిట్ తియ్యాల్సిందే. అది దైవాజ్ఞ,'' అన్నారు రమణ ఏమాత్రం జంకకుండా.



### వీడియో పాఠాలు

వీడియో పాఠాలు చేస్తున్న రోజుల్లో అక్షరాలు, గుణింతాలు, చిన్నచిన్న మాటలు- వీటిని గ్రాఫిక్స్ ద్వారా తెరకెక్కించాలి. బొంబాయిలో ప్రసిద్ధ గ్రాఫిక్స్ శాస్త్రవేత్త శ్యామ్ రామన్న ఆధ్వర్యంలో ఈ పని చేయాలి. బటర్ పేపర్ మీద రాయాలి. పెన్సిల్ లైన్ కూడా చాలా స్వల్పంగా ఉండాలి. రాసేటప్పుడు తడబాటు కూడదు, సమవేగంతో సాగాలి. అప్పుడే అక్షరాలు, మాటలు తెరమీద మెల్లగా రూపుదిద్దుకుంటాయి. ఈ ప్రత్యేకమైన సాంకేతిక సరంజామాని శ్యామ్ రామన్న తయారుచేశారు. మొత్తం లెక్కిస్తే దాదాపు పన్నెండువందల కార్డులు రాయాల్సి ఉంది. అంతా సవ్యంగా సాగితే పది కాల్షీట్ల వ్యవధి పట్టవచ్చని శ్యామ్ అంచనా వేశారు. పని మొదలైంది. బటర్ పేపర్లు అందించడమే ఆలస్యం, ఆరోజు ఒక యంత్రాన్ని చూశామక్కడ. కేవలం మూడు కాల్షీట్లలో పని పూర్తయింది. అన్ని వందల కార్డులలో కేవలం అయిదారుసార్లు మాత్రమే రీ-టేక్ అవసరపడింది. ఇందులో చిత్రం, శిల్పం లేదు. నిరంతర సాధనతో బాపుకి సంక్రమించిన చెయివాడితనం ఉంది. శుభం కార్డు తర్వాత శ్యామ్ వినమ్రంగా బాపు చేతుల్ని కళ్లకు అద్దుకున్నాడు.

ఆంధ్రప్రదేశ్ పత్రిక సౌజన్యంతో



# బాపు స్టోరీ బోర్డ్

## నెవర్ బోర్డ్...
## ఎవర్‌లాస్టింగ్ స్టోరీ

సుధామ



**బాపు** ముందు చిత్రకారుడు. ఆ తరువాతనే చలనచిత్రకారుడు. యాభై ఒక్క సినిమాలకు దర్శకత్వం వహించాడు. దర్శకుడు అంటే కేవలం నటీనటుల నుండి, యాక్షన్ రాబట్టడం, కెమెరామెన్‌కు తనకు కావలసిన ఎఫెక్టులు చెప్పి రాబట్టు కోవడం మాత్రమే కాదు. సినిమాకూ, దాని చిత్రీకరణకూ సంబంధించిన అన్ని శాఖల మీదా పట్టు ఉండాలి. బాపు నిజంగా ఒక విలక్షణ దర్శకుడు. పత్రికల్లో వచ్చే రచయితల కథలే కాదు, సినిమా కథ కూడా తన బొమ్మలతో చెప్పేసి మెప్పించడమే ఆయన ప్రజ్ఞ. బాపు బొమ్మ అంటే అందమైన అమ్మాయికి పర్యాయ పదంగా స్థిరపడింది. ఒక పాత్రను తన బొమ్మలతో సజీవం చేసి, ప్రాణప్రతిష్ఠ చేయడం చిత్రకారుడిగా ఆయనకు అబ్బిన విద్య కాబట్టే, బాపు హీరోయిన్లే కాదు, ముత్యాలముగ్గులో క్షణకాలం కనిపించే మాడా వేసిన చిన్న పాత్రల వంటివి సైతం మరపురాని శాశ్వతత్వాన్ని సంతరించుకున్నాయి.

దర్శకునిగా బాపు రమణ రాసిన స్క్రిప్ట్‌ను రాసుకుంటూ స్టోరీబోర్డ్ రూపొందించుకునేవాడు. తెలుగులో తన బొమ్మలతో స్టోరీబోర్డ్ తయారుచేసుకునే ఏకైక దర్శకుడు బాపుయే...!

గోపులు వంటివారి బొమ్మలను పరిశీలిస్తూ ఎదిగిన బాపు అడ్వర్టైజింగ్ శాఖలో పనిచేశారు. జె. వాల్టర్ థామ్సన్ కంపెనీలో ఆర్ట్ డైరెక్టర్‌గా, ఏడాదిన్నర ఉండి, తర్వాత








ఫ్రీలాన్సర్ అయ్యారు. ఈసెన్‌బర్గ్‌తో కలిసి దేశమంతా తిరిగి బాపు ఆరోజుల్లో వేలాది ఫోటోలు తీశారు. బాపుది 'కెమెరా కన్ను' కావడం అప్పుడేనేమో! ఆ ప్రజ్ఞను బొమ్మల్లోకి దింపడం బాపుకే చేతనైందనాలి. లాంగ్ షాట్స్, మిడ్ షాట్స్, క్లోజప్ షాట్స్, జూమ్ ఇన్స్, జూమ్ ఔట్స్, క్రేన్ షాట్స్, ట్రాలీ షాట్స్ వీటన్నింటినీ తాను కథలకు, సీరియల్ నవలలకు బొమ్మలు వేయడంలో ఎంతో (ఎంత) అద్భుతంగా చిత్రించి చూపారో...! అందుకే చిత్రకారుడిగా బాపు అంతలా రాణించారు.

బాపు తెలుగువారి ఏకైక రేఖాసాహిత్యవేత్త అని నిరూపించేవి ఆయన బొమ్మలే కాదు, చలనచిత్ర దర్శకునిగా వారు రూపొందించుకున్న స్టోరీబోర్డ్‌లు కూడా. స్టోరీబోర్డ్ ప్రతి పేజీలో ప్రొడ్యూసర్, టైటిల్, సీన్ నెంబర్, క్యారెక్టర్స్, లోకేల్, అది పగలా, రాత్రా, ఇండోరా, ఔట్‌డోరా, సీన్లో స్పెషల్ ప్రాపర్టీస్ ఏమిటి, పి.యస్ అంటూ ప్రీవియస్ సీన్, ఎన్.యస్ అంటూ నెక్స్ట్ సీన్ కూడా నోట్ చేసుకుంటూ, ఎక్కడెక్కడ గ్రాఫిక్స్‌తో చెక్ చేసుకోవాలో కూడా నమోదు చేసుకుంటూ ఒక మెటిక్యులస్ ప్లానింగ్‌తో హోంవర్క్ చేసుకుని షూటింగుకు వెళ్లే దర్శకుడు బాపు.

'ఏదైనా బొమ్మ వేస్తే, ఏ మాత్రం వీలున్నా ఏదో మూల పుస్తకాల దొంతర బొమ్మలో చూపించు. ఎక్కడో అక్కడ ఓ పుస్తకం ఉండాలి,' అని ఈసెన్‌బర్గ్ చెప్పిన మాట బాపు తన బొమ్మల్లో, చలనచిత్రాల్లో ఎక్కడో అక్కడ కచ్చితంగా పాటించి చూపించారు. బాపు స్టోరీబోర్డు ఆయన చేసుకునే హోంవర్కు మాత్రమే కాదు, అది కెమెరామెన్‌కు, నటీనటులకు కూడా ఎంతో ఉపయోగపడేది..! స్టోరీబోర్డ్‌లో తాను హీరో, హీరోయిన్లని ఎలా చూపాలను కుని బొమ్మలు గీసుకుంటాడో అచ్చంగా అలాగే వాటికి ఆయా నటీనటులకు జీవం పోసి చూపే దక్షత బాపుది. నటీనటుల శరీరాకృతులే కాదు, వారి ఆహార్యం తీరుతెన్నులు కూడా బొమ్మల్లో ఎలా గీసుకుంటాడో అలాగే దృశ్యంలో చలనచిత్రంగా జీవం పోస్తాడు బాపు. స్టోరీబోర్డు పేజీల్లోని కొన్ని బొమ్మలు చూస్తే అదేమిటో స్పష్టంగా అర్థమైపోతుంది ఎవరికయినా. షూటింగ్ విరామంలో ఆయన స్టోరీబోర్డ్ చూస్తూ ఎన్నో నేర్చుకుని, ఆయన ప్రేరణతోనే దర్శకురాలినై గిన్నెస్ బుక్‌కు ఎక్కానని సాక్షి బాపురమణల తొలిచిత్రంలో హీరోయిన్‌గా నటించి, మహిళా దర్శకురాలిగా మారిన విజయనిర్మల స్వయంగా ప్రకటించారు. వాణిశ్రీ వంటి పేరొందిన హీరోయిన్ సైతం బాపు స్టోరీబోర్డ్ నుంచి ఆ బొమ్మలతో, వాటి హావభావాలతో, భంగిమలతో తన నటనకు మెరుగులు దిద్దుకుందిట..!

సాక్షి నుంచి చివరిగా తీసిన శ్రీరామరాజ్యం వరకూ బాపూ స్టోరీ బోర్డ్‌లన్నీ భావి దర్శకులకు, నటీనటులకు, కెమెరామెన్‌కు అందరికీ అధ్యయన గ్రంథాలే. ఎటొచ్చీ భారతీయ చలనచిత్ర చరిత్రలో తొలిసారిగా ఒక చిత్ర నిర్మాణం గురించి రచయిత, దర్శకుడు చేసిన హోమ్ వర్క్ విశ్వరూపాన్నీ, నిర్మాణ కార్యక్రమాల్నీ సమగ్రంగా ప్రతిబింబించిన విశిష్ట గ్రంథరాజం శ్రీరామరాజ్యం ఒక్కటే. రచన శాయి వాహినీ బుక్ ట్రస్ట్ 101వ ప్రచురణగా దానిని వెలువరించారు. స్పెషల్ ఎఫెక్ట్స్, గ్రాఫిక్స్ లాంటి మాటలు వినడమేగానీ వాటిని రూపొందించడానికి దర్శకుడి కృషి గురించి తెలియజెప్పే వివరాలు, బాపుగారి స్టోరీబోర్డు చూస్తేనే తెలుస్తుంది. బాపు చేతివ్రాతలో సినిమాలోని పాటల సాహిత్యం అంతా కూడా శ్రీరామరాజ్యం స్టోరీబోర్డ్‌లో అచ్చులో అచ్చంగా అందించారు.

బాపు స్టోరీబోర్డులు ఆయన దృశ్యసాహిత్య వైశిష్ట్యానికి దర్పణాలు. సీతాకళ్యాణం, సంపూర్ణ రామాయణం వంటి చిత్రాల సినేరియోలు చలన చిత్ర పరిశ్రమకే పాఠ్యగ్రంథాలని విదేశీయులు సైతం కొనియాడారు.



రాధాగోపాళం చిత్రానికి బాపు స్టోరీబోర్డ్ బొమ్మలు సినిమాతెర కెక్కిన వైనం

టైటిల్ సాంగ్ కూడా బాపు సినిమాల్లోని ఓ విశిష్టమైన సంగతి. సినిమాకు అవసరమైన మూడ్‌ను, చక్కని లీడ్‌ని ఎలా ఇవ్వాలో స్టోరీబోర్డ్‌లో రూపొందించుకునేవారు బాపు. ఎగరేసిన గాలిపటాలు (స్నేహం సినిమా), పలుకే బంగారమాయెనా... (అందాలరాముడు), శ్రీరామ జయరామ... (ముత్యాలముగ్గు), శ్రీరస్తు శుభమస్తు... (పెళ్ళి పుస్తకం), జగదానందకారకా... (శ్రీ రామరాజ్యం) వంటివన్నీ బాపు టైటిల్స్ దగ్గరే ఆకట్టుకునేస్తాడనడానికి దాఖలాలే!

బాపు చిత్రించిన నవరసాలు, వివిధ నాట్యరీతుల వర్ణచిత్రాలను ఆంధ్ర దేశంలోని పలు కళావేదికలపైనా, ఆడిటోరియాల్లోనూ కీ.శే. నూతన్‌ప్రసాద్ ప్రదర్శింపచేయడానికి ఎంతో కృషి చేశాడు. 'బాపు ఎంతో అద్భుతంగా చిత్రిస్తారు. కానీ బొమ్మ చాలా బాగా వేశాను, అని ఎప్పుడూ అనలేదు. బొమ్మ బాగా కుదిరింది, అనే అనేవారు,' అని చెప్పేవారు నూతన్‌ప్రసాద్.

బాపు కృషి, బాపు మార్గం గొప్పవి. ఆయన 51 సినిమాల స్టోరీబోర్డులూ గ్రంథస్థం అయితే ఎంత బాగుణ్ణో కదా..?!? భారత చలనచిత్రరంగంలో సత్యజిత్ రే తర్వాత, సినిమా చిత్రీకరణ కోసం సమగ్ర వివరాలతో సచిత్రంగా స్టోరీబోర్డ్‌ను స్వహస్తాలతో తయారుచేసుకున్నది ఒకే ఒక్క బాపు. ఆ స్టోరీ బోర్డులన్నీ ఎవరన్నా పూనుకుని అందరికీ అందుబాటులోకి తేగలిగితే అది భావి దర్శకులకే కాదు చిత్ర రంగంలోని ఎందరికో ఉపయుక్తమవుతాయి. బాపుని అభిమానించే తెలుగువారెందరికో ఆనందసంధాయకాలవుతాయి.







# ఇంకో తోక కొమ్మచ్చి

## ముళ్లపూడి అనూరాధ

నేను... అనురాధని. ముళ్ళపూడిగారి కూతుర్ని. నాన్న-మామ, అదే బాపు గారు... ప్లస్ మా ఫామిలీ గురించి కిందటిసారి కబుర్లు చెప్తే, 'అంతేనా...?' అని మీరు అడిగారు. అంతేనా అంటే, ఇంకా చాలా విషయాలు ఉంటాయి. అవన్నీ నా సొంత విషయాలు అనుకోండి, అందుకని ఆపేశా.

ఇప్పుడు మళ్ళీ కబుర్లు చెప్పాలని ఉంది. కాని అదే కథ... నాలుగేళ్ళలో మళ్ళీ అదే కథ. ఫస్ట్ నాన్న టాటా గిడిగిడి అనేశారా? ఈసారి మామ గుడ్‌బై చెప్పేశారు. అంటే నాన్న వెళ్ళిపోయాక, సగం చెక్ ఔట్ అయిపోయారు మామ. మా అత్త వెళ్ళాక, ఇంక ఫైనల్‌గా సెలవు తీసుకున్నారు. 'ఇక నేను ఎందుకున్నానే, మీ నాన్న లేడు, మీ అత్త వెళ్ళిపోయింది, నేను ఎందుకు?' అంటే, 'మేము లేమా, మాకోసం ఉండాలి కదా!' అని ఎట్లాడేవాళ్ళం (అంటే ఎదురు పోట్లాడడం అన్నమాట).

కళ్ళజోడులోంచి ఒక చిరునవ్వు.

బాపు అంటే అందం, సరే.

కాని బాపు అంటే నవ్వు. నవ్వడం. నవ్వించడం. Simple life truth.

కొంటెనవ్వుల బాపు
కొన్ని తరముల సేపు
ఆ జోకులన్నీ నాన్-స్టాపు...

అందరికీ ఆయన గదిలోకి వెళ్తే, మెహిదీ హస్సన్, బడే గులాం అలీఖాన్, మదన్ మోహన్ పాటలు వినిపించేవి. మా ఆరుగురు పిల్లలకి జోకులు, కథలు. బాగా గుర్తు, మామ మాతో ఆడిన గారడీలు. మజ్జానం భోంచేసి, హనుమంతుడు-భీముడు, లేక రాముడు-శబరి, లేక కుంతీదేవి-కర్ణుడు కథలు చెప్పాక, పేపర్-పెన్సిల్‌తో మేము రెడీగా వుండేవాళ్ళం. మేము అలా పిచ్చి గీతలు బరికేస్తూ ఉంటే, ఆయన వాటిని అందమైన బొమ్మగాగాని, భయంకరమైన పులిగాగాని, ఆరడుగుల రాముడుగా గాని ట్రాన్స్‌ఫార్మ్ చేసేవారు. మా ఇకయికలు, పకపకలు చూసి థ్రిల్ అయిపోయేవారు.

ఇద్దరూ రామభక్తులే. నాన్న అప్పుడప్పుడు గుడికి వెళ్ళేవారు. మామ అయితే, తన గదిలోనే, ఒక చిన్నపెట్టెలోనే, రాముడికి గూడు కట్టేశారు. అదే గుడి. ఆయన వేలకి వేలు వేసిన రాముడి బొమ్మలే, పువ్వుల పూజలు. నా చిన్నప్పుడు, మామ బొమ్మలు వేస్తూ ఉంటే, పక్కనే కూచుని వాగుతూ ఉండేదాన్ని. ముందర కనుబొమ్మలు వేసి, వాటి కింద కళ్ళు వేసి, వెంటనే బొట్టు లేక నామం పెట్టేసే వారు. 'అదేంటి మామా... ముక్కు నోరు వెయ్యి మరి!' అంటే, 'బొట్టు పెడితే, నా కళ్ళకి సెంటర్ పాయింట్ తెలుస్తుంది. దాన్ని పట్టి ముక్కు నోరు కుదురుతాయి. ఆ బొట్టుతో కళ్ళకి ఇంకా చాలా అందం వస్తుంది,' అనేవారు. ఏ ప్రశ్నా స్టుపిడ్

మా అందరికీ నాన్న మామల డిస్కషన్స్‌కి ఆడియెన్స్‌గా కూచ్చోవడం ఒక పెద్ద ట్రీట్. నాకు ఊహ తెలిసినప్పట్నించి, ఇద్దరూ లంచ్ ముందర, డిన్నర్ ముందర 2-3 గంటలు సెషన్ వేసేవారు. సినిమా ప్లాన్ చేస్తున్నా, లేకపోయినా రోజూ రెండు పూటలా విషయాలతో, వడియాలతో, లోకోత్తరమైన విషయాలు పంచుకుని నంచుకుని... అసలు రోజంతా మాట్లాడుకోడానికి ఏముంటుంది చెప్మా... కానీ వుండేది... ఒక్క టాపిక్ కూడా రిపీట్ అయ్యేది కాదు. ఒక పూట వరల్డ్ సినిమా ఐతే, ఇంకోసారి కార్టూన్స్ గురించి. ఓ పూట తూగోజీ-పగోజీ, పనసపొట్టు కూర-అరిటిదూట పచ్చడి డిబేట్లు ఐతే, ఇంకో పూటకి పిజి వోడ్‌హౌస్ దగ్గర మొదలుపెట్టి, భారతంలో అర్జునుడి పొగరు దాక చర్చించే వారు. కొన్నిసార్లైతే బాడ్మింటన్ గేంలా ఒకరి తరవాత ఒకరు, జోక్స్ అలా కంటిన్యువస్‌గా చెప్తూనే వుండేవారు. లెఫ్ట్-నుంచి పక్కింటి పిన్ని గారిని మామ సర్వ్ చేస్తే, రైట్ నుంచి నాన్న ఆకలి జోక్సుతో రిసీవ్ చేసుకునేవారు. కొన్ని పాతవి, కొన్ని ఈసెన్బర్గ్‌వి, మరికొన్ని కల్పించినవి, ఇంకొన్ని మా ఫామిలీ మీదే. రోజూ వేరే-వేరే టాపిక్స్. ఒక్కటి తప్ప: ఆంధ్ర జనుల ఫిల్మ్ టేస్ట్ గురించి ఇక ఎన్నిసార్లు చెప్పినదే చెప్పి, అడిగినవే అడిగి, అదే టాపిక్ ముప్పైవేలసార్లు డిస్కస్ చేసేవారు. మనం బాగా వచ్చాయి అనుకున్న సినిమాలు మరి యెందుకు తెలుగువాళ్ళకి నచ్చట్లేదు. క్రిటికల్ అక్లెయిమ్ కాదు, కమర్షియల్ సక్సెస్‌గా ఒక్క సినిమా ఐనా తీయాలి, రిక్షా వాళ్ళు కూడా మన్ని మెచ్చుకోవాలయ్యా..., అనుకునేవారు. అక్కడినుంచీ వాళ్ళు తీసిన ఒక్కొక్క సినిమాని అనలైజ్ చేసుకునేవారు. దాని లోతు ఎంత, దాని వెడల్పెంత, దాని పొడుగెంత... ఆ డిస్కషన్స్ వింటూ వుంటేనే, ఫిల్మ్ క్లాస్‌లో కూచ్చున్నట్టు ఒక ఫీలింగ్. ఇవన్నీ మరుపురాని మెమరీస్. నాన్నని మిస్ అయినప్పుడు, ఏడుపు తన్నుకొచ్చినప్పుడు, దాన్ని నడ్డిమీద కొరడాతో చంపేసి, పకపక నవ్వులు రాలించి, కితకితలు పెడుతూ, మళ్ళీ మళ్ళీ నెమరేసే మెమరీస్.



కాదు, ఏ కామెంటు అనవసరం అవ్వదు. మామతో కూచుని మాట్లాడుతూ ఉంటే గంటలు గంటలు గడిచిపోయేవి. కాని రాత్రి అయ్యేసరికి, షార్ప్‌గా తొమ్మిది గంటలకి నాన్న రెడీ అయిపోయి వచ్చేవారు. అంతే, ఇంక మేమందరం డిస్మిస్. అది వాళ్ళ స్పెషల్ టైం. ఇంక ఎవ్వరూ ఇంట్రూడ్ అవ్వలేరు, భోజనం టైందాకా. ఈ మీటింగ్ మాకు చిన్నప్పట్నించీ... అంటే బాగా చిన్నప్పుడు లాగుచొక్కాలు, పొట్టి పరికిణీలు లీగల్‌గా ఉన్నప్పటి టైం నించి మారకుండా వచ్చిన ట్రెడిషన్. ఇద్దరిలో ఎవరికైనా వంట్లో బాగుండక పోతేగాని, ఊళ్ళో ఉండకపోతేగాని, ఈ ట్రెడిషన్ మారలేదు, మార్పు లేదు.

మామకి అన్నిట్లోంచి కార్టూన్ ఐడియాస్ దూసుకొచ్చేవి. పొద్దున్న ఐదు కార్టూన్స్ చూపిస్తే, మళ్ళీ సాయంత్రానికి ఇంకో ఐదు రెడీ. 'ఎలా వస్తాయి మామా నీకు ఈ ఐడియాస్ అన్నీ,' అని అడిగితే, మళ్ళీ దాని మీద ఇంకో కార్టూన్. 'ఏదీ సీరియస్‌గా తీసుకోకూడదమ్మా. గ్రౌచో మార్క్స్ అన్నట్టు, If you're not having fun, you're doing something wrong.'

నేను ముళ్ళపూడివారి అమ్మాయిని అయినా, 'టెల్గూస్'గా పెరిగేశానని నాన్న కంటే, మామకి చాలా లోటుగా అనిపించేది. 'మీ నాన్న బ్రెడ్ అండ్ బటరే, తెలుగు! ఎంత మిస్ అయిపోతున్నావో తెలియట్లేదు మీ అందరికీ. తెలుగు భాష అంత గొప్పది మరొకట్లేదమ్మా,' అని చాలా బ్రతిమిలాడేవారు. నేను ఇక అమెరికా వచ్చేశాక, నేను అసలే ఇంక తెలుగు మర్చిపోయానేమోనని, మామ తను వేసిన కార్టూన్స్ ట్రాన్స్‌లేట్ చేసి మరీ పంపేవారు. తనకి నచ్చిన కథలు టేప్ చేసి పంపేవారు. ఈ ప్రేమ అంతా తెలుగు మీదా? నా మీదా? అని నేను ఎప్పుడూ అడగలేదు. ఆ నవ్వులని కళ్ళ కద్దుకుని కౌగలించుకున్నాను. పోనీ, అప్పుడైనా తెలుగు వచ్చిందా?

చిన్న కోతికొమ్మచ్చి ఇక్కడ. నాన్న, మామ ఎంత గొప్ప ఫ్రెండ్స్ అయినా, వాళ్ళకీ కోపతాపాలు తప్పలేదు. అదే ఘాటైన ప్రేమకి థర్మామీటర్ అని లోగడ మా డాడీ చెప్పార్లెండి. ఒకసారి, స్టోరీబోర్డ్ వేస్తుంటే, నేను మామూలు ప్రకారం  కూచుని మామకి ఏదో సోది చెబుతున్నా. సడెన్‌గా, 'చూడు, ఎంత బాగా రాశారో, మీ నాన్న. ఒక్క వెంకట్రావే ఇంత గొప్పగా రాయగలడు,' అని పొగరుతో కలిసిన ప్రేమతో కలిసిన అభిమానంతో అన్నారు. 'మరి ఇంత చెప్తావు కదా, ఎప్పుడూ ఆ ఆర్గ్యుమెంట్లు ఎందుకు మామా?' అని అడిగా. 'చూడు, మీ నాన్న బ్రహ్మదేవుడు. ఆయన కన్నా నాకు లోకంలో ఇంకా గొప్పవారు ఎవ్వరు లేరు, కదా? ఆయన తెలుగు వారిగా పుట్టడం, మన అదృష్టం, అందులో, నాలాంటి వాడికి ఫ్రెండ్‌గా పుట్టడం ఇంక చెప్పలేను, కదా? అంత పెద్ద ఆయనని నేను నా ఫ్రెండ్ అనుకోవడంలో ఎంత గర్వం. పైగా తిట్టి, ఆయనతో ఆర్గ్యూ చెయ్యడం ఇంకా ఎంత గొప్ప నాకు! ఏదో పొగరే నాకు, ముళ్ళపూడిగారినే తిట్టగలిగే స్టాటస్ ఉందని!' అని కొంటె బొమ్మల బాపుగారు అన్నారు.

ఔరా, అదా కథ! నేను చాలాసార్లు అనుకుంటాను: నేను 'టెల్గూస్' కాబట్టే కదా మామ నాకు ఎక్స్‌ట్రా అటెన్షన్ ఇచ్చారు! తెలుగు పద్యాలు, తెలుగు కథలు, కార్టూన్లు, పాట్యూన్లు అన్నీ ట్రాన్స్‌లేట్ చేసి, నాకోసం, నాతో టైమ్ స్పెండ్ చేశారు. బ్రైట్ సైడ్ టూ ఎవ్రీథింగ్.

మరి నాకే తెలుగు వచ్చుంటే? ఇంకా గొప్ప డిస్కషన్స్ అయ్యేనా? నాకు గారం కంటే రెస్పెక్ట్ ఎక్కువయ్యేదా??? ఏమో? ఈ గుర్రం బాపు-రమణల ఇంట్లో పుట్టి ఇంత ఎగిరిందే! ఎప్పుడో ఏ జనమలోనో సానా పుణ్యాం సేసుకుంటే దక్కినది... ఇంకో జన్మలో మళ్ళీ ఇక్కడే పుట్టి, తెలుగు నేర్చుకుని, బాపు-రమణలతో ఇంకా ఇంటెలిజెంట్ డిస్కషన్స్ చేసేసి... ఏమో గుర్రం ఎగరావొచ్చు.

ఇందులో పాయింట్ ఏమీ లేదండీ, సారీ. జస్ట్ మామ గురించి చెప్పుకోవాలని అనిపించిన కబుర్లు. ఎన్ని రాసినా, చాలట్లేదు, ఏమి రాసినా సరిపో

ఎప్పుడూ పంక్చ్యువల్. వెళ్ళేది షూటింగుకైనా సరే, సినిమా ఐనా సరే, ట్రెయిన్ స్టేషన్ అయినా సరే, రెస్టారెంట్కి అయినా సరే ఆల్వేస్ ఆన్ టైం. నిజం చెప్పాలంటే ఈవెన్ బిఫోర్ టైం. నాన్న కూడా ఆన్ టైమే కాని ఆయన ఓన్ టైం. సాయంత్రం ఆరు గంటలకి ట్రెయిన్ అంటే, మామ రెడీ అయిపోయి, సరిగ్గా రెండున్నరకి కిందకి వొచ్చేస్తారు. మాతో కాసేపు జోక్ చేసి, ఇంక వాచీని చూడడం మొదలుపెడతారు. నాన్నేమో మజ్జాన్నం నిద్రలో ఉంటారు. మెల్లగ మూడున్నరకి బయటికి వస్తారు. 'ఏవయ్యా వొచ్చేశావా, కాఫీ తాగుతావా? ఇదుగో శ్రీదేవీ...!' ముందు మామ సాఫ్ట్‌గా, 'నాకు కాఫీ వొద్దయ్యా, నువ్వెళ్ళి రెడీ అవ్వు,' అంటారు. తరవాత, నాన్న వేడి వేడి కాఫీ మెల్లగా సిప్ చేస్తూ ఉంటే, మామకి బాయిలింగ్ పాయింట్ దగ్గిరవుతూ ఉండేది. ఇక నాలుగు గంటలకల్లా ఓర్పు, తూర్పుకి తుర్రు మనేది, ఒక్కసారి, 'వెళ్ళవయ్యా... ట్రెయినుకి లేట్ అవుతోంది,' అని గట్టిగా అరిస్తే, అప్పుడు, నాన్న మెల్లగా ఆ కాఫీ కప్ కింద పెట్టి... 'ఆ, ఇంక టైము ఉంది కదయ్యా, తొందర యేల,' అని లోపలకి వెళ్ళేవారు. ఆ వోల్కనో ఎరప్షన్‌లాగా వొచ్చిన కోపం మామకి *30* సెకండ్లు  కూడా ఉండేది కాదు. మళ్ళీ నాన్న రెడీ అయ్యి బయటకి వొచ్చేసరికి, అంతా మామూలే, జోక్సు, తిండి, ట్రెయిను- మేము పక్కన కూచ్చుని ఇవ్వాళ ఎంతసేపటికి మామకి బరస్టింగ్ పాయింట్ వస్తుంది అని చూస్తూ ఉండే వాళ్ళం. ఇంకో విషయంలో కూడా ఈస్ట్ ఈస్ ఈస్ట్ అండ్ వెస్ట్ ఈస్ వెస్ట్, అండ్ ద ట్వెయిన్ షల్ట్ నెవర్ మీట్ అని నిరూపించారు. మామని నాన్న పని రాక్షసుడు అనేవారు. ఏకంగా రెస్ట్ లేకుండా మామ రోజుకి *18-20* గంటలు పని చెయ్యగలరు, చేసేవారు. ఆ రూం నుంచి మెహిదీ హసన్‌గారి ఘజల్స్ అలా వినిపిస్తూనే ఉంటాయి, ఇలా బొమ్మలు, కార్టూన్లు వొచ్చేస్తూనే ఉంటాయి. మరి నాన్నకేమో తిండి నిద్ర తరవాతే ఇంకో ధ్యాస.





ఇద్దరికీ పిల్లలు అంటే మహా చెడ్డ ప్రేమ. ఎంత షూటింగులో వున్నా, స్క్రిప్ట్ మధ్యలో వున్నా, బొమ్మలేస్తున్నా, మమ్మల్ని ఎప్పుడూ నెగ్లెక్ట్ చెయ్యలేదు. అంటే రోజూ కూచుని పదమూడో యెక్కం నేర్పించేవారు అని అనుకునేరు. అబ్బే. మేము ఏ క్లాస్‌లో వున్నామని కూడా మమ్మల్ని అడిగి తెలుసుకునేవారు కాదు. ఒక్క పేరెంట్ టీచర్ మీటింగ్‌కి వొస్తే ఒట్టు! కాని, *ET*, స్టార్ వార్స్, సూపర్‌మాన్ సినిమాలకి ఫస్ట్ డే ఫస్ట్ షోకి తీసుకెళ్ళేవారు. *007* వేషాలు ఎంత మంది యాక్టర్లు వేశారు, జీన్ రెన్వాయర్ రూల్స్ ఆఫ్ ద గేం ఎలా తీశాడు, సీతా కల్యాణంలో తాటకివధ గ్రాఫిక్సు కథ, ఎట్సెట్రా ఎట్సెట్రాలాంటి గొప్ప విషయాలు బోధపరిచేవారు.



మనవరాళ్లు లాస్య, బాలలతో బాపు, భాగ్యవతి దంపతులు



మా ఇంట్లో చాలామంది ఉండేవారని చెప్పానుకదా. వారంతా మా ఫ్యామిలీ మెంబర్స్ మట్టుకే కాదు. ఎప్పుడూ ఎవళ్ళో ఒకళ్ళ ఫ్రెండ్స్ ఇంట్లోనే ఉండేవారు. మా చిన్నప్పుడు నాన్న మామల ఫ్రెండ్స్ ఇంటికి వొస్తే భలే సందడిగా ఉండేది. మ్యూజిక్ సెషన్స్, లిటరరీ సెషన్స్, సినిమా సెషన్స్- ఇల్లాగ వాళ్ళకి సెపరేట్ ఇంటరెస్ట్సుకి డిఫరెంట్ ఫ్రెండ్స్ ఉండేవారు. పైకి పకోడీ బజ్జీలు ఇవ్వడానికి మమ్మల్ని పంపిస్తే మేము అవి డెలివర్ చేశాక, తలుపు చాటు నుంచి చూసే వాళ్ళం. పెద్దయ్యాక ఎన్ని ఊళ్ళు తిరిగినా, ఎన్ని కల్చర్స్ ఎక్స్‌పీరియన్స్ చేసినా, ఇంత సంపూర్ణంగా, రెండు చేతులతో జీవితాన్ని ఇంత మనస్ఫూర్తిగా వెల్కం చేసిన ఇద్దరు వ్యక్తుల్ని నేనైతే ఎక్కడా చూడలేదు.

వట్లేదు. హ్యూమర్ అస్సలు రావట్లేదు. Suddenly, there seems to be a pause. It's as if Laurel and Hardy have paused in their antics. Groucho has stopped his incessant chatter. P G Wodehouse has put his pen down. But, the smile will be back. ఎందుకంటే, నాన్న మామ వేసినది బ్రహ్మాస్త్రం కాదండి, నవ్వాస్త్రం. దానికంటే పవర్‌ఫుల్ అస్త్రం సృష్టిలోనే లేదట కదా?

అని, నాన్న మామ చెప్పారు, చాలాసార్లు.

ఇంకోసారి మళ్ళా ఛాన్స్ దొరికితే, ఇంకా చాలా విషయాలు చెప్తా బాపు-రమణల గురించి. నవ్వించే, నవ్వుకునే విషయాలు చెప్తా. అంతవరకు, మామ నాకు ఇచ్చిన కొన్ని గిఫ్ట్లు మీతో కూడా షేర్ చేసుకుంటూ సెలవు తీసుకుంటా.

నమస్తే.



తానా పత్రికకోసం ప్రత్యేకంగా ఈ వ్యాసాన్ని వ్రాసిన ముళ్ళపూడి అనూరాధ, ముళ్ళపూడి వెంకటరమణగారి అమ్మాయి. భర్త కార్తిక్ సుందరం, కుమార్తె తేజలతో కలసి ప్లెజంటన్, కాలిఫోర్నియాలో ఉంటారు. ఇంతకుముందు బాపు-రమణలు, తమ కుటుంబం గురించి ఆమె రాసిన 'నాన్న మామ మేము 'అను' తోక కొమ్మచ్చి' వ్యాసాన్ని *http://pustakam.net/?p=10761*లో చదవవచ్చు.



# బాపుతో బాపు...





## నా గాడ్‌ఫాదర్... గురించి కాస్త
## నా బొమ్మల కథ మరికాస్త...




ఇంగ్లీషులో గాడ్‌ఫాదర్ అనేమాట ఉంది. తెలుగులో దానర్థం 'ప్రత్యక్ష దైవం' అని నా నమ్మకం. నాకు గాడ్‌ఫాదర్- ప్రత్యక్ష దైవం అర్థూర్ ఈసెన్‌బర్గ్ అనే అమెరికన్ జ్యూ. (బర్గ్ అని చివరొస్తే జ్యూ అన్నమాట. ఇంకో మహనీయుడు స్టీవెన్ స్పీల్‌బర్గ్.) Isen అని ఉంది కదా ఐసెన్ అనాలా? అంటే కాదు ఈసెన్ అనాలి- మీ కామరాజుని కేంరాజ్ అంటే ఎలా ఉంటుంది అనేవారు. ఆయన 1955-1960 ప్రాంతాల్లో ఫోర్డ్ ఫౌండేషన్ ప్రతినిధిగా మద్రాసులో ఉండేవారు. పుస్తకాలంటే ఆయనకున్న అభిమానం (తెలుగులో చెప్పాలంటే అబ్సెషన్) అంతా ఇంతా కాదు. రాత్రి పన్నెండూ రెండూ అయినా సరే- మేలుకుని గుడ్-బ్యాడ్-అగ్లీ (చదివేదాకా తెలీదుగా) ఏదో ఓ పుస్తకం పూర్తి చేయాల్సిందే. అలా చదివినవి అప్పుడప్పుడు నాకిస్తూ, 'Promise not to return,' అనేవారు.

మనదేశం ట్రాన్స్‌ఫర్ అవగానే ఇక్కడికి తెచ్చుకున్న ముఖ్యమైన సామాను తన లైబ్రరీ. ఆయన లైబ్రరీలోకి అడుగుపెట్టగానే పుస్తకాలూ, పైపు టుబాకో సువాసన మృదువుగా తగిలేది. ఫోర్డ్ ఫౌండేషన్ తరపున ఆయన సదరన్ లాంగ్వేజ్ బుక్ ట్రస్ట్ మొదలెట్టారు. తెలుగు, తమిళ, మలయాళ, కన్నడ భాషలలో మంచి పుస్తకాలు అందరికీ అందుబాటులో ఉండేలా ప్రచురించడం దాని పని.

నేనన్నా, నా బొమ్మలన్నా- ఆ వరుసలో వాత్సల్యం, ప్రేమ చూపించేవారు. అది 'అవ్యాజమై'నటువంటిది. (ఈ మాట వాడాలని ఎన్నాళ్ల నుంచో ప్రయత్నం.) ప్రతివానికీ నా కారు చూపించి (సెకండు హ్యాండుది) మా బాపు బొమ్మలేసి సంపాదించుకున్న డబ్బుతో కొనుక్కున్నాడు తెలుసా అని గర్వంగా, మా నాయనమ్మ చెప్పినట్టు చెప్పేవారు. ఓమారు ఉత్పలవారి పద్యాలకి నా బొమ్మలున్న పుస్తకానికి అవార్డు వస్తే గర్వంగా వెళ్లి చెప్పా. ఆయన, 'నేను అవార్డు కమిటీలో ఉన్నానోయ్. మిగతా కమిటీ సభ్యులు చూడకుండా అడుగునించి పైకి తీసి పెట్టేవాడిని నీ పుస్తకాన్ని,' అని నవ్వారు. ఈ సంగతి గుర్తుచేస్తూ ఆమధ్య ఇజ్రాయిల్‌లో ఉన్న ఆయనకు (ఇప్పుడక్కడ రిటైరయ్యారు) ఉత్తరం రాస్తూ, "When I told you about my award, you said- My dear idiot, I put it on the top









of the other books all the time" అని కోట్ చేస్తే- ఆయన జవాబుగా ఫోన్ చేస్తూ, "Bapu- I never called you an idiot- at least not in your presence," అన్నారు. ఆయనకు జోకుపడే ఛాన్సు దొరికితే వదిలేవారు కాదు. సదరు సదరన్ లాంగ్వేజెస్ బుక్ ట్రస్టు (SLBT)కి నన్ను ఆనరరీ ఆర్టు డైరెక్టరుని చేసేశారు. ఎం. శేషాచలం అండ్ కంపెనీ పేరు వినే ఉంటారు. ఆ ప్రచురణ సంస్థ పాఠ్యపుస్తకాలూ అవీ వేసేవారు బందరు నుంచి.

ఈసెన్‌బర్గ్‌కి వారబ్బాయి శ్రీ ఎం.ఎన్. రావుగారితో స్నేహమయింది. ఇహ రావుగారిచేత బ్రహ్మాండమైన పుస్తకసేవ చేయించారు. రకరకాల సాహిత్యం పాకెట్ బుక్ సైజులో ఎమెస్కో పాకెట్ బుక్స్ పేరిట నెలకి నాలుగేసి వేయించారు. ఒకోటి రెండు రూపాయలు. సంప్రదాయ సాహిత్యం- పాండు రంగ మహత్యం శ్రీ విశ్వనాథవారి పరిచయంతో రెండు రూపాయలకి ఊహించగలరా! అలాగే ప్రకాశంగారి జీవితచరిత్ర!

గుంటూరు శేషేంద్రశర్మగారి కవిత, విద్యార్థిసాహితి, తెలుగు ఇంగ్లీషు పాకెట్ డిక్షనరీ, ఆఖరికి చలంగారి మైదానం కూడా వేశారు. (ఈ పుస్తకం ముఖచిత్రం చూసి ఈసెన్‌బర్గ్ కంగారుపడిపోయారు. పొదలచాటున ఏదో పడిపోతే వెతుక్కుంటున్నారు, ఆ కంగారులో ఒక్కళ్ల మీదొక్కళ్లు పడ్డారని సర్దిచెప్పాం). ఇవన్నీ ఒకోటి రెండు రూపాయలకు ప్రచురించేవారు.

**1965**లో ఒక పెద్ద సంస్థ చేయవలసిన బృహత్కార్యం శ్రీ ఆరుద్రగారి ఒంటిచేత్తో సాధించిన సమగ్ర ఆంధ్ర సాహిత్యం పన్నెండు వాల్యూములు HLP (Home Library Plan) ఆధ్వర్యంలో రావుగారి చేత వేయించారు. **1969**లో ఎమెస్కో శత పుస్తకోత్సవం చేయించారు. ఇంటింటా స్వంత గ్రంథాలయం స్కీము పెట్టించారు. పుస్తక ప్రపంచం అనే మాసపత్రిక బులెటిన్, అనేక బహుమతి స్కీములు- ఇదంతా ఆయన జీవన ధ్యేయం. పుస్తకాలు కొనిపించడం, చదివించడం- ఇంటింటా పుస్తకాలు చేర్చి, చిన్న పుస్తకాలయం ఏర్పాటు చేసుకోవడం. ఇంటికి ముఖ్యమైన అలంకరణ పుస్తకం అని ఆయన జెండా. నన్ను- పత్రికలకు కథాచిత్రాలు వేసేటప్పుడు ఏదో మూల చిన్న పుస్తకాల బీరువాయో, అలమార పక్క పుస్తకాలు- అలమార లేకపోతే బల్ల మీద పుస్తకాలు- వంటిల్లయితే కూరలబుట్ట పక్క నగం చదివిన వారపత్రిక, ఆఖరికి రిక్షావాడి గుడిసేనా సరే పొట్లం కట్టిన ప్రింటెడ్ పేజ్ వేయమనేవారు.

అప్పట్లో పుస్తక ప్రచురణా రాజ్యానికి బెజవాడ రాజధాని. అక్కడి ప్రచురణ పరిస్థితి అంతా ఆయన క్షుణ్ణంగా తెలుసుకున్నారు. నాలుగైదు కోట్ల ఆంధ్ర ప్రజలకి ఒక్కో పుస్తకం వెయ్యి కాపీలేస్తే గొప్ప! ఆ cut throat పద్ధతులు చూసేసరికి ఆయన మతిపోయింది. ఓమారు టూరుకు నన్ను





తీసికెడుతూ ఎజెండాలో బెజవాడ చూశారు. అది వానాకాలం. "బెజవాడ I can stand. And rains I can stand. Not both together,'' అన్నారు. అప్పుడు బెజవాడలో ఓపెన్ డ్రైనేజ్. అయినా ఆయన పట్టు విడువలేదు. 'పుస్తకాలు కొనడమా! బార్బేరియస్,' అన్న రమణగారి గిరీశం మాటల్ని తిరక్కొట్టి ఎన్ని మంచి పుస్తకాలు కొనిపించారో- ఎన్ని ఇళ్లల్లో చిన్న చిన్న పుస్తకాలు బీరువాలు నిలబెట్టారో చెప్పలేను.

రచయితలకీ, ఆర్టిస్టులకీ ప్రచురణకర్తలిచ్చే సంభావన తెలుసుకుని ఆశ్చర్యపోయారు. నేను బొమ్మల వృత్తిలో కాస్త నిలదొక్కుకునే టైముకి ముఖచిత్రానికి వంద, కథల బొమ్మకి పాతికా ముప్ఫయ్యో ఇచ్చేవారు. (ఒకప్పుడు బాల పత్రికలో బొమ్మలేసేటప్పుడు నెలకు వచ్చే అయిదు రూపాయలూ ఆ మేనేజరు అరగంట నించోబెట్టి రేపు రమ్మనేవాడు. అలా వారం తిప్పి అప్పుడు విసిరేసేవాడు.) మరో పబ్లిషరు ఆ పాతిక కూడా ఇచ్చేవాడు కాదు. కానీ చాలా మంచి పుస్తకాలు చేశాడు. వాటికి ఆయా రచయితల పేరు కాకుండా యూనిఫారంగా తన పేరే వేసుకునేవాడు. అందువల్ల బెజవాడలో ఫలానా పబ్లిషరు బాధితుల సంఘం అని పేరు పెట్టుకున్నాం. ఆయన కొత్తగా ఇల్లు కట్టుకున్నాడు. గృహప్రవేశానికెళ్లి-తలొకరూ ఈ కిటికీ నాది, ఈ తలుపు నాది, ఈ ద్వారబంధం నా డబ్బుల్తో- అని చెప్పుకుని సంతృప్తిపడ్డాం.

ఇంకో పత్రికాయన రాత్రి పదింటికి లేపేవాడు. డబ్బులు తెచ్చాడేమో అని గబగబా వస్తే- ఇవాళ మీ బర్త్‌డే కదండీ- అంటూ ఓ యాపిల్ పండు చేతిలో పెట్టి వెళ్లిపోయేవాడు. ఇంకో ఆయన నా చొక్కా కాలరు సర్దుతూ, గుండీలు సరిచేస్తూ, చిన్నచిన్న దారమ్ముక్కలు బయటకొస్తే అవి తుంపి పారేస్తూ, నించునే ఆ కబురూ ఈ కబురూ చెప్పి, పండు, ఫలము కూడా ఇవ్వకుండా వెళ్లేవాడు. ఇంకో ఆయన నాకు లంక చుట్టలు ఇష్టమని తెలిసి వాళ్లూర్నించి ఓ గ్లాక్సో డబ్బాడు తెప్పించి ఇచ్చేవాడు. ఇతను ఏలాగా డబ్బులివ్వడు బొక్కిందే దక్కుడని తీసుకునేవాణ్ణి. ఆయన మాత్రం బయటకెళ్లి-కన్ను కొడుతూ, 'సింపుల్ నాలుగు చుట్టలు పడేయ్- నాలుగు సంచికలకు బొమ్మలు లాగేస్తాడు,' అని చెప్పుకునేవాడు.

ఇంకొకరు బొమ్మ కోసం వచ్చేవారు. దమ్మిడి ఇవ్వడని తెలుసు. చాలా కష్టమండి- ఏమాత్రం వీలుపడదు అంటూ అరగంట చెప్పి, లోపలికెళ్ల బోతుంటే, 'అయితే రేప్పొద్దున్నొచ్చి బొమ్మ కలెక్ట్ చేసుకుంటాను,' అని వెళ్లి పోయేవాడు. తమాషా ఏమిటంటే నేను బొమ్మ అర్ధరాత్రి వేసి, రెడీగా ఉంచే వాణ్ణి. ఆయన దమ్మిడీ విదల్చకుండా పొద్దున్నే వచ్చి బొమ్మ కలెక్టు చేసుకుని వెళ్లిపోయేవాడు. అందువల్లే ఆయనకీ మధ్య నేషనల్ అవార్డిచ్చారు.



ఈసెన్‌బర్గ్ దంపతులు 1978లో మద్రాసు వచ్చినప్పుడు బాపు తీసిన ఫోటో

నాకిచ్చే ఆ కాస్త డబ్బూ బొమ్మ వేయడానిక్కాదు. బొమ్మ వేయాల్సిన ఆ కథో, పుస్తకమో చదివినందుకు కూలి అనుకుంటాను.

కానీ నా వృత్తిలో గొప్పదనం- ఉండుండి చాలా గొప్ప కథలు వస్తుం టాయి. ఇన్నాళ్లు ఇన్ని వందల బొమ్మలకి ఎంత తక్కువ ఇచ్చినా, అసలివ్వక పోయినా ఈ ఒక్క కథ మొత్తం కాంపన్సేట్ చేసేస్తుంది. శ్రీ నండూరి రామమోహనరావుగారు, శ్రీ ముళ్లపూడి వెంకటరమణగారు ఆంధ్ర వారపత్రికలో సంపాదకత్వం నెరపేటప్పుడు లా చదువుతూ బొమ్మలు వేసే వాణ్ణి. అలాటి గొప్ప కథలొచ్చినప్పుడల్లా బతిమాలి రచయిత స్వదస్తూరితో ఉన్న ఒరిజినల్ స్క్రిప్ట్ తీసుకుని దాచుకునేవాణ్ణి. శ్రీ మల్లాది రామకృష్ణ శాస్త్రిగారివీ, రాచకొండ విశ్వనాథశాస్త్రిగారి 'జరీ అంచు పట్టుచీర', భమిడిపాటి రామగోపాలంగారి 'వెన్నెలనీడ'- ఇలా కథకిగానీ, నవలగ్గానీ ఏదో సన్నివేశం చిత్రించడం కన్నా కథకుడు ఏం చెప్పదలచుకున్నాడో అది బొమ్మలో చూపిం చాలని తాపత్రయం. శ్రీ నామినిగారి గొప్ప కథలకి ఇది కొంచెం సాధ్యపడింది. ఎటొచ్చీ మిథునం అనే శ్రీరమణగారి కథారత్నానికి మాత్రం దాని అంతస్థుకి తగిన బొమ్మ కుదరలేదు. అందువల్ల కథంతా స్వదస్తూరితో రాసి ఆప్తులైన స్నేహితులకి జిరాక్స్ కాపీలు పంపి ఆ మహానుభావుడికి కృతజ్ఞత తెలుపు కున్నాను. వంశీగారి నవలొకదానికి పెద్ద కన్ను వేసి కన్నీరు నెమలిపించం రూపంలో కుదిరింది.

అలాగే భద్రాచలం రామదాసు ప్రాజెక్టువారు వేసిన పాటల ఆడియో కాసెట్టు మీది బొమ్మ- ఇటు ఆంజనేయస్వామి, అటు రామదాసూ తన్మయంతో చిందేస్తూ పాడుతుంటే ఆశీర్వదిస్తున్న రాముడు చేతివేళ్ల

శ్రీరమణగారి 'మిథునం' కథ ఎంతో నచ్చిన బాపుగారు అంత పెద్ద కథని పూర్తిగా స్వదస్తూరీతో తిరగరాసి మిత్రులతో పంచుకుంటూ డా॥ జంపాల చౌదరికి వ్రాసిన ఉత్తరంలో భాగం.



శ్రీరమణ గారు రాసిన 'మిథునం' ఒక కాపీ పంపుతున్నాను. ఇది చాలా గొప్ప కథ. నా, రమణ గారి అనుభూతిని మంచి కథలు నచ్చే మీతో పంచుకుందామని పంపుతున్నాను. వీలైతే మీకూ ఓహో అనిపిస్తే - కళ్లు నిండా ఆనందంతో చెమరిస్తే - మరిన్ని మంది చేత చదివించండి






తాళం వేస్తున్నట్టు కుదిరింది. అలాగే పత్రిక అనే మేగజైన్‌కి రాసిన అక్షరాల 'లోగో', విశాలాంధ్ర వారి తెలుగుకథా సంకలనానికి- ఎప్పుడో వేసిన అద్దంలో చూసి బొట్టు పెట్టుకుంటున్న ఎంకిని- అద్దం బదులు తెలుగు పుస్తకంలో చూసుకుంటూ బొట్టు పెట్టుకుంటున్నట్టు మార్చి వేసిన బొమ్మ చాలా తృప్తినిచ్చింది.

దువ్వూరి వేంకటరమణశాస్త్రిగారి జానకితో జనాంతికం అద్భుతమైన రచన. శాస్త్రిగారు సీతతో రాముడు ఆమెకు చేసిన అన్యాయం గురించి జనాంతికంగా చెప్పి వాపోతాడు. దానికి బొమ్మలో - సర్వం తానే అయి ఉండి వ్యాపించి ఉన్న స్వామి పాదాల వద్ద జనాంతికం ఎలా అన్నట్టు చిన్న నవ్వు నవ్వుతున్న బొమ్మ నాకెంతో ఇష్టం.

అమెరికన్ బ్రిటిష్ లైబ్రరీకెళ్లి పత్రికలూ పుస్తకాలు తెగ చూసేవాణ్ణి. అప్పుడు సెంట్రల్ స్టేషన్ పక్కన మూర్ మార్కెట్ అని ఉండేది. అక్కడి సెకండ్‌హాండ్ పుస్తకాలు- ఓహో ట్రెజర్! ప్రతి శనాదివారాలు వెళ్లి ఆ గురుతుల్యుల పుస్తకాలు దొరికితే తెచ్చుకునేవాణ్ణి. నాకు దేవుళ్లలాంటి ఈ ఆర్టిస్టులందరి గురించీ ఈసెన్‌బర్గ్‌కి చెప్పేవాణ్ణి. వాళ్లని కలుసుకోవాలని నాకు ఎంత ఆశ ఉండేదో గ్రహించారు ఆయన. ప్రతి ఏడూ అమెరికాలోని హార్వర్డ్ యూనివర్సిటీలో సెమినార్ జరుగుతుంది. దానికి నన్ను పంపించాలని రెండు మూడేళ్లు విశ్వప్రయత్నం చేశారు. సాధ్యపడలేదనుకోండి. 1978లో రాముడి ధర్మమా అని సీతాకల్యాణం సినిమాతో లండన్, షికాగో ఫిలిం ఫెస్టివల్స్ వెళ్లినప్పుడు బెల్జియంలో హెర్గ్, అమెరికాలో నార్మన్ రాక్‌వెల్‌ని కలవాలని ప్రయత్నించా. సరిగా ముందురోజే పేపర్లో వారి మరణవార్త వచ్చింది. ఇహ ఎవరినీ కలుసుకోకూడదని నిశ్చయించుకున్నాను.

1967లో సాక్షి తీశాము. అది నా మొదటి సినిమా- రమణగారి బ్రిలియంట్ డైలాగులు, స్క్రీన్‌ప్లే- నా భయంకరమైన ఓవర్ యాక్టింగులు. అప్పుడు నేను చేయించిన లేదా సదరు నటులు చేయగా నేను అనుమతించిన నాటకీయ నటనలు తలుచుకుంటే ఇప్పటికీ చచ్చే సిగ్గేస్తుంది. ఎంచేతో అది ఈసెన్‌బర్గ్‌కి చూపించా మీ దొరలకి చూపించొచ్చా అని. ఇంకోరయితే ఆరోజు నుంచి నాతో మాట్లాడేవారు కాదు. ఆయనకు నా మీద ఎంత వాత్సల్యం అంటే జాలిగా చూసి, 'No Bapu! Sorry- They will laugh at the wrong places,' అన్నారు సున్నితంగా. నా చిన్నప్పుడు ఓరోజు మా నాన్నగారి ఆఫీసు రూంలో గోడకి తగిలించిన కోటులో చిల్లర దొరికితే కొట్టేద్దామని చేయి పెట్టా. సరిగ్గా అప్పుడే ఆయన రూంలోకి వచ్చారు. గుండె ఆగిపోయి, 'కోటు కిందపడిపోతే తీసి మేక్కు తగిలిస్తున్నా,' అని నసిగాను. 'జేబులో చెయ్యి పెడుతూ కోటు కింద పడిందంటావేమిరా,' అన్నారంతే. ఇంకేం చేయ లేదు. చావగొట్టినా అంత బాధ... సిగ్గూ వేసేది కాదు. అది గుర్తొచ్చింది.

1960లో ఫోర్డ్ ఫౌండేషన్‌వారు మనదేశం వారు సబ్సిడీలిచ్చి సహాయపడుతున్న సంస్థల్ని సందర్శించి రిపోర్టు తయారుచేయమన్నారు ఆయన్ని. అప్పుడు నేను జె. వాల్టర్ థాంసన్ యాడ్ ఏజెన్సీలో ఆర్టిస్టుగా పనిచేస్తున్నా. మొత్తం ఇండియా- అటు నేపాలూ కూడా తిరుగుదాం సెలవు పెట్టేయ్. నాతో అఫీషియల్ కెమెరామేన్‌గా రా అన్నారు. నాకు ఫోటోగ్రఫీ నిల్లని చెప్పా. ఏదో డబ్బా కెమెరా కొనుక్కుని రావో అన్నారు. బొంబాయి ఎజెండాలో ఉందా అని అడిగాను. 'ఏం ముసిలాయన్ని చూడాలని కదూ,' అన్నారు. ముసిలాయన అంటే హిందుస్తానీ గాయకుడు ఉస్తాద్ బడే గులాం అలీఖాన్. అప్పుడాయన బొంబాయిలో ఉండేవారు.

ఆయన సంగీతం అంటే నాకెంత పిచ్చో ఈసెన్‌బర్గ్‌కి తెలుసు. యాత్ర మొదలయింది. హైదరాబాద్- అటు నుంచి బొంబాయి (ఇంతకీ అక్కడ ఖాన్ సాబ్‌ని చూసే అదృష్టం కలగలే- బొంబాయి ఆఫీసుకెళ్లాను. అప్పుడు నా జీతం పదిహేను వందలు. యాడ్ ఏజెన్సీలలో అంతంత జీతాలు తీసుకునే ఆర్ట్ డైరెక్టర్స్ పదిమందిలో నేనొకణ్ణిట) వెళ్లా. నాకు బ్రహ్మరథం పట్టేశారు. అక్కడ నుంచి అహమ్మదాబాద్, ఢిల్లీ ఇండస్ట్రియల్ ఎస్టేటూ. అప్పుడే తాజ్‌మహల్ చూశా. తర్వాత పంజాబు, చండీఘర్. పంజాబు నుంచి తిరిగి వస్తూంటే వరుసగా మిలిటరీ ట్రక్కులు వెళ్లడం చూశాను. మర్నాడు పేపర్లో చూద్దుం కదా- ఇండో చైనా యుద్ధం! నా యాత్ర ఆగిపోయింది. లేకపోతే తూర్పు దక్షిణదేశం, నేపాలు కూడా చూసేవాణ్ణి. ప్రాప్తం లేదు.

ఈసెన్‌బర్గ్ పుస్తకాల విషయంలో హెడ్ ఆఫీసుకి ఎన్నో ప్రపోజల్స్ ఇచ్చారు. కానీ వారిలో చలనం లేదట. 'Then- I am the most overpaid clerk here,' అనేసి రిజైన్ చేసి యూదుల దేశం ఇజ్రాయిల్ వెళ్లిపోయారు. ఎం.ఎన్. రావుగారు పోయారు. ఇంటింటి గ్రంథాలయం పాకెట్ పుస్తకమూ మొత్తం చిరిగిపోయాయి. నాకూ ఆయనకీ ఉత్తర ప్రత్యుత్తరాలు మాత్రం ఆగలేదు. ఎప్పుడూ నా బాగోగులు కనుక్కుంటారు. నేను వేసిన పుస్తకాలు పంపు

తుంటాను. నెల క్రితం ఇజ్రాయిల్ నుంచి ఫోన్ చేసి అభిజ్ఞాన శాకుంతలం విత్ ఇంగ్లీష్ ట్రాన్స్‌లేషన్ రెండు కాపీలు పంపమన్నారు. ఒకటి ఎవరికిటా తెలుసా- ఒక ఎనిమిదేళ్ల ఇజ్రాయిల్ అమ్మాయికిట!!! పుస్తకాలంటే సాటి వారిలో ఆయన రేకెత్తించే ఆసక్తి అటువంటిది.

ఆయనకి నా బొమ్మలంటే ఎంత ఇష్టమైనా నా బొమ్మల అంతస్తు నాకు తెలుసు. కొందరు చెప్పలేనంత ప్రేమతో- 'నువ్వే కనుక ఏ బెంగాల్ లోనో అమెరికాలోనో పుట్టి ఉంటే,' అంటూ విచారించేవారు. కానీ తెలుగు దేశంలో పుట్టడమే నా అదృష్టం. నా పూర్వజన్మ సుకృత శుభం వలన మూడు దశాబ్దాలుగా మరో ఆర్టిస్టు లేనందువలన గంజాయివనంలో బాపతుగా పేరొచ్చేసింది. నేను డావిన్సీ, మైకెల్ ఏంజలో దగ్గర నుంచి నేటి నందలాల్ బోస్, పిలకావారు, వైకుంఠంగారి కళాఖండాలు చూశాను. ఆనాటి ఆర్థర్ రాకాం దగ్గర నుంచి నేటి ఆర్.కె. లక్ష్మణ్, గోపులుగారి బొమ్మలూ చూశాను. అందువల్ల నా చోటూ, ప్లేసూ నాకు తెలుసు. (తెలుగులో I know where I stand) డెరెక్ మాల్కం అనే ఇంగ్లీష్‌దొర, గార్డియన్ అనే లండన్ పేపరు ఫిలిం క్రిటిక్. మా సీతాకల్యాణం చూసి లండన్ ఫిలిం ఫెస్టివల్‌కి తీసుకెళ్లిన దగ్గర నుండి బాగా స్నేహితుడై బాగా చనువు ఏర్పడింది. ఆయన్నోమారు అడిగాను- నేను మీ దేశంలో పుడితే ఆర్టిస్టుగా నా (హోదా) స్థానం ఎక్కడుండేదని. ఆయన, "You would be rated as a fifth grade artist," అన్నారు. నేను అనుకున్న దానికన్నా రెండు మెట్లు ఎక్కువే చెప్పారు. అయినా- బుడుగు అన్నట్టు నా అంతటివారు నేనే! నాకు నచ్చిన బొమ్మ ఇతరులకు బాలేదన్నా బెంగలేదు. నచ్చనిది ఇతరులు పొగిడినా తేడా ఉండదు. రాముడి దయవల్ల అప్పుడప్పుడు కొన్ని బొమ్మలు బాగా కుదురుతుంటాయి. అవి రమణగారికి చూపిస్తాను. ఆ తర్వాత వాటి సంగతి మర్చిపోతాను. అంత బాగా రానివి చూపించను. అంతే సంగతులు. బాగా కుదిరిన బొమ్మ కొన్నాళ్లయిన తర్వాత చూసుకుంటే- అయ్యబాబోయ్ ఇప్పుడిలా మళ్లీ కుదరడం ఇంపాజిబుల్ అనిపిస్తుంది.

**ఇహ కొస జోకులు**

ఓ ఫ్రెండు పొడుగాటి గొట్టంలో హోల్డరులో సిగరెట్ అమర్చుకుని పీల్చేవాడు. ఓ కార్టూన్ వేశా. ఆయన్ని కుర్చీలో కూచోబెట్టి మూడు గజాలున్న ఈ హోల్డరుని పెట్టేను. దాంట్లో కొడిగట్టిన సిగరెట్టు- పెళ్లాన్ని కేకేస్తూ, 'ఇదిగో సిగరెట్టు కొడిగట్టింది. ఇలా వచ్చి కాస్త కుదుపు.' ఆయన తెగ నవ్వాడు. కానీ... మళ్లీ ఆవిడకి మాత్రం చాలా కోపం వచ్చిందట.

మరో కార్టూను- శోభనం గదిలో కొత్త పెళ్లికూతురు, పెళ్లికొడుకు మీద విలాసంగా చేతులేసి, "నేను మా అమ్మ కడుపులో ఉండగా రోజూ కీ గ్రామఫోనులో పాత రికార్డులు వినేదట. నన్ను కనే టైము వచ్చేసరికి అవన్నీ అరిగిపోయి... రిగిపోయి... రిగిపోయి... రిగిపోయి... రిగిపోయి... రిగిపోయి..."

ఈ కార్టూను చూసేసరికి ఆవిడ డబుల్ కోపంతో ఇది పచ్చి కాపీ- ఇంగ్లీష్ కార్టూన్‌కి పచ్చి కాపీ అని సంపాదకునికి లేఖల్లో రాసేసింది. నేను జవాబుగా, 'ఆవిడ పప్పులో కాలేసింది. ఇది ఇంగ్లీష్ కార్టూన్‌కి ఏమాత్రమూ కాపీ కాదు. అమెరికన్ కార్టూన్‌కి- రికన్ కార్టూన్‌కి- రికన్ కార్టూన్‌కి... రికన్ కార్టూనికి... రికన్ కార్టూన్‌కి... రికన్ కార్టూన్‌కి...' అని రాశాను.

నమ్మితే నమ్మండి- నాకన్నా ఓ గొప్ప కార్టూనిస్టు ఉండేవారు. ఆయన పేరు జేమ్స్ తర్బర్ (ఆయన రచయిత కూడా). న్యూయార్కర్ అనే పత్రికలో ఆయన కార్టూన్లు చూసి ఒక పాఠకుడు సంపాదకునికి, 'అవేం కార్టూన్లండీ- బోడి కార్టూన్లు. వాడికన్నా మా రెండేళ్ల అబ్బాయి బాగా వేస్తాడు. ఎక్కడ దొరికాడు ఆ ఫిఫ్త్ రేటుగాడు,' అని రాశాడు. తర్బర్‌గారు ఇలా రిప్లయి ఇచ్చారు. 'నన్ను ఫిఫ్త్ రేటుగాడు అనడం ఇన్సల్టు. నేను థర్డ్ రేటుగాడిని.' (అంటే నాకన్నా రెండు మెట్లు పైన ఉన్నాడు.)

బాపు బొమ్మలకొలువు సౌజన్యంతో

**చేయి తిరిగిన ఆర్టిస్టు**

దాశరథిగారి గాలిబ్ గీతాలకు బొమ్మలన్నిటినీ బాపుగారు ఒక సిట్టింగులో వేసేశారు. అన్నీ పూర్తయ్యేప్పటికి వేళ్ళు కొంకర్లుపోయాయి. ఇది చూసిన బాపుగారి శ్రీమతి భాగ్యవతి, చేయితిరిగిన ఆర్టిస్టు అంటే ఇదేనా అన్నారు.

**అదే కావాలి**

బాపుగారిని కలవటానికి వచ్చిన ఒక మిత్రుడు, "బాపూ, బయటకి వెళ్తున్నానోయ్, ఏమన్నా కావాలా," అని అడిగాడు.

"అదే కావాలి", అని బాపుగారి సమాధానం.

**బూడ్సు తొడిగేద్దాం.**

ఒకాయన వెంకటేశ్వరస్వామి పాదాలు మాత్రం వేసి ఇస్తే తన కంపెనీకి లోగోగా వాడుకుంటానన్నాడట. వేసి ఇచ్చాక వేళ్లు చూసి సణిగాడట. బాపుగారు ఇలాటి సందర్భాల్లో పాదాల వేళ్లు ఉబ్బెత్తుగా వేస్తారు. ఎందుకు వేయాలో ఆయనకు తెలుసు. వేయించుకున్న వాడికి తెలియకపోతే అడగాలి. కానీ ఆయన, "వేళ్లు కొంచెం వాచినట్టుగా ఉన్నాయేంటండీ' అన్నాడట. బాపుగారు వెంటనే, "దానికేముందండీ? బూడ్సు తొడిగేద్దాం," అన్నారు చెళ్లుమన్నట్లు.

**ఖాళీ హాళ్ళు**

ఒక హీరోయిన్‌తో మాట్లాడ్డానికి బాపుగారు ఆమె ఇంటికి వెళ్ళారు. ఆమె అసిస్టెంటు ఎదురువచ్చి, 'రండి, రండి. ఇప్పటిదాకా ఉన్నవాళ్ళు ఇప్పుడే వెళ్ళిపోయారు. హాలంతా ఖాళీ అయింది. కూర్చోండి,' అంటూ స్వాగతం పలికాడు.

"ఖాళీ హాళ్ళు మాకు అలవాటే లెండి," అని బాపు జవాబు.

*ఈ విషయాన్నే ఆయన కార్టూన్‌గా కూడా వేశారు. అది ఇటీవలే స్వాతి వారపత్రికలో అచ్చయ్యింది.*



# బాపుగారి చివరి ఇంటర్వ్యూ

వి.ఎన్. ఆదిత్య
పులగం చిన్నారాయణ



# రమణగారు లేని జీవితం కష్టంగా ఉందండీ!

సరిగ్గా 200 రోజుల క్రితం... ఉదయం పదకొండు గంటల వేళప్పుడు -చెన్నైలో బాపుగారింట్లో... ఆయన ఇంటర్వ్యూకోసం దర్శకుడు వీఎన్ ఆదిత్య, నేను (పులగం చిన్నారాయణ), ఫొటోగ్రాఫర్ శివ చాలా ఉత్కంఠగా ఎదురుచూస్తున్నాము. ఈలోగా ఒక చేదువార్త... బాపు గారికి నీరసంగా ఉందట. ఇప్పుడేం మాట్లాడరట.. ముగ్గురం నీరసపడిపోయాం. ఏం చేయాలో తెలియని అయోమయ స్థితి. కనీసం ఆయనను కలిసి అయినా వెళదామని అలానే కూర్చుండిపోయాం...

మా అదృష్టం బాగుంది. బాపు గారు కరిగిపోయారు. లోపలకు రమ్మన్నారు. చాలా నీరసంగా కనబడ్డారాయన. మాటలు మొదలయ్యాక... చాలా హుషారు ఆయనలో. చిన్న పిల్లాడైపోయారు.

చిత్రాలు... చిత్ర పటాలు... చిత్రాతిచిత్రమైన సంఘటనలు... గోడకు వేలాడదీసిన పెయింటింగ్‌లు... మనసులో తగిలించుకున్న జ్ఞాపకాల చిత్తరువులు... పలు రకాల పుస్తకాలు.. బోలెడన్ని గ్రామ్‌ఫోన్ రికార్డులు... ఆయన బొమ్మలేసే చోటు.. రంగులేసే కుంచె... ఆ పక్కనే ఆయనకు కావాల్సిన స్వరాలందించే పాతకాలపు టేప్‌రికార్డర్...

బాపుగారితో అలా... అలా... లీనమైపోయాం.

రెండున్నర గంటలు... బాపు గారితో గడపడమంటే, మా మనసు ముంగిట్లో ముత్యాలముగ్గు వేసుకున్నంత ఆనందం. ఈ ఇంటర్వ్యూ మా జీవితంలో గ్రేటెస్ట్ మెమొరీ. కానీ... అదే ఆయన లాస్ట్ ఇంటర్వ్యూ అవుతుందని అనుకోలేదు. మనసు నిండా విషాద మేఘాలు కమ్ముకున్న ఈ వేళ... ఒక్కసారి ఆయన జ్ఞాపకాలలోకి... మాటలలోకి...



**మీకు ఈ చిత్రకళ ఎలా అబ్బింది?**

మా నాన్నగారు కూడా బొమ్మలు వేసేవారు. ఆయన అడ్వకేట్ అయినా హాబీగా బొమ్మలు వేసేవారు. అయితే ఇది కూడా గుడ్డా పెట్టేది కాదని ఆయన అభిప్రాయం. నిజంగానే ఆరోజుల్లో ఆర్టిస్టుగా బతకడం కష్టం. అందుకే నన్ను 'లా' చదివించారు.

**లా పూర్తయ్యాక, ఎప్పుడైనా కోర్టులో వాదించారా?**

అస్సల్లేదు. అప్పుడప్పుడు కోర్టుకి వెళ్లా. బీఎల్ డిగ్రీ రావడానికి ఎన్‌రోల్ కావాలి కదా. స్నేహితుల దగ్గర నల్లకోటు అరువు తీసుకుని వెళ్లాను.

**ఇంతకూ మీరు వెళ్లింది ఏ కోర్టు?**

నేను పుట్టి పెరిగిందంతా చెన్నై కదా. అక్కడ కోర్టుకే వెళ్లా. మా నాన్నగారు కూడా అక్కడే అడ్వకేట్‌గా పనిచేశారు.

**తమిళంలో ఓ ఫేమస్ ఆర్టిస్ట్‌కు మీరు ఏకలవ్య శిష్యుడట?**

ఆయన పేరు గోపులుగారు. కాలేజీలో చదువుకుంటున్నప్పుడు నాకు ఇష్టమైన ఆర్టిస్టులు అందరి దగ్గరికీ వెళ్తుండేవాణ్ణి. శని, ఆదివారాలు అదే పని నాకు. గోపులుగారింటికి ఆదివారాలు వెళ్లి, ఆయన బొమ్మలు వేస్తుంటే

చూసేవాణ్ణి. నేనంటే చాలా ప్రేమ ఆయనకు. అప్పట్లో ఆయన ఆనంద వికటన్ మేగజైన్‌లో పనిచేసేవారు.

**మీరు బొమ్మలు గీసే పద్ధతి ఎలా ఉంటుంది?**

(వెంటనే ఆయన తన గదిలోకి తీసుకెళ్లి తను కూర్చుని బొమ్మలు గీసే ప్లేస్ చూపించారు). ఇక్కడే నేల మీద బాసింపట్టు వేసుకుని బొమ్మలు వేస్తుంటాను. మొదట్నుంచీ ఇదే అలవాటు. టేబుల్, కుర్చీ వాడను.

**ఏ ఆర్టిస్టుకైనా మూడ్ ప్రధానం కదా. మరి మీకు ఏ టైమ్‌లో మూడ్ ఉంటుంది.**

నాకు మ్యూజిక్ ఉంటే చాలు. మూడ్‌తో పనిలేదు. ఏ టైమ్ అయినా, అర్ధరాత్రయినా సరే మ్యూజిక్ వింటూ బొమ్మలేసుకునే పని చేసేవాణ్ణి. ఇలా బొమ్మల మధ్యనే పడుకుని నిద్రపోయిన సందర్భాలు కోకొల్లలు. ఇప్పుడు ఓపిక లేదు. కూర్చుంటే లేవలేను.

**మీ రూమ్‌లో హిందీ మ్యూజిక్ డైరెక్టర్ సి. రామచంద్ర ఫొటో పెట్టుకున్నారు..?**

చాలా మంచి మ్యూజిక్ డైరెక్టరాయన. అనార్కలి చేయడానికి ఆయన మద్రాసు వచ్చినప్పుడు కలిశాను. నా క్లోజ్‌ఫ్రెండ్ వి.ఎ.కె. రంగారావుగారు ఆయనకు వీరాభిమాని. సి. రామచంద్రగారి పాటల వల్ల నాకు ఇంతమంది ఫ్రెండ్స్ అయ్యారు. నాకు నలుగురితో కలిసి మాట్లాడటమంటే భయం. జలగండంలా నాకు 'జన'గండం ఉన్నట్టుంది. రామచంద్ర పాట అంటే ఇష్టమని చెప్పగానే, అయిదు నిమిషాల్లో నాకు ఫ్రెండ్స్ అయిన వాళ్లు చాలామంది ఉన్నారు.

**మీరు వినేది గ్రామ్‌ఫోన్ రికార్డులా? ఆడియో క్యాసెట్లా?**

మొదట్లో గ్రామ్‌ఫోన్ రికార్డులే వినేవాణ్ణి. తర్వాత క్యాసెట్లు. ఇప్పుడు సీడీలు.

**మీ దగ్గర బ్రహ్మాండమైన మ్యూజిక్ కలెక్షన్ ఉందట?**

మెహదీహాసన్, బడే గులాం అలీఖాన్‌ల మ్యూజిక్ కలెక్షన్ మొత్తం ఉంది. వాళ్ల గజల్స్ అంటే నాకు ప్రాణం. గజల్స్ అనే కన్నా, వాళ్ల వాయిస్సే నాకిష్టం. ఎన్నిసార్లు విన్నా తనివి తీరని వాయిస్సులు వాళ్లవి. నాకు ఉర్దూ పెద్దగా రాదు. అయినా వారి వాయిస్‌ల వల్ల ఆ పాటలు బాగా ఎంజాయ్ చేశాను. 1978లో మెహదీహాసన్‌ని కలిశాను. ఓ బొమ్మవేసి ఇచ్చి సంతకం పెట్టమన్నాను. 'హార్మోనియం పెట్టి... సగం బొమ్మే గీశావ్. మొత్తం గీసి తీసుకురా. అప్పుడు పెడతాను,' అన్నారు. పెద్దవాళ్లకు వాళ్ల కళంటే అంత అభిమానం. బడే గులాం అలీఖాన్‌ను కలవలేకపోయాను. ఆయన కచ్చేరీలకు నన్ను పీబీ శ్రీనివాస్ తీసుకువెళ్లేవారు.

**సినిమాలు బాగా చూస్తారా?**

రెగ్యులర్‌గా చూస్తా. అయితే అన్నీ వీడియోల్లోనే. నేను సినిమా బఫ్‌ని. రోజుకి పదిదాకా వీడియోలు చూడగలను. వీడియోలు లేని రోజుల్లో మద్రాసులో మూడు రిలీజ్‌లుండేవి. మూడు పూట్లా మూడు రిలీజ్‌లు చూసేసేవాణ్ణి. సినిమా సినిమాకీ మధ్య ఒక టీ తాగి, బిస్కెట్లు తినేవాళ్లం.

**సినిమాలు తీయడానికి మీకు ఇన్‌స్పిరేషన్...?**

చిన్నప్పట్నుంచీ సినిమాలంటే చాలా ఇష్టం. మద్రాసులో హాలీవుడ్ సినిమాలన్నీ విడుదలయ్యేవి. అన్నిటికీ నేలక్లాసుకి వెళ్లిపోయేవాళ్లం.

**మీరు మౌత్ ఆర్గాన్ బాగా వాయించేవారట?**

కాలేజీ రోజుల్లో బాగా వాయించేవాణ్ణి.

**మూగమనసులు పోస్టర్ మీరే డిజైన్ చేశారు కదా?**

అవును. రమణగారు ఆ సినిమాకి వర్క్ చేశారు కదా. సినిమాలో ఉన్నదాన్నే ఎలివేట్ చేస్తూ పడవ, పంగలి కర్ర, ముద్దబంతి పువ్వు ఆర్ట్‌గా వేశాను.




**మీ తొలి సినిమా సాక్షికి మీరు పబ్లిసిటీ డిజైన్ చేసుకోకుండా ఈశ్వర్‌తో చేయించారెందుకని?**

ఈశ్వర్ పోస్టర్స్ ఇష్టపడి సాక్షికి తనతో వేయించాను.

**బంగారు పిచికలో యద్దనపూడి సులోచనారాణిగారిని కథానాయికగా తీసుకోవాలనుకున్నారట..?**

హీరోయిన్‌గా కాదు. ఆ సినిమాలో ఓ చోట హీరోకి గొప్పింటి సంబంధాలు తీసుకు వస్తుంది తల్లి. అక్కడ ఓ పెళ్లికూతురి వేషం యద్దనపూడిగారితో చేయించాలనుకున్నాం. ఆవిడ కూడా ఒప్పుకున్నారు. కానీ చేయించడం కుదర్లేదు.

**మీ ప్రతి సినిమాకూ స్టోరీబోర్డ్ వేసుకుంటారు. ఆ ఆలోచన ఎందుకొచ్చింది?**

నాకు బొమ్మలేయడం వచ్చు కాబట్టి, కన్వీనియంట్‌గా ఉంటుందని స్టోరీ బోర్డ్ వేసుకుంటుంటాను. హాలీవుడ్‌లో దాదాపుగా అందరూ స్టోరీబోర్డ్ ఫాలో అవుతుంటారు. హైదరాబాద్‌లో కూడా స్టోరీబోర్డ్ వేసే ఆర్టిస్టులు చాలామంది ఉన్నారు. అది ప్యూర్లీ పర్సనల్. బయటివాళ్లకు అర్థం కావు. ఆర్టిస్టులు కూడా చూద్దామని తీసుకుని అర్థంకాక ఇచ్చేసేవారు.

**మీ తొలి సినిమా సాక్షి నుంచి స్టోరీబోర్డ్ ఫాలో అయ్యారా?**

అవును. నేను హోమ్‌వర్క్ ఎక్కువ చేసేవాణ్ణి.

**మీ స్టోరీబోర్డ్ ఫాలో అయితే ఎవరైనా ఫొటోగ్రఫీ చేసేయొచ్చనంటారు. లెన్స్ రేంజ్‌లు కూడా డీటెల్డ్‌గా రాస్తారట?**

అబ్బే అదేం లేదండి. ఎవరి పని వాళ్లదే.

**మీ సినిమాలకు గొప్ప గొప్ప బాలీవుడ్ కెమెరామేన్లు పనిచేశారు కదా!**

బాబా ఆజ్మీ, ఇషాన్ ఆర్యలాంటి వాళ్లు పనిచేశారు.

**వాళ్లతో మీకెలా పరిచయం?**

వాళ్ల సినిమాలు చూశాను. హిందీ సినిమా గరమ్ హవాకు ఇషాన్ ఆర్య వర్క్ చూసి, ఆయన ఎక్కడుంటారో కనుక్కుని మాట్లాడాను. ముత్యాలముగ్గు ఆయనకు తొలి తెలుగు సినిమా. దానికి ఆయనకు నేషనల్ అవార్డు వచ్చింది. స్నేహం, గోరంత దీపం, తూర్పు వెళ్లే రైలు సినిమాలకు నాతో పనిచేశారు. ఆయన అసిస్టెంటే బాబా ఆజ్మీ. నటి షబానా ఆజ్మీ తమ్ముడాయన. కైఫీ ఆజ్మీగారబ్బాయ్. రాజాధిరాజు, వంశవృక్షం, రాధాకల్యాణం, త్యాగయ్య, పెళ్లీడు పిల్లలు తదితర సినిమాలకు వర్క్ చేశారు. సంపూర్ణ రామాయణం సినిమాకి ట్రిక్ వర్క్ అంతా రవికాంత్ నగాయిచ్‌గారు చూసుకున్నారు.

**మీరు షాట్ ఎక్కడ పెట్టమంటే అక్కడ పెట్టేవారా?**

అలా మాట వినకపోతే నాతో పని చేయడం కష్టం.







**ఆర్టిస్టులకి మీరు యాక్ట్ చేసి చూపిస్తారా?**

చూపించాలి కదండీ. లేకపోతే వాళ్లకు ఎక్స్‌ప్రెషన్సూ అవీ ఎలా తెలుస్తాయండీ. సినిమా మొత్తం మనకు తెలుస్తుంది. వాళ్లు ఎక్కడనుంచో ఇక్కడకు వస్తారు. మనం చెప్పకపోతే వాళ్లకు ఎలా తెలుస్తుంది?

**మీ సినిమాల్లో సీతమ్మ పెళ్లి ప్రత్యేకంగా అనిపిస్తుంది...**

చాలా మంచి కథ అది. మహేంద్రన్‌గారని తమిళంలో నాకిష్టమైన దర్శకుడు చేసిన నిండు కొయిరాన్‌ని తెలుగులో నేను చేశాను. తమిళంలో రజనీకాంత్ చేసిన పాత్రని తెలుగులో మోహన్‌బాబుతో చేయించాం.

**అందరూ మీ బొమ్మలు వాడుతుంటారు. మీరేమో సీతాకల్యాణంలో ఓ పాటలో మీ బొమ్మలు కాకుండా వేరే చిత్రకారుని బొమ్మలు వాడినట్టున్నారు?**

పిలకా నరసింహమూర్తిగారని మా గురువుగారు. ఆయనతో దశావతారాలు బొమ్మలు వేయించాను.

**మీ సినిమాల్లో ఎక్కడో ఒకచోట పుస్తకాలు కనిపిస్తూ ఉంటాయి ఎందుకని?**

ఈసెన్‌బర్గ్ గారని నాకు గాడ్‌ఫాదర్ ఉండేవారు. ఫోర్డ్ ఫౌండేషన్ వాళ్లు పెట్టిన సదరన్ లాంగ్వేజ్ బుక్ ట్రస్ట్‌కి ఆయన హెడ్. ఆయన చెప్పేవారు... సినిమాలో ఎక్కడో ఒకచోట పుస్తకం చూపించమని. వంటగదిలో సీన్ అయినా సరే. ఇల్లాలు పిల్లాడికి పాలు పట్టిస్తున్నా ఓ చేత్తో పుస్తకం ఉన్నట్టు చూపించ మనేవారు. అందరూ పుస్తకాలు చదవాలనేది ఆయన అభిలాష.

**సాక్షి సినిమాని ఇప్పుడు కూడా రీమేక్ చేయొచ్చునా?**

చాలామంచి స్క్రీన్‌ప్లే అది. స్క్రీన్‌ప్లే వైజ్ గొప్పదే కానీ, పర్సనల్‌గా నా వర్క్ నాకు అంత గొప్పగా అనిపించదు.

**తమిళంలో ఏమైనా చేశారా?**

ఒకే ఒక్క సినిమా చేశాను. ఇన్సాఫ్ కే తరాజూని తెలుగులోనూ, తమిళంలోనూ చేశాం.

**మీ సినిమాలకు నెగెటివ్ ఎక్స్‌పోజర్ కూడా చాలా తక్కువనుకుంటాను?**

అవునండీ. సినిమా నిడివికి మూడు రెట్లు ఎక్స్‌పోజర్ ఉండేది. ఎందుకంటే రమణగారు స్క్రిప్ట్ రాసి ఇస్తే, నేను స్టోరీబోర్డ్ వేసేసేవాణ్ణి. అక్కడే చాలా మట్టుకు ఎడిటింగ్ అయిపోతుంది. ఓ హిందీ సినిమాని ఒకే సెట్‌లో రెండు చోట్ల ఊటీలోనూ, ముంబైలో తీసేశాం. కాల్షీట్లు ఇబ్బంది వల్ల. అదంతా స్టోరీబోర్డ్ వల్ల సాధ్యపడింది.

**రమణగారికి ఏయన్నార్ క్లోజ్, మీకు ఎన్టీఆర్‌తో సాన్నిహిత్యం ఉండేదా?**

అదేంలేదండి. నాకెవ్వరితోనూ ఎక్కువ సాన్నిహిత్యం ఉండేదికాదు. ఎన్టీఆర్‌తో రెండు సినిమాలు చేశాను. పిల్లల కోసం ప్రభుత్వం తరపున ఓ ప్రాజెక్ట్ చేయిస్తే చేశాను. అదంతా రమణగారి చలవవల్లే.



**అన్నీ తెలిసి కూడా మౌనంగా ఉండటం చాలా కష్టం. మీది మొదట్నుంచి అదే పద్ధతి. కానీ ఏమీ లేకపోయినా డాంబికాలు పలికేవారిని చూస్తే ఏమనిపిస్తుంది?**

ఇంకొకళ్ల గురించి జడ్జ్ చేయడం కష్టం. తప్పు కదా...?

**ఈ గోడ మీద మీ బొమ్మలు కాకుండా పెద్ద పెద్ద పెయింటింగ్స్ ఏంటండీ?**

ఇవన్నీ ఓల్డ్‌మాస్టర్స్ పెయింటింగ్స్. సీతాకల్యాణం టైమ్‌లో లండన్ వెళ్లినపుడు గూటాల కృష్ణమూర్తిగారితో వెళ్లి ఈ పెయింటింగ్స్ కొన్నా. నా ఇంకో ఫ్రెండ్ శ్రీరమణగారు ఇవన్నీ లామినేట్ చేసి పెట్టారు. 1978నాటి బొమ్మలివి.

**చిత్రకళలో వచ్చే మార్పుల్ని గమనించడం కోసం ఇంటర్‌నెట్‌ని ఫాలో అవుతుంటారా?**

నాకస్సలు కంప్యూటర్ ఆపరేట్ చేయడం తెలీదు. ఎప్పటికప్పుడు పుస్తకాలు రిఫర్ చేస్తుంటాను. అప్పట్లో సెంట్రల్ స్టేషన్ దగ్గర్లో మూర్‌మార్కెట్ ఉండేది. అక్కడ చిత్రకళకు, సంబంధించి ఫారిన్ బుక్స్ దొరికేవి. ఆల్‌మోస్ట్ ఆల్ అదే నాకు స్కూలులాంటిది. ప్రతివారం ఆ మార్కెట్‌కి వెళ్తుండేవాణ్ణి. లేకపోతే లైబ్రరీకి వెళ్లి బుక్స్ రిఫర్ చేస్తుండేవాణ్ణి. నా చిన్నప్పుడు బాల అనే చిల్డ్రన్ మేగజైన్ ఉండేది. రేడియో అన్నయ్య న్యాపతి రాఘవరావుగారిది. అందులో బొమ్మలేసేవాణ్ణి. ఆయనే ఎంకరేజ్ చేసేవారు. పుస్తకాల షాపుకి తీసుకెళ్లి, 'నీకు కావాల్సినవి కొనుక్కోవయ్యా,' అనేవారు. షీట్స్, రంగులు అన్నీనూ.

**ఇంటర్నేషనల్ లెవెల్‌లో మీ పెయింటింగ్ ఎగ్జిబిషన్స్ ఏమైనా పెట్టారా?**

చాలా పెట్టారండీ. అమెరికా, లండన్. సీతాకల్యాణం టైమ్‌లో నేను కూడా లండన్ వెళ్లాను.

**మంచి ఆర్టిస్ట్ కావాలంటే ఏం చేయాలండీ?**

లోపల ఉండాలండీ. నేచురల్‌గా ఇంట్రస్ట్ ఉంటే ప్రాక్టీస్... ప్రాక్టీస్... ప్రాక్టీస్... చేస్తూనే ఉండాలి. అబ్దుల్ కరీంఖాన్ అని గొప్ప క్లాసికల్ సింగర్ ఉండేవారు. చేతిలో పొన్ను కర్ర. దానికి వెండి పిడి. ఒకాయన ఎవరో మూడు నెలలు సెలవు పెట్టి వస్తాను... సంగీతం నేర్పించమన్నాడట. దానికాయన తన పొన్ను కర్రని చూపించి దీన్ని ఫ్యాక్టరీలో మెషిన్ మీద అయిదు నిమిషాల్లో తయారు చేస్తారు. కానీ నా అరచేయి కింద 30 ఏళ్లుగా ఉంది. అందుకే ఇంత నునుపు తేలింది. సంగీతం మూడు నెలల్లో నేర్చుకుంటే రాదు అన్నారట. అందుకే నిరంతరం అదే పనిలో ఉండాలి.

**వర్తమానంలో చిత్రకళ మీద మీ అభిప్రాయం?**

అద్భుతంగా ఉంది. ఎప్పటికప్పుడు మారుతూ వస్తోంది. పాతవే మంచివి అనుకోవడం పొరపాటు.

**ప్రస్తుతం మీకు నచ్చిన చిత్రకారుడెవరు?**

(నవ్వుతూ) నాకు జుట్టు లేదు కానీ, ఇంతమంది చిత్రకారులున్నారు. నిజంగా వేలల్లో ఉన్నారు.

**మనవళ్లూ మనవరాళ్లలో ఎవ్వరికైనా మీ ఆర్ట్ అబ్బిందా?**

నా రెండో అబ్బాయి కూతురు బొమ్మలు వేస్తుంది. దానికి 8 ఏళ్లు. మా అమ్మాయి కూడా బొమ్మలు వేస్తుంది. తను ఏదో గ్రాఫిక్స్ కంపెనీలో పని చేస్తోంది.

**బొమ్మలు వేయడం నేర్పమని పిల్లలు అడగరా?**

(నవ్వేస్తూ) నాకు వస్తే కదా... వాళ్లకు నేర్పేది. నేను నిరంతర విద్యార్థిని. నేర్చుకుంటూనే ఉంటాను.

**ఇప్పుడు మీకు కాలక్షేపం ఏంటి?**

ఓపిక ఉంటే బొమ్మలు వేయడం. లేకపోతే పుస్తకాలు చదవడం. మొదట్నుంచీ పుస్తకాలు ఎక్కువ చదివేవాణ్ణి.

**రమణగారి స్క్రిప్టు లేకుండా రెండు సినిమాలు చేసినట్టున్నారు?**

లేదండీ. శ్రీ రామాంజనేయ యుద్ధం నాటకం ఆధారంగా తీసిన సినిమా కదా. పద్యాలు ఉంటాయని గబ్బిట వెంకట్రావ్‌గారితో స్క్రిప్ట్ చేయించాం. రమణ గారి ఇది లేనిదే నేను ఏ సినిమా తీయలేదు. రామాంజనేయయుద్ధంకు రమణగారి కంట్రిబ్యూషన్ ఇన్‌డైరెక్ట్‌గా ఉంది.

**రమణగారు రాసిపెట్టుకున్న సినిమా స్క్రిప్టులు ఇంకేమైనా ఉన్నాయాండీ?**



లేవండీ. కొన్ని కొన్ని స్టోరీ ఐడియాలుండేవి. చేద్దామని ఫుల్‌ఫ్లెడ్జ్‌డ్‌గా ఏ స్క్రిప్టూ పెట్టుకోలేదు. ఐడియా నచ్చితే అప్పటికప్పుడు స్క్రిప్టు తయారు చేసుకునే వాళ్లం.

**డబ్బు ఎంత గొప్ప స్నేహితులనైనా విడదీస్తుందంటారు. మీరిద్దరూ తీసిన సినిమా ఫ్లాప్ అయితే ఏం ఇబ్బంది ఎదురుకాలేదా?**

అంతా రమణగారే చూసుకునేవారు. ఈ ఇల్లు ఆయన కట్టించిందే. ఎన్టీఆర్ గారి స్కూలు పాఠాల ప్రాజెక్ట్ తర్వాత ఇది, పక్కన మా అమ్మాయి ఇల్లు, వెనుక రమణగారిల్లు కట్టుకున్నాం. రమణగారు ఇల్లు అమ్మేశాక, ఈ ఇంట్లోనే పైన ఉండేవారు. వెనుక ఇంట్లో ఏడాదో, రెండేళ్లో ఉన్నారంతే. 'ఎప్పుడూ కలిసుండేవాళ్లం ఇలా వెనక్కు వెళ్లాను. అందుకే అమ్మేశాను,' అని జోక్ చేసే వారు రమణ. చిన్నప్పట్నుంచీ తను మా ఇంట్లోనే ఉండేవాడు. మా అమ్మగారు తనను పెద్దబ్బాయ్ అని పిలిచేది.

**రమణగారు ఉండి ఉంటే... ఇంకో సినిమా చేసేవారా?**

చేసేవాణ్ణి.

**శ్రీరామరాజ్యం తర్వాత ఏమైనా అనుకున్నారా?**

శ్రీరామరాజ్యం జరుగుతుంటేనే పోయారాయన. స్క్రిప్ట్ ముందే రాసేస్తారు కనుక ఇబ్బంది అనిపించలేదు.

**రమణగారితో మీ లాస్ట్ వర్డ్?**

రాత్రి రెండింటికి వాళ్లావిడ పిలిచింది, నన్ను పైకి రమ్మంటున్నారని. జస్ట్ టూ మినిట్స్. అనాయాస మరణం. ఊపిరి అందలేదు.

**రమణగారు లేని లైఫ్ ఎలా ఉందండీ?**

చాలా కష్టంగా ఉందండీ (అంటుండగానే ఆయన కళ్లల్లో నీళ్లు తిరిగాయి). అప్పటి నుంచీ నాకు ఓపిక పోయింది.

సాక్షి దినపత్రిక సౌజన్యంతో





*Publication of this painting is sponsored by* **Smt. Ashajyothi and Dr. Lokeswara Rao Edara,** *Battle Creek, MI*




# మబ్బూ వానా- మల్లెవాసనా-



లక్ష్మీనారాయణ—

*తన బొమ్మలతో గొప్ప తెలుగుకథల్ని గొప్పన్నరగా చేసిన బాపుకు కథలంటే చాలా ఇష్టం. రమణగారితో కథలు రాయించటమే కాదు, తానూ కొన్ని కథలు వ్రాశారు. ప్రస్తుతం రెండు కథలు దొరుకుతున్నాయి. ఈ కథ ఆంధ్ర సచిత్రవారపత్రిక ఆగస్టు 28, 1957 సంచికలో ప్రచురించబడింది. ఈ కథ పేరుకు మూలం కాళిదాసు మేఘదూతంలో, 'ఆషాఢస్య ప్రథమ దివసే మేఘమా శ్లిష్టసానుం...' అనే శ్లోకంలో ఉందట.*

- సంపాదకుడు



తెర మీద మధుబాల సిగపూల సొగసు చూడగానే మాధవరావులో ఒక మధురానుభూతి కలిగి, యతి ప్రాసయుతమైన వాక్యంలా రమణీయరూపం ధరించి, తీరనికోరిక అంత పెద్ద కెరటంలా లేచి, అందంగా విరిగిపడి మనసును కలవరపరిచింది. సీత, వెన్నెల, మల్లెపూలు, అందమైన ఊహలు, మబ్బూ, వానా ఇలాటివన్నీ అతనికి గబగబా జ్ఞాపకం వచ్చేశాయి. ఇంటికి బయలుదేరాడు.

★ ★ ★

మాధవరావుకి మల్లెపూలంటే ఇష్టం.

"సీతా! నువ్వు జడలో మల్లెపూలు ముడుచుకుంటే ఎంత బావుంటావనుకున్నావ్! పిల్ల తెమ్మెరలు ఆ మల్లెల చల్లటి పరిమళాన్ని మెల్లిగా, నా నాసా పుటాలకు విందుగా అందజేస్తుంటే ఎంత బాగుంటుందో- ఈ లోకమే మరచిపోతా! అదొక మధురానుభూతి," అని మాత్రం ఎప్పుడూ అనలేదు. అతనికి అలాటి మాటలాట్టే సయించకపోవడం ఒక కారణం.

రెండోది- తన అర్ధాంగి సవరం వాడుతుంది. అందుకని, 'నీ సవరంలోని పువ్వులు,' అని వాక్యం సవరించాలి. దాంతో పొయెట్రీ కాస్తా పోనేపోయె.

'టంటింటం టింటంటం,' అన్నాడు మాధవరావు; హీరో దగ్గర నుంచి వచ్చిన ఉత్తరాన్ని గుండెలకి హత్తుకుంటూ 'అట్టతోట'లో హిందీ హీరోయిన్ పాడిన పాటను యధాశక్తి అనుకరిస్తూ.

ఇంకో నిమిషం తరువాత తలుపు తాళం తీసి, లోపల బల్లమీద పడేస్తూ, 'టింటర టింటం టర టరటం,' అని కూడా అన్నాడు. ప్రస్తుతం సీత ఇంట్లో లేదు కాబట్టి ఇంకో నాలుగు టరటాలు కలిపి పాడినా ఫరవాలేదు.

ఆఫీసు నుంచి తిన్నగా సినిమాకెళ్లి హోటలువాడు, 'ఇది అన్నమే,' అని హామీ ఇచ్చిన పదార్థాలను వాడు నొచ్చుకుపోతాడేమో అని తను కూడా అది అన్నమే అని నమ్మేసి, తిని ఇంటికి వచ్చాడు.

సీత ఉదయం బయలుదేరి పక్క ఊళ్లో చుట్టాలింటికి పెళ్లికి వెళ్లింది. రేపో ఎల్లుండో వస్తుంది. రాత్రి పదిన్నరవుతోంది.

'వెదర్ యమగా ఉంది,' అనుకున్నాడు. అందువల్ల తెగించి గోల్డుఫ్లేక్ పెట్టి కొనేశాడు మాధవరావు. రూపాయినోటు తీసుకుని మళ్లీ లెక్కలెక్కమని అణా చిల్లరివ్వటమేమిటని, అడక్కుండానే కొట్టువాడు డీలక్సు అగ్గిపెట్టె చేతుల్లో పెట్టాడు. పిల్లలు కలవాడు- పోనీలే అని మాధవరావు అడ్డు చెప్పలేదు.

సిగరెట్టు వెలిగించి, లైటార్పి, పక్కమీద పడ్డాడు- బయట గాలి జోరుగా వీస్తోంది. కొద్ది నిముషాలకి చినుకులు ప్రారంభించాయి. పొడి నేల మీద తొలి చినుకులు పడగానే వచ్చిన వాసనకి మాధవరావు ముగ్ధుడయిపోయాడు. 'హో! మల్లెపూల వాసనకంటే బావుందే,' అనుకున్నాడు.

వారంరోజుల క్రితం సంగతి గుర్తొచ్చింది.

★ ★ ★

తెల్లారి అయిదింటికి వాన మొదలెట్టింది. వానంటే కూడా మాధవరావుకి ఎంతో ఇష్టం. పెళ్లవని రోజుల్లో, వానొచ్చినపుడల్లా, పక్కన తనకిష్టమయిన చక్కటి అమ్మాయి చెక్కిలికి చెక్కిలి ఆనించి మరీ వానని చూడాలనుండేది.

పెళ్లయిన తరువాత ఒకరోజు వాన రాగానే ఆ సంగతి గుర్తు కొచ్చింది. ఇపుడు సీతని లేపి, చెంపకి చెంప ఆనించి వానని చూద్దామని అడుగుతే, నిద్రమత్తులో ఆ అమ్మాయి కంగారుపడచ్చు. అయినా లేపాడు.

"ఊఁ" అంది సీత కళ్లు తెరవకుండానే.

"వాన," అన్నాడు తను.

"కిటికీ తలుపులు మూసేయండి. జల్లు కొడుతుంది," అంది సీత.

మాధవరావుకి చిరాకేసింది.

"అబ్బే అదికాదు, కిటికీ దగ్గర కూచుని వాన చూద్దాం రా. లే," అన్నాడు కోపంగా.

సీత ఆవులించింది. "బావుల్లడ్డీ- హాయ్- అదే బావుల్దీ. అర్ధరాత్రి



వేళ అంకమ్మ శివాలన్నట్టు, చాల్జాలు. పడుకోల్డీ," అంది, అటువేపు తిరిగి.

"టెక్నికల్ అబ్జక్షను. అర్ధరాత్రి కాదు, ఇపుడు అయిదయింది. తెల్లారి," అన్నాడు ఇంకా కోపంగా.

సీతకి ఇవేమీ వినిపించినట్టు లేదు.

మండిపోయాడు మాధవరావు.

దడదడా లేచి కోపంగా పళ్లు తోమేసి (తనవి), ముఖం కడిగేసుకుని, అంతకన్న కసిగా పదహారు అగ్గిపుల్లల సాయంతో కుంపటి అంటించి పారేశాడు. మళ్లీ తెచ్చి వంటింట్లో పెట్టి వసారాలోకొచ్చేప్పటికి గూట్లో పాలగిన్నె ఖాళీగా కనిపించింది. ఇంకా పాలవాడు రాలేదు- వానవడం మూలాన్ని. వాడూ బహుశా వాడి తాలూకు అర్ధాంగి చెంపకి చెంపానించి వానని చూస్తున్నాడేమో! వాడి బొంద- వాడికి రొమాన్సేమిటి. కల్చరుండదు- బహుశా. బియ్యే గియ్యే చదివాడా ఏడిశాడా... మాధవరావు నిశ్శబ్దంగా చిన్న కథాకళీ నృత్యం చేసి పడక్కుర్చీలో కూచుని నిద్దరోయాడు.

★ ★ ★

ఇపుడా సంగతి ఆలోచించుకుంటుంటే ఆరోజు ఎప్రోచ్ బాగులేదని పించింది.

'అసలలా కాదు, మృదువుగా మాట్లాడి ఉండాల్సింది,' అనుకున్నాడు.

బయట వానజోరు కొంచెం తగ్గింది. కిటికీలోంచి వచ్చే గాలికి దుప్పటి మడతపడింది. సిగరెట్టు బయటికి విసరి, దుప్పటి సరిచేసి తలగడా మీద తల ఆన్చాడు.

మల్లెపూల వాసన గుప్పుమంది.

నిన్న రాత్రి, సీత పక్కింటివారి అమ్మాయి తెచ్చిపెట్టినవీ, తను అంతకుముందే కొన్నవీ కలిపి జడలో రోజా కంటే మరిన్ని పూలు తురుముకుంది. వాటి తాలూకు పరిమళం తలగడా అంతటా అలముకొని, జవరాలిని కంచుకంలా గాఢాశ్లేషం చేసుకుందనిపించింది. మర్నాటికి ఆ పరిమళం అలాగే ఉండటం గమనించిన మాధవరావులో తక్షణం మనోహరమైన ప్రణయభావాలు, మధురస్మృతులు మెదిలాయి.

అమాంతం సీత అంటే ప్రేమ పెల్లుబికింది.

★ ★ ★

తను మొదటిమాటుగా పెద్ద పండుక్కి అత్తారింటికి వెళ్లినపుడు, గుమ్మం దగ్గర మల్లెపూలు బేరం చేస్తున్న సీత అపుడే రిక్షా దిగిన తన్ను చూడగానే బోలెడు సిగ్గుపడిపోయి గబుక్కున లేచి, గడప తగిలి బోర్లా పడినంత పనిచేసి, వసారా తుడుస్తున్న పనిమనిషిని ఢీకొట్టి, పడిపోకుండా నిలదొక్కుకుని లోపలికి పరిగెత్తికెళ్లిపోయిన సందర్భం తలచుకొని తక్షణం తనూ బోలెడు సిగ్గుపడిపోయాడు. ఆ మైకంలోనే రిక్షావాడు, 'పావలా ఇప్పించండి బాబూ,' అని అడుగుతూంటే, ఇంతకంటె చచ్చినా దమ్మిడీ ఇవ్వనని వాడి చేతుల్లో పరాగ్గా అర్ధరూపాయి కాసు పెట్టేశాడు తను.

రాత్రి డాబాలో వెన్నెల కింద పక్క వేశారు. భోజనాలయిన తరువాత మామగారు తనకొచ్చిన జలుబు గురించి చెబుతూ, అణ్వస్త్ర పరీక్షలూ, వాటి దుష్ఫలితాలూ వివరించి, అమెరికానూ, బ్రిటన్‌నూ తలవాచేట్టు తిట్టారు. అసలు ఇలాటి ఏటంబాంబులు మన పూర్వులు

ఎప్పుడో కనిపెట్టి పారేశారని చెప్పి ఆయన బోల్డు గర్వపడిపోయాడు. మళ్ళీ లేచి, కాశ్మీరం మీదికి దండయాత్ర ఆరంభించేటప్పటికీ, మాధవరావు వెకిలినవ్వు నవ్వేసి, చప్పట్లు కొట్టినంత గట్టిగా చిటికెలు వేస్తూ ఆవలింతలు అభినయించేసరికి విముక్తి లభించింది.

భోజనం అయి పదిహేను నిముషాలయింది. అంతవరకూ సిగరెట్టే కాల్చలే! డాబా మీదకు వెళ్తూనే వరసగా రెండు కాల్చేసి అయిన కాలనష్టం భర్తీ చేశాడు.

తెల్లటి వెన్నెల క్రింద, తెల్లటి పక్కమీద పాలకెరటంలాటి మెత్తటి తెల్లటి దుప్పటీ- దుప్పటి మీద ఆ కెరటపు నురగలా తెల్లటి మల్లెపూలు. 'ఓహ్! ఏమి టేస్టురా,' అనుకుని గుండెలు బాదుకున్నాడు. 'యమ టేస్టు,' అని తనే జవాబు చెప్పుకున్నాడు.

సరే- తరువాత మెట్ల మీద గాజుల గలల, దరిమిలా కనబడిన సీత మొహం కలకల, ఆ మొహం తాలూకు కాటుకకళ్ల మిలమిలా, ఆపైన శబ్దాలంకారం కోసం ఆమె చేతి మరచెంబు తళతళా మొదలైన ఏర్పాట్లు చూసి మాధవరావు మురిసిపోయాడు.

★ ★ ★

వర్షజలంతో శుభ్రంగా కడిగివేసిన నక్షత్రాలను, పల్చటి మబ్బుతెరల లోంచి చూస్తూ ఉంటే, ఆ తారలు మరింత మనోహరంగా తియ్యటి తొయ్యలి గురించిన మధురభావాలలా కనిపించి అనిపించాయి.

లోగడ తాను చూసిన హిందీ సినిమా తాలూకు హీరోలాగ, తను వదిలిన సిగరెట్టు పొగలోకి ఫోటోజెనిక్‌గా చూస్తూ, 'ఇవే కాబోలు- మధురస్మృతులంటారు హారినీ!' అనుకున్నాడు మాధవరావు.

'అంటే అన్నారుగాని ఇవన్నిటిని లేక వీటన్నిటినీ సీతకు గుర్తు చెయ్యాలి. చేసి ఆమె ముఖం మీద కనబడే సిగ్గుదొంతర్లు చూడాలి. ఆమె పెదాల మీద పూచే అలతినవ్వుల పువ్వులను ఆఘ్రాణించి అలాటి చిరునవ్వు నవ్వినందుకు ఆ పెదాలను యధాశక్తి సత్కరించాలి, ఆఁ!' అనుకున్నాడు మాధవరావు. "రానీ చెప్తా," అని గట్టిగా అన్నాడు. వచ్చేదాకా నిదరపోవచ్చుననుకుని మెల్లిగా నిద్రకు ఉపక్రమించాడు.

మర్నాడు సాయంకాలం ఆఫీసు నుంచి ఇంటికి వచ్చేప్పటికి సీత వచ్చేసింది.

మొహం కడుక్కుని కాఫీ తాగుతూ తను చెప్పదలచుకున్నది చెబుదామనుకున్నాడుగానీ, ఆ అమ్మాయి చాకలాడికి బట్టలేస్తోన్నదని చూసి, ఇది మంచి సమయం కాదు అనుకుని విరమించుకున్నాడు. భోజనాదికాలు పూర్తిచేసిన తరువాత వెన్నెలలో అయితే బేషుగ్గా ఉంటుందని నిర్ణయించుకున్నాడు.

సీత, వంటిల్లు కడిగి ముగ్గెట్టి, తాళం వేసి వచ్చి, పక్కన కూచుని తమలపాకు చిలకలు చుట్టి నోట్లో వేసుకుంటోంది.

మాధవరావు, 'రైటో,' అని పుంజుకున్నాడు. వెంటనే సరళపద ప్రవాహం ఊహూ సెలయేరులాగ వెలువడకపోయినా, ఉపోద్ఘాతంగా గొంతు సవరించుకుని సకలించాడు. 'ఏమిటి- ఆఁ!' అన్నాడు.

నోరు తమలపాకులు నమలడంలో పూర్తిగా నిమగ్నమయి ఉన్నందున కళ్లతోనే, 'ఏమిటి,' అంది సీత. అని జవాబుకి ఎదురు చూడకుండా తమలపాకుల పళ్లెం, వక్కపొడి భరిణా బీరువాలో పెట్టడానికి అటేపెళ్లింది.

కాసేపు తెల్లబోయి తమాయించుకుని, "సీతా- ఇలారా," అన్నాడు మాధవరావు.



దగ్గరకొచ్చింది సీత.

సీతని దగ్గరగా చూడగానే తను చెప్పదలచుకున్నది అప్పటికి వాయిదా వేసి, "పెళ్లి బాగా జరిగిందా," అన్నాడు.

"ఆ! పెళ్లికేం, దివ్యంగా జరిగింది. మీరు రాలేదని చాలా ఇదయ్యారు కూడాను,' అంది సీత- మళ్లీ వెళ్లి బీరువా తలుపు మూస్తూ.

మాధవరావుకి చిరాకేసింది. సీత మీద కోపం వచ్చింది- ఆమాత్రం అర్థం చేసుకోదేమని.

కుదుటపడి, ఫ్లాష్‌బాక్‌తో ఆరంభించడం మంచిదని, "నేను పెద్ద పండక్కి మీ ఇంటికొచ్చినపుడు గుర్తుందా?" అన్నాడు.

"లేకేం. అన్నట్టు అపుడు మా అమ్మ నాకు పెట్టిన చీర గుర్తుందా? ఎర్రంచు బార్డరు నల్లచుక్కలు ఉంటాయి. అలాటిదే మగ పెళ్లివారూ పెట్టారండి నిన్న పెళ్లిలో. పదిహేను రూపాయలు తక్కువ లోనే కొన్నారుటండీ. అపుడు మా అన్నయ్యకి చెప్పా కూడాను- వెళ్లి మళ్లీ సరిగ్గా ధర కనుక్కురారా అని. బడుద్ధాయి వినలేదు. బావుండదే- తీసేసుకున్నాం కదా అని సణిగాడు. కానీ భలే ఉందండీ..."

"మంచినీళ్లు! మంచినీళ్లు!!" అన్నాడు మాధవరావు.

తెచ్చిచ్చి వెళ్లి పక్కమీద వాలింది సీత, "నిన్న రాత్రంతా నిద్దరేలేదూ," అంటూ.

మాధవరావు పిడికిళ్లు బిగించాడు. పళ్లు నిశ్శబ్దంగా కొరికాడు. ఆఖరి ప్రయత్నం చేశాడు- గొంతుకని సాధ్యమైనంత మెత్తగా వినబడేట్టు చేయ ప్రయత్నిస్తూ.

"సీతా! నిన్న రాత్రి తలగడాల మీద తల ఆన్చగానే వాసన..."

"అబ్బే మాసిపోయాయండీ- ఇవాళే చాకలాడికి వేసేశా- కొత్తవి తొడిగా లెల్ది- హాయ్- పడుకోండి బాబూ నిదరొస్తోల్ది," అంది సీత ఆవులిస్తూ.

"లైటార్పేయండి బాబూ కాస్త," అని కూడా అంది.

"ఎర్రంచు బార్డరు- హు! కర్మ," అని సణుక్కుంటూ స్విచ్చి దగ్గరకెళ్లాడు మాధవరావు.

*ఆంధ్ర- వారపత్రిక, 28-8-1957*

స్వాధీనపతిక- శీలాజనార్థనం చిత్రమాలిక నుండి... ప్రచారంలో ఉన్న ఈ చిత్రం ఇతర వర్ణనలతో పోలిస్తే రంగులువాడకంలో తేడా గమనించవచ్చు.



*Publication of this painting is sponsored by* **Drs. Ratna Kumari and Hema Prasad Yadla,** Potomac, MD

శ్రీ బ్నిం సౌజన్యంతో

# మా సినిమాలు

బాపు

**సం**తకం అక్కర్లేని చిత్రకారుడు, టైటిల్ కార్డ్ అక్కర్లేని చలనచిత్ర దర్శకుడు, కదిలే బొమ్మలతో ఎనలేని భావాలను అలవోకగా ప్రకటించినా, తన సినిమాల గురించి అరుదుగా మాట్లాడే 'మితభాషి.' మొదటిసారిగా తన చిత్రాల సిత్రాలను అమెరికాలోని తెలుగు పాఠకులకు ప్రత్యేకంగా వ్రాశారు. ఈ వ్యాసం రెండు భాగాలుగా తెలుగునాడి 2007 మే, జూన్ సంచికలలో అచ్చయింది. ఆ వ్యాసంలో ఆయన తన అన్ని సినిమాల గురించి రాసినా స్థలాభావం వల్ల కొన్ని సినిమాల గురించి తానా పత్రిక పాఠకుల కోసం...



నా గురించి నేను చెప్పుకోగూడదుగానీ- ఆంధ్ర ప్రేక్షక మహాశయుల హృదయాల్లో నాకొక ప్రత్యేక స్థానం ఉందని గర్వంగా చెప్పుకొంటున్నాను. ఆంధ్ర ప్రేక్షక మహాశయులందరూ కాదనుకోండి- ఒక ఉత్తమ యిల్లాలు. ఆవిడ భర్తతో తప్ప సినిమాకి వెళ్ళదు. నా సినిమా రాగానే భర్తతో, 'ఏవండీ బాపుగారి సినిమా రిలీజయింది. ఇవాళ మొదటాట కెడదామండీ,' అనేది. ఆయన, 'ఇవాళ శుక్రవారం కదే. రేపాదివారం వెడదాం,' అనేవారు. ఆవిడ, 'అంత వరకూ ఉండదండీ,' అని కంటనీరు తుడుచుకొనేది.

## తొలి సినిమా

## సాక్షి

**మం**చి కథ, అంతకు మించిన స్క్రిప్టు ఉంటే, ఆ ఉత్సాహం ఉన్న ఎవరైనా డైరెక్టరయిపోవచ్చు అనడానికి నేను ప్రత్యక్షసాక్షిని. 1967లో సాక్షి తీసేముందు అనేక సినిమాలు చూసి ఉండడం తప్ప ఎవరి వద్ద దర్శకత్వ శిష్యరికం నోచుకోలేదు. సాక్షి మొత్తం, మా మిత్రులు శ్రీ కనుమూరి వెంకట్రామరాజుగారి పులిదిండి గ్రామంలో తీశాం. షూటింగు వారంరోజులుందనగా మామిడి తోటలో కూచోబెట్టి క్లోజ్‌షాటూ, సజెషన్ షాటూ లాటివి ఎలా తీయాలో చెప్పిన గురువు కబీరుదాసుగారు (శ్రీ ఆదుర్తి వద్ద అసిస్టెంటు).

రమణగారి స్క్రిప్టు ప్రతి సీనూ విజువలైజ్ చేసుకొని, లొకేషన్ & యాక్షన్‌తో సహా వుంటుంది. స్టార్టు, కట్టు చెప్పడమే ప్రతిభ. సాక్షి సినిమా కథ డైలాగుల వల్ల నిలిచింది గానీ, పాత్రల నటనలో నాటకీయత, ఓవరాక్షన్ లేకుండా చూడవలసిన దర్శకుని బాధ్యత బొత్తిగా కనిపించదు. నా గాడ్‌ఫాదర్ అయిన ఒక దొరగారు, "If our people see it, they will laugh at the wrong places" అన్నారు. కానీ మొత్తం సినిమా ఔట్‌డోర్‌లో నాచురల్ సరౌండింగ్స్‌లో తీశామన్న తృప్తి. మా ఫ్రెండు బి.వి.యస్. రామారావు పులిదిండిలోనే ఒక



సాక్షి చిత్రంలో పాత్రలు, దుస్తులు కొరకు వేసుకొన్న బొమ్మలు






గుడిసె సెట్ వేశాడు. (అప్పుడు మాకు ఆర్టు డైరెక్టరూ, డాన్సు డైరెక్టరూ అంటూ లేరు. నటులు కూడా మా ఆఫీసుకొచ్చి షూటింగుకి వెళ్ళేముందు రిహార్సల్స్ చేసేవారు.) ఆ సెట్ ఎంత బాగా వేశాడంటే ఊళ్ళో పాడుపడిపోయిన ఇంటివారికి కొత్తవి కొనిచ్చి ఆ పాత ద్వారబంధాలు తెచ్చి కట్టాడు.

పులిదిండి లాంటి కుగ్రామానికి ARC and BRUTE లాటి లైట్లు తెప్పించారు సెల్వరాజ్‌గారు. అవి మోసే లారీకి కాలవపక్క రోడ్డు పట్టకపోతే కొమ్మలు కొట్టి మరీ దారి వేశాం. మొదటిరోజు షూటింగు వేణుగోపాలస్వామి గుడిలో (ఇక్కడే కృష్ణగారు, విజయనిర్మలగారు పెళ్ళి చేసుకొన్నారు) అమ్మకడుపు చల్లగా... అత్త కడుపు చల్లగా... బతకరా బతకరా పచ్చగా... అన్న ఆరుద్రగారి పాటతో మొదలెట్టాం. మధ్యాహ్నం నాలుగింటికల్లా పాట అయిపోయింది. మొత్తం పంతొమ్మిది రోజుల్లో షూటింగు పూర్తయింది.

ఎన్ని రోజుల్లో తీస్తే అన్ని పూటలే ఆడుద్ది అని పెద్దలు దీవించడం వల్ల దాని డబ్బు దానికొచ్చేసింది.

విజయనిర్మల చెరువొడ్డున దిగులుగా కూచుని చెర్లో రాళ్ళేస్తున్న కృష్ణతో- రాయి బుడుంగుమని పడిన చుట్టూరా అలలు చూపించి, "సెర్లో రాయేస్తే సెరువంతా కదులుద్ది. మంచి మడిసిని కొడితే ఊరంతా తగులుద్ది," అంటుంది. గూండాని ఎదిరించడానికి సాయం చేయడానికి భయపడి ఊరంతా తలుపు లేసేసుకుంటే నిర్మల, "పక్కిల్లు అంటుకున్నపుడు మనిల్లు తలుపులు వేసేసుకుంటే మనం క్షేమంగా ఉంటామా," అని నిలదీస్తుంది.

పబ్లిసిటీ డిజైన్లు బాగా వచ్చాయి. సినిమా కాస్ట్ ఆఫ్ ప్రొడక్షన్ ఒక లక్షా ఎనభైవేలు.

మా శ్రేయోభిలాషి అక్కినేని నాగేశ్వరరావుగారు- 'మీ మొదటి పిక్చరు హిట్టవకపోవడం నాకు ఆనందంగా ఉంది. అయితే, మొదణ్ణించే కళ్ళు నెత్తికెక్కే ప్రమాదం ఉండేది,' అన్నారు.

## బుద్ధిమంతుడు

శ్రీ అక్కినేని నటించిన బుద్ధిమంతుడు (డబుల్ రోల్) చాలా గొప్ప కథ. పూజారికి దేవుడు కనిపించి, 'మానవా నీకెంత అహంకారమయ్యా, మానవాకారం మించిన అందం లేదనే కదా నాక్కూడా కళ్ళూ ముక్కూ పెట్టావు. అయినా అసలు నేనున్నానో లేదో- కేవలం నీ భ్రమేనేమో,' అంటాడు. పూజారి, 'మా తమ్ముడు అన్ని కులాల వాళ్ళతో కలిసి భోంచేస్తున్నాడయ్యా అప్రాచ్యుడు,' అని ఫిర్యాదు చేస్తే కృష్ణుడు, 'మరి గొల్లవాణ్ణి- నేను ఎంగిలి చేసిన ప్రసాదం తింటున్నావేం,' అంటాడు.

గుడి గోపురం పైన మహిమ జరగడం చూసి అన్న పూజారి దణ్ణం పెడుతూంటే నాస్తికుడు తమ్ముడు, 'దేవుడు లేడన్నయ్యా. అది నే చేసినదే,' అంటే అన్న, 'ఓరి అమాయకుడా! దేవుడెప్పుడూ మనిషిరూపంలోనే వచ్చి మనకి మంచి చేస్తాడు,' అంటాడు. ఈ సినిమా అక్కినేనిగారికి చాలా ఇష్టం. ఇదీ గోదారి దగ్గర పులిదిండి, ర్యాలి గ్రామాల్లో తీశాం.

రమణగారి స్క్రిప్టులో ఒక శాంపిల్, విలన్ శేషాద్రి (నాగభూషణం) చేసిన అన్యాయానికి కోపించి ఎక్కడో ఉన్న అక్కినేని 'శేషాద్రీ,' అని గర్జిస్తాడు. కట్- ఇంట్లో ఉన్న శేషాద్రి ఉలిక్కిపడతాడు. కట్- ఎదురుగా లో యాంగిల్‌లో అక్కినేని పులిలా నుంచుని ఉంటాడు.

ఇంకో సీన్. ఉత్తుత్తి స్కూల్లో- మేష్టార్లకి జీతాలు ఇచ్చినట్టు రశీదుల మీద





పాలేర్ల చేత సంతకాల బదులు వేలిముద్రలు వేయిస్తాడు అమ్యామ్యా అల్లు రామలింగయ్య.

సినిమాకి ఆరున్నర లక్షలయింది.

రమణగారు సూర్యకాంతమ్మగారి ఇంటికెళ్ళి పారితోషికం ఇవ్వబోతే ఆవిడ, "ఇపుడిప్పుడే మీరు రంగంలోకి అడుగుపెట్టారు. నిలదొక్కుకుని వృద్ధిలోకి రండి. అపుడు తీసుకొంటా నా ఫీజు," అన్నారు. మద్రాసులో షూటింగు జరిగినపుడల్లా తమ ఇంటి నుంచి కారియరు తెప్పించుకొనేవారు. అది మూడడుగుల ఎత్తుండేది. అందులో పులిహెూర, చక్కెరపొంగలి, ఆవడలు, గుత్తొంకాయ కూర మొదలైన భక్షణాలు- మాకు రోజూ విందే! షూటింగు ఆఖరిరోజు మొత్తం ప్రొడక్షను సిబ్బందికి రిస్టువాచీ మొదలు బేటరీ లైటు వరకూ ప్రతివారికీ ఏదో ఒక గిఫ్ట్ ఇచ్చేవారు.

## ముత్యాలముగ్గు







1975లో ముత్యాలముగ్గు వేశాం. రద్దీగా ఉండే వీధుల్లోనూ అక్కడా షూటింగ్ చేస్తే జనమంతా ఆగి కెమెరాని చూస్తూ ఉంటారు. లైట్లు లేకుండా, కెమెరా కనబడకుండా మేకప్పులు లేని నటుల్ని ముందే రిహార్సు చేయించి జనంలోకి వదిలేస్తే తీసే సాహసికుడైన కెమెరామన్ కావాలి. కొన్ని కోకాకోలా యాడ్ ఫిల్మ్ చూశా. ఎవరు తీశారా అని కనుక్కుంటే ఇషాన్ ఆర్య అని తెలిసింది. అందాల రాముడికి అతన్ని పిలిపిద్దామా అంటే- గొప్ప ఇమేజ్ ఉన్న సూపర్‌స్టార్ అక్కినేనిగారి వద్ద ఎక్స్‌పెరిమెంట్స్ తగదని రమణగారు మందలించారు.

ఆమధ్యే గరం హవా అనే హిందీ సినిమా నేషనల్ అవార్డు పొందినది విడుదలైంది. దానికి కెమెరా ఇషాన్ ఆర్య. ముత్యాలముగ్గులో స్టార్లు లేరుకదా ఇషాన్‌ని రప్పిద్దామా అని అడిగా. రమణగారు సరేనన్నారు.

ముత్యాలముగ్గు కెమెరామెన్‌గా ఇషాన్ ఆర్యకు ఆల్ ఇండియా బెస్ట్ ఫోటోగ్రాఫర్‌గా నేషనల్ అవార్డు ఇచ్చారు. ఔట్‌డోర్‌లో అందులోనూ మేకప్పులు లేని నటుల మొహాలు మాడ్చేసే రిఫ్లెక్టర్స్ అస్సలు వాడేవాడు కాదు. అతని రిఫ్లెక్టర్ తెల్లటి సిల్కుగుడ్డ. మొదటిరోజు క్లోజ్‌షాట్ పెట్టినపుడు ఇది చూసి రావుగోపాలరావుగారు, 'నవాబు గారు మెత్తటి సిలుకుగుడ్డే వాడతారా! మాకు ఆ తగరం మొహం మాడిస్తేగానీ ఆనదు మరి,' అన్నారు నవ్వుతూ.

తెలుగు చలనచిత్ర చరిత్రలో ముత్యాలముగ్గు సినిమా, రావుగోపాలరావుగారి పాత్ర, డైలాగులూ మైలురాళ్ళు. ఆ డైలాగులు షోలే సినిమా గబ్బర్‌సింగ్ డైలాగు రికార్డులకి దీటుగా అమ్మాయి. ముత్యాలముగ్గు డైలాగులు ఎన్ని సినిమాలు అనుకరించాయో మీకు తెలుసు. ఒకాయన కనిపించి, "నిన్న భోయనాల దగ్గర మావాడు ఆవకాయ కలుపుకొని, 'నాన్నా చూడు కంచంలో మడ్డరు జరిగినట్టు లేదూ,' అన్నాడండోయ్," అన్నాడు. గోపాలరావుగారితో, 'కామెడీ యాక్సను మాత్రం చెయ్యద్దండి. కాంట్రాక్టులు దుష్టమైనవి అయినా అది మీ వృత్తి. కామెడీ డైలాగుల్లో ఉంటుంది. మీరుమాత్రం చాలా సీరియస్‌గా ఉండాలి,' అని జాగర్తపడ్డాం.

రావుగోపాలరావుగారి ఇల్లుగా సారథీ స్టూడియోలో ఒక సెట్టు ఎన్నుకొన్నాం. రేపు షూటింగనగా ఇవాళ- వారు వీల్లేదన్నారు. ఆ దిగులుతో రాక్ కాజిల్ అనే హెూటల్ (బండల మధ్య మలచిన బిల్డింగు) టెర్రస్ మీదకెళ్ళి బీరు ఆర్డరు చేశాం. ఆ పరిసరాలు చూసి, అరె ఇదే బ్రహ్మాండంగా ఉందే అనుకొని వెంఠనే కిందకెళ్ళి ప్రొప్రైటరుతో మాట్లాడి మర్నాటి నుంచి షూటింగు మొదలెట్టాం. అద్దె ఎంతంటే, మా హోటల్లో కొన్ని రూమ్స్ తీసుకోండి ఉండేందుకు- మీరు వాడుతున్న అగరొత్తు బ్రాండు పేకట్లు కొన్నివ్వండి అన్నాడు. మర్డరు జరిగిన ఆకాశం, కలాపోసన డవిలాగు, మాడా సీను, సినారెగారి ఎంతటి రసికుడవో... పాట- మొత్తం కంట్రాక్టరు ఇల్లంతా అక్కడే!

శోభనం నాడు భర్త భార్యని, 'ఇంతకుముందు నువ్వెవరినేనా ప్రేమించావా,' అని అడిగితే,

ఆమె 'ప్రేమంటే నాకు తెలీదు. కన్నెపిల్ల మనసు అద్దంలాంటిది. చాలామంది కనిపిస్తుంటారు. పెళ్ళవగానే అది మొగుడిబొమ్మతో పటంగా మారిపోతుంది అని మా అమ్మమ్మ అనేది,' అంటుంది. నాకు చాలా ఇష్టమైన డైలాగు.

రమణగారు తమ సినిమాల్లో స్త్రీ పాత్రలనెప్పుడూ గ్లోరిఫై చేస్తారు. అంటే విజయశాంతి బ్రాండు కాదు. దైనందిన జీవితశాంతి. అనుమానం వచ్చి మొగుడు పొమ్మంటే అమ్మాయి ఏడవదు, పుట్టింటికెళ్ళదు. పల్లెటూరొచ్చి ఆ పనీ ఈ పనీ చేసుకొంటూ ధైర్యంగా పిల్లలిద్దర్నీ పోషించుకొంటుంది. అటు భర్త జమీందారీ కుటుంబం దెబ్బతింటుంది. ఏడేళ్ళ తరువాత మావగారు వెతుక్కుంటూ వచ్చి, 'అబ్బాయికి నచ్చ చెబుతాను నువ్వు తిరిగిరా. నీవు లేకుండా వెళ్ళను,' అంటాడు. అమ్మాయి, 'నేను రాను ఆయన్నే రమ్మనండి. సిఫార్సులతో కాపురాలు చక్కబడవు. మీరు వెళ్ళకపోతే ఇక్కడే ఉండండి. నాకు ముగ్గురు పిల్లలనుకుంటాను. మీ అబ్బాయి గురించి బాధపడుతున్నారు గానీ ఏడేళ్ళుగా నేను పడ్డ క్షోభని ఎప్పుడేనా ఆలోచించారా?' అంటుంది.

ఇది చెప్పేముందు మావగారికి భోజనం పెట్టి పెరట్లో పక్కవేసి వరండాలో స్తంభానికానుకుని నించుని అనలేక అనలేక, "ఆ... ఆ... ఆయన బావున్నారా," అంటుంది.

ఆవిడ నించోవడం- మెల్లిగా తనకి అన్యాయం చేసిన భర్త కుశలం అడగడం ఎక్కడిదో గుర్తుందా? లవకుశ అనే చిత్రరాజంలోది. రాముడు వదిలేసిన సీత వాల్మీకి ఆశ్రమంలో ఇద్దరు పిల్లల్నీ పెంచుకుంటోంది. రాముడు తలపెట్టిన యాగానికి మంత్రి వాల్మీకికి ఆహ్వానం తెస్తాడు.

సీత (అంజలీదేవి)ని చూసి తెల్లబోతాడు. ఆవిడ ఇలాగే నించుని అనలేక అనలేక, "ఆ- ఆయన బావున్నారా," అని అడుగుతుంది. ఆ షాట్ సి. పుల్లయ్యగారికి నా హోమేజ్.

షూటింగు చివరిరోజుల్లో అల్లు రామలింగయ్యగారి కొడుకు యాక్సిడెంట్‌లో మరణించాడు. వద్దంటున్నా ఆయన షూటింగులకి వచ్చేశారు. "బాధ మరిచి పోవాలంటే- పనిచేయడం ఒకటే మార్గం," అన్నారు. సినిమా చివర కోతిగా ఆయన నటన పోలినది చాలా చాలా అరుదు.

సినిమాలో కోతి సృష్టి చేసినవాడితో థామస్ అనే కుర్రాడు అసిస్టెంటుగా వచ్చాడు. కోతికి వేషం లేనపుడు అతను కెమెరా అసిస్టెంట్ల వెనక తిరిగి నానా ప్రశ్నలూ వేసేవాడు. సినిమా అవగానే ఇషానార్యతో బొంబాయి వెళ్ళిపోయాడు. మూడేళ్ళలో ఇండిపెండెంట్ కెమెరామెన్ అయిపోయాడు.

ఇషానార్య గొప్ప మనిషి కూడా. నేనెరిగిన చాలా పెద్ద కెమెరా మెన్లు ఎక్స్‌పోజర్ పెడుతున్నపుడూ అప్పుడూ అసిస్టెంట్లని దగ్గరకు రానిచ్చేవారు కాదు. ఇషాన్ అలా కాదు. ప్రతి అసిస్టెంటునీ తలో రకం పని స్వయంగా చేయమని పురమాయించేవాడు. తప్పులు దిద్దేవాడు. ఒప్పులు పొగిడేవాడు. సినిమాటోగ్రాఫర్ మాన్యువల్ పుస్తకం చూపిస్తూ ఎక్స్‌పోజర్ దగ్గర నుంచి అన్నీ వాళ్ళకి నేర్పేవాడు. కెమెరామెన్ పని యాక్చువల్ షూటింగ్ సగమే! మిగతా సగం డెవలపింగ్ లాబొరేటరీలో అనేవాడు.

యన్.టి. రామారావుగారు ముత్యాలముగ్గుని ఎంత మెచ్చుకున్నారో! 'అర్ధరాత్రి ముహూర్తాలూ- కునుకుతూ కొబ్బరిచిప్పల్లో సిగరెట్ దులుపుతూ టీలు తాగుతూ పెళ్ళికొచ్చిన కుర్రాళ్ళ పేకాటలూ... విరిగిన ఇటుక గోడల మధ్య పెరట్లో తెల్లటి పక్క మీద శోభనం- చూస్తే మా పాతరోజులు గుర్తుకొస్తున్నాయ్," అన్నారు.

బాలనాగమ్మలో బాలవర్ధిరాజులా చిన్న ఫైటు పెడితే రెండొందల రోజు లాడుతుంది అని కూడా అన్నారు. ఫైటు లేకుండా ముత్యాలముగ్గు రోజు తక్కువ ఏడాదిపాటు ఆడింది.





బెస్ట్ రీజనల్ ఫిల్మ్‌గా నేషనల్ అవార్డు ఇచ్చారు. నేను ఢిల్లీ వెళ్ళినపుడు అవార్డు కమిటీ జ్యూరీ సభ్యుడొకరు 'Your own people are your enemies. When we decided to award your picture as the best picture, the Telugu member vehemently argued against our decision saying- "the A.P. Govt. has already given it an award- so another from the centre will be redundant," అన్నారు.

ముత్యాలముగ్గు స్క్రిప్టు, రమణగారు ఒకపక్క ఫైనాన్స్ అరేంజ్ చేస్తూ, మరోపక్క ప్రొడక్షన్ చూసుకుంటూ మధ్యలో తీరిక దొరికినపుడు రాశారు. కాస్ట్ ఆఫ్ ప్రొడక్షన్ పన్నెండున్నర లక్షలు. పావలా, ఆరణాలు టికెట్లున్న రోజుల్లో మొదటి రిలీజు ఇరవై నాలుగోవారానికి రెండు కోట్లు వసూలు చేసింది.

## సీతాకల్యాణం



సీతాకల్యాణం. సంగీతరూపకంలా తీశాము. ఆంధ్ర ప్రేక్షకులు వద్దన్నారుగానీ లండన్, చికాగో ఫిల్మ్ ఫెస్టివల్స్‌లో చూపించారు. రాముడి కండువా పట్టుకుని ప్రథమంగా విదేశాలకి నేనూ వెళ్ళాను. మన పౌరాణిక ఆహార్యం, ఆభరణాలూ నటీనటుల అందం ఫోటోల్లో చూసి ఒక ఆటకి టికెట్లన్నీ అమ్ముడయిపోయాయి. ఒక ఇండియన్ ఎంట్రీ టైముకి రాకపోతే ఆ ఖాళీలో పబ్లిక్ డిమాండ్ మీద రెండోమారు సీతాకల్యాణమే వేశారు. విదేశాల్లో చూపించదగ్గ ట్రిక్ వర్క్ స్టాండర్డ్ లేకపోయినా చాలామందిని అలరించింది. థియేటర్ వద్ద నించున్న నా వద్దకు ఒకావిడ వచ్చి ఇంగ్లాండ్ మాప్ చూపుతూ వేలు పై భాగంలో ఉంచి, "I came all the way from here to see your film," అంది.

మనవాళ్ళ ప్రశంసలు- పాటలు ప్రధానంగా వస్తూంటాయి. వెనక పాత్రలు మాట్లాడుతున్నా పెదాలు కదులుతూ ఉంటాయిగానీ డైలాగులు వినిపించవు. మా ఊరు నరసాపురంలో ప్రేక్షకులు 'సౌండు సౌండు' అని అరిచారట. సత్యజిత్ రాయిగారు ఢిల్లీలో చూసి క్లుప్తంగా రెండే పాయింట్లు చెప్పారు. "The carpet on which Sita sat is of Arabic design. There were no crotons in those times." సీతమ్మవారు పాటపాడిన తోటలో ఓ పక్క క్రోటను మొక్కలు కనిపించాయి ఆయనకి. అంత నిశితంగా చూశారాయన. ఆయన్ని కలుసుకున్నప్పుడు ఆయనతో కలిసి తీయించుకొన్న ఫోటోకి *The long and short of Indian Cinema* అని పేరెట్టాను.

అవార్డ్స్ ఫంక్షన్స్‌కి ఢిల్లీ వెళ్ళినపుడు మరో తమిళ దిగ్దర్శకుడు కె. బాలచందర్ గారు భుజం మీద చెయ్యివేసి, "నేను గుడికెళ్ళను, పూజలు చెయ్యను. నాస్తికుణ్ణనే చెప్పాలి. కానీ మీ సీతాకల్యాణం చూసిన తరువాత వారంరోజులు అవే దృశ్యాలు కళ్ళకి కనిపిస్తూనే ఉన్నాయి," అని మెచ్చుకున్నారు. ఖర్చు పధ్నాలుగు లక్షలు.

## మనవూరి పాండవులు

మనవూరి పాండవులు. మాతృక పుట్టన్నగారి కన్నడ సినిమా అయినా రమణగారు కథనం బాగా మార్చి కృష్ణుడి పాత్ర ప్రవేశపెట్టారు. కృష్ణంరాజుగారు ఆ పాత్రకి అద్భుతంగా సరిపోయారు. ఇదే సినిమా హం పాంచ్ పేరిట హిందీలో తీసినపుడు ఆ వేషం వేసిన సంజీవ్ కుమార్ అంతటివాడు "I can never replace that Telugu boy with his smiling eyes" అనేవారు. ఆరుద్రగారి సిత్రాలు సేయరో శివుడో శివుడా... నువు మందేసి పాడరా నరుడా నరుడా... పాట గుర్తుందా?

నిర్మాత జయకృష్ణగారొచ్చి, "అర్జునుడి వేషానికి ఓ కుర్రాడొచ్చాడు చూడండి. మొగాడికి అంత పెద్ద కన్నుండదు," అన్నారు. ఆ వచ్చినవాడు చిరంజీవి! పాండవులు ఆయన రెండో చిత్రం. తదుపరి గొప్ప మలయాళీ తార అయిన గీత మొదటి సినిమా. మొదటిరోజు షూటింగులో బాలుమహేంద్రగారు షాట్‌కి పన్నెండు రిఫ్లెక్టర్స్ వరుసగా పెట్టారు. నేను హడిలిపోయాను. నిర్మాత జయకృష్ణగారు నా మొహం చూసి బాలుగారి వద్దకెళ్ళి, 'బాపుగారిది ఇషాన్ ఆర్య స్టైలు. కంగారు పడుతున్నాడు రిఫ్లెక్టర్స్ చూసి,' అనగానే బాలూగారు మళ్ళీ ఆ సినిమాకి రిఫ్లెక్టర్ వాడలేదు.



రమణగారు లొకేషన్ చూసి మరీ స్క్రిప్ట్ రాస్తారు. రాజమండ్రి పరిసరాల్లో షూటింగు. కొండ మీద కృష్ణుడి ఆలయం కింద క్షేత్ర పాలకుడు శివుని గుడి. ఎదర నంది విగ్రహం. అది చూసి రావుగోపాలరావుగారితో వస్తున్న అల్లు రామలింగయ్యగారు (కన్నప్ప), "దొరగారూ ఈ విగ్రహం ఇక్కడటండీ! అమ్మమ్మా- తమ పెరట్లో ఉండాల్సింది కాదండీ."

రావు: కన్నప్పా! మునగ చెట్టెక్కించేస్తున్నావు పడితే నీ మీదే పడతాను. పచ్చడయిపోతావు.

అల్లు: అంతటి భాగ్యమా!

భాగ్యం తన మీద అంతటివాడు పడడమా- చట్టి విరిగేట్టు దొరగారు పడడమా!

యస్.పి. బాలుగారి కంఠంతో కృష్ణంరాజుగారు పాడిన పిచ్చిగాలి నువ్వు అరవకే... పాట గుర్తుందా? ఒక్క గిటార్ మటుకే వాయిద్యం- (ఆరుద్రగారి పాట, మామ సంగీతం గుండె కదిలించేస్తాయి.)

దుష్టుణ్ణి చంపితే, అది వాడి హింసకు పరిష్కారం కాదు. వాడి కడుపున ఇంకో దుష్టుడు పుట్టుకొస్తాడు. హింసలు పడుతున్న ప్రజలంతా మేలుకుని సమిష్టికట్టుగా ప్రతిఘటించడమే సరైన మార్గం. ఇది అనంతం అన్నదే సినిమా థీమ్. హీరో హీరోయిన్లు గానీ, ప్రేమపాటలుగానీ, సోకాల్డ్ మసాలాలుగానీ లేకపోయినా ప్రేక్షకులు హర్షించారంటే కథ చెప్పిన తీరూ, డైలాగులూనూ.

ఇది హిందీలో హం పాంచ్ పేరిట బోనీకపూర్ తీశారు. పాటలు మాత్రం చేసిన లక్ష్మీకాంత్ ప్యారేలాల్, యస్.పి. బాలుగారు చేసిన రీ రికార్డింగ్ మహా మెచ్చుకున్నారు.



# బాపు కార్టూన్లు
















